# PITHAPUR RAJAH'S GOVERNMENT COLLEGE(A) KAKINADA

# BA.SPECIAL TELUGU

# 3RD SEMESTER

# Paper 6

# ADHUNIKA TELUGU SAHITYA CHARITRA

**<u>ఆధునిక కవిత్వం - ఆవిర్భావ వికాసాలు</u>**

# 1. ఆధునిక కవిత్వ లక్షణాలు

**ప్ర.1. ఆధునిక కవిత్వం - ఆవిర్భావ వికాసాలు.**

జ॥ ఆధునిక కవిత్వానికి నవ్యకవిత్వమనీ, అభినవ కవిత్వమని పేర్లు కూడా వున్నాయి. ఆధునికత అంటే "సంప్రదాయాలను, సాంప్రదాయికమైన విశ్వాసాలను, ఆచారాలను విసర్జించి, ప్రతి సమస్యను ఆధునిక విజ్ఞాన శాస్త్రాల సహాయంతో, హేతువాద దృష్టితో పరిశీలించుట" అని ప్రముఖ సాహితీ విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డిగారు నిర్వచించారు. ఈ ఆధునికత ఆధునిక సమాజంలోనూ, సాహిత్యంలోనూ అనేక మార్పులను తెచ్చింది. పాశ్చాత్య నాగరికతవల్ల, ఆంగ్ల సాహిత్యంవల్ల, ఆధునిక విజ్ఞానశాస్త్రాల అధ్యయనంవల్ల సమాజంలో హేతువాద దృష్టి పెరిగింది. ఈ దృష్టితో ఆవిర్భవించిందే ఆధునిక కవిత్వం,

భారతదేశంలో 1857లో జరిగిన మొదటి భారత సంగ్రామం ఫలితంగా బ్రిటీషువారు పరిశ్రమల నిర్వహణ కోసం కలకత్తానుండి మద్రాసు వరకు రైలు, రోడ్డు మార్గాలను నిర్మించారు. దానివల్ల పారిశ్రామిక విప్లవం ప్రారంభమైంది. ఈ సమయంలో రాజారామ మోహనరాయ్లు ప్రారంభించిన సంఘ సంస్కరణోద్యమం విస్తృతంగా విస్తరించింది. ప్రజల్లో సంఘ సంస్కరణ దృష్టి పెరిగింది. మంచి చెడుల విచక్షణాజ్ఞానం కలిగింది. రామమోహనరాయ్ సంఘ సంస్కరణోద్యమం కందుకూరిని ఆకర్షించింది. కందుకూరి భావ సారూప్యం కల్గిన కొందరు మిత్రులతో కలసి 'బ్రహ్మసమాజం' అనే సంస్థలో చేరారు. సంఘసంస్కరణలో భాగంగా మొట్టమొదటగా ధవళేశ్వరంలో బాలికా పాఠశాలను నెలకొల్పారు. వివేకవర్ధిని అనే పత్రికను స్థాపించారు. 'రాజశేఖర చరిత్ర' అనే తొలి తెలుగు నవలను రచించారు. 'బ్రహ్మ వివాహం' అనే పేరుతో తొలి ప్రహసనాన్ని వ్రాశారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు. మూఢ విశ్వాసాలను నిరసించారు. ఈ విధంగా ఆధునిక కవిత్వానికి శ్రీకారం చుట్టారు. కందుకూరి వారి సాంఘిక, సాహిత్య ఉద్యమాలు ఆనాటి యువకులైన మేధావులను విశేషంగా ఆలోచింపజేశాయి. మేధావులంతా ఒక్కటయ్యారు. ప్రాచీన తెలుగు సాహిత్యంలో స్థిరపడిన ఇతివృత్తాలను తిరస్కరించారు. సంఘాన్ని సంస్కరించాలని మూఢవిశ్వాసాలను, దురాచారాలను

అంతమొందించాలని దృఢంగా నిశ్చయించుకున్నారు. వీరికి తోడుగా ఆనాడు క్రైస్తవ మత వ్యాప్తి కోసం. ప్రారంభించిన పత్రికలు, ముద్రణా యంత్రాలు ప్రజల దృష్టిని, కవుల దృష్టిని ఆధునికత వైపు మళ్లించి ఆధునిక కవితా వ్యాప్తికి దోహదం చేశాయి.

గురజాడ అప్పారావుగారు సంఘ సంస్కరణ దృక్పథంతో సాంఘిక దురాచారమైన కన్యాశుల్కాన్ని నిరసిస్తూ సజీవ పాత్రచిత్రణతో వ్యావహారిక భాషలో 'కన్యాశుల్కం' అనే నాటకాన్ని రచించి విస్తృతంగా ప్రదర్శింపజేశారు. కవిత్వంలో, ఇతివృత్తంలో, రూపంలో క్రొత్త ఒరవడిని సృష్టించి ముత్యాల సరాలు అనేనూతన ఛందస్సులో బాల్యవివాహాలు, కన్యాశుల్కం అనే దురాచారాలను నిరసిస్తూ "పూర్ణమ్మ కథ" అనే హృదయవిదారక గాథను వ్రాశారు. ఇలా వీరిలో అంకురించిన ఈ ఆధునిక దృక్పథం శ్రీశ్రీ కవిత్వంలో వికసించి ఫలవంతమైంది. పాశ్చాత్య దేశాల్లోని ఆధునిక ధోరణులైన కాల్పనికవాదం, మానవతావాదం వంటి కళాసిద్ధాంతాలు కూడా తెలుగు కవులకు క్రొత్త చూపును కలిగించాయి. తత్ఫలితంగా ఆధునిక కవిత్వం ఆవిర్భవించింది.

......................

ప్ర. 2. ఆధునికాంధ్ర కవిత్వ లక్షణాలు.

జ డా॥ సి. నారాయణరెడ్డిగారు 'ఆధునికాంధ్ర కవిత్వం- సంప్రదాయములు - ప్రయోగములు" అనే సిద్ధాంత గ్రంథంలో ఆధునిక కవిత్వ లక్షణాలను సహేతుకంగా వివరించారు.

1. ఖండకావ్య ప్రక్రియ:-చిన్న కథ కలిగినది లేదా ఒకే వస్తువును ఆశ్రయించినది. గాని అయిన దానిని ఖండకావ్యం అంటారు. ఈ ప్రక్రియలో ప్రకటించిన విషయం పత్రికలలో ప్రచురించటానికి, పాఠకులు సులభంగా చదువుకోవటానికి వీలుగా వుంటుంది కాబట్టి ఆధునిక కవులు ఖండకావ్య ప్రక్రియను ఆదరించారు.

2. ఆత్మాశ్రయ రీతి :- ఆధునిక కవిత్వం 1. వస్త్వాశ్రయరీతి, 2. ఆత్మాశ్రయరీతి అని రెండు విధాలు. వస్త్వాశ్రయరీతిలో ఇతివృత్తం (కథ) ప్రధానంగా వుంటుంది. పాత్రలే కథను నడుపుతాయి. ఆత్మాశ్రయరీతిలో కవితకు తానే నాయకునిగా తన కథను చెపుతాడు. ఆధునిక కవిత్వంలో ఆత్మాశ్రయరీతి కవిత్వం ప్రాధాన్యాన్ని పొందిది.

3. వస్తు నవ్యత:- ప్రాచీన కవిత్వంలో దేవతలు, అగ్రవర్ణాల వారు నాయికా నాయకులుగా వుండేవారు ఆధునిక కవిత్వంలో సమాజంలోని సామాజిక సమస్యలు ఇతివృత్తాలయ్యాయి. సామాన్యులు అట్టడుగు వర్గాలవారు నాయికా నాయకులయ్యారు.

4. భావ నవ్యత :- ప్రాచీన కవిత్వంలో కథకన్నా కల్పనలకు, వర్ణనలకు, కృత్రిమ భావాలకు, అలంకారాలకు ప్రాధాన్యం ఎక్కువగా వుండేది. ఆధునిక కవిత్వంలో క్రొత్త క్రొత్త భావనలు అవస కానికి తగిన వర్ణనలు అధికంగా వుంటాయి. శాస్త్రీయమైన అవగాహనతో విన్నదాని కంటే కంటితో చూచిన దానికే ప్రాధాన్యం కన్పిస్తుంది.

5. శైలీ నవ్యత:- ప్రాచీన కవిత్వంలో పదాడంబరాలు పాండితీ ప్రకర్షకి ప్రాధాన్యం వుంటుంది. శ్లేషలు, గర్భబంధ చిత్ర కవితలు పండితుల కోసం సాక్షాత్కరిస్తాయి. ఆధునిక కవిత్వంలో శైలీ సారళ్యం కన్పిస్తుంది. కొత్త పదబంధాలు, ప్రతీకలు ఉపమానాలు కన్పిస్తాయి. వ్యావహారిక భాషకు ప్రాధాన్యం వుంటుంది. గేయకవిత, వచన కవితమాత్రాఛందస్సు వంటి వాటికి ప్రాధాన్యం వుంటుంది.

6. ప్రక్రియా బాహుళ్యం:- ప్రాచీన కవిత్వం కంటే ఆధునిక కవిత్వంలో ప్రక్రియా బాహుళ్యం అధికంగా వుంటుంది. ఆధునిక కవులు కవిత్వాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లారు. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో ఎలిజీ, పారడీ వంటి సాహిత్య ప్రక్రియలను అనుసరించారు. వచన కవితను విస్తరింపజేశారు. పల్లీజన కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, భక్తి కవిత్వం వంటి ప్రక్రియలు బహుళ ప్రచారం పొందాయి.

..............................

ప్ర. 3. కందుకూరి వీరేశలింగం.

జ॥ ఆంధ్రసాహిత్య చరిత్రలో కందుకూరి వారి స్థానం విశిష్టమైనది. వీరు ఆంగ్ల సాహిత్య ప్రక్రియలన్నింటిని తెలుగులోనికి తెచ్చారు. సాంఘిక చైతన్యం కోసం, సారస్వత వైవిధ్యం కోసం, విశేషంగా కృషి చేశారు. నవ్యసాహిత్య ప్రక్రియలకు గొప్ప ప్రచారం కల్పించారు. ఉత్తమ సంఘసంస్కర్తగా సాహితీవేత్తగా, మహాకవిగా, మేధావిగా మన్ననలందుకున్నాడు. పాత కొత్తల మేలు కలయికకు మార్గదర్శకులయ్యారు. దక్షిణ హిందూ దేశ విద్యాసాగరుడు. గద్య తిక్కన వంటి బిరుదులను పొందారు. శ్రీశ్రీ. ఆరుద్రలవంటి సాహితీ పరుల ప్రశంసలందుకున్నారు.

శ్రీ వీరేశలింగం పంతులుగారు 1848 ఏప్రియల్ 16 తేదీన రాజమహేంద్రవరంలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. అక్కడే వున్న ఒక వీధిబడిలో చేరిఅక్షరాలు, గుణింతాలు, ఎక్కాలు నేర్చుకున్నారు. తర్వాత కొంత కాలానికి మరొక వీధిబడిలో చేరి బాలరామాయణం, అమర నిఘంటువు, రుక్మిణీ శతకం, కృష్ణ శతకం, ఆంధ్ర నామసంగ్రహం వల్లెవేశారు. 1860లో ఇంగ్లీషు నేర్చుకోవటం కోసం బ్రిటీష్ వారి మండల పాఠశాలలో చేరారు. కేశవ చంద్రసేన్ ఉపన్యాసాలకు ఆత్మూరి లక్ష్మీ నరసింహంగారి ప్రబోధాలకులోనై 'బ్రహ్మ సమాజంలో చేరారు. రెండు శతకాలు రచించారు. వీరి "అభాగ్యోపాఖ్యానం"లో హేళనాపూర్వకమైన సంఘ సంస్కరణ దృష్టి కనపడుతుంది. పద్య వ్యంగ్యాత్మకమైన "సరస్వతీ నారద సంవాదం"లో ఆధునిక సాహిత్య దృక్పథం, అవగతమవుతుంది. వీరు ఆంగ్లంలోని 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్" అనే నాటకాన్ని 'చమత్కార రత్నావళి' అనే సంస్కృత రూపకాన్ని తెలుగులోనికి అనువాదం చేశారు.

శ్రీకందుకూరి వారు బ్రిటీష్ వారి మండల పాఠశాలలో సహోపాధ్యాయునిగా కొంతకాలం పని చేశారు. కోరంగి, ధవళేశ్వరంలోని ఆంగ్ల పాఠశాలలో ప్రధానాధ్యాపకునిగా ఉద్యోగించారు. ధవళేశ్వరంలో పనిచేసే కాలంలో అష్టావధానం చేశారు. హాస్య సంజీవని వివేకవర్ధిని పత్రికల్ని ప్రారంభించారు. సమకాలీన సమాజంలో ఎన్నో మార్పులను తెచ్చారు. స్త్రీ విద్యను గూర్చి పద్యాత్మకమైన వ్యాసం వ్రాశారు. చిన్న పిల్లలకోసం నీతి పద్యాలు, నీతిచంద్రిక, నీతి దీపిక వంటి

రచనలు చేశారు. స్త్రీలను ఉత్తమ సంస్కారులను చేయటం కోసం 'సతీహితబోధిని" అనే పత్రికను స్థాపించి అందులో మాతృపూజ, పితృపూజ, సత్యాద్రౌపదీ సంవాదం మొదలైన వాటిని గూర్చి పద్యాలు, పాటలు వ్రాశారు. స్త్రీ జనోద్ధరణ కోసం తీవ్రంగా శ్రమించారు. చెన్నపట్నంలోని తన యింట్లో వితంతు శరణాలయాన్ని, సంఘసంస్కరణ సమాజమందిరాన్ని నిర్మించారు. రాజమహేంద్రవరంలో స్త్రీ ప్రార్థనా సమాజమందిరాన్ని, పతిత యువతీ రక్షణశాలను, బాలికా పాఠశాలను, వితంతు శరణాలయాన్ని స్థాపించారు. బ్రహ్మ సమాజంకోసం బెంగుళూరులో ప్రార్ధనా మందిరాన్ని కట్టించారు. వీరి తర్వాత వచ్చిన కవులందరూ వీరి మార్గాన్నే అనుసరించారు.

శ్రీ కందుకూరిగారు బ్రాహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని, జమీందారీ ధర్మ ఖర్చు, దంభాచార్య విలసనము, వేశ్యాప్రియ ప్రహసనము రచించారు. సాంఘిక నాటకాల్లో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టారు. ప్రథమాంధ్ర నాటక సమాజాన్ని స్థాపించారు. స్త్రీల కోసం బాలికల కోసం 189 ఉపన్యాసాలు, స్త్రీ విద్య, పునర్వివాహాలను గూర్చి 46 వ్యాసాలు వ్రాశారు. రావుబహద్దూర్ బిరుదును పొందిన వీరు 1919 మే నెల దివంగతులయ్యారు.

.....................................

ప్ర. 4. గిడుగు రామమూర్తి.

జ|| శ్రీ గిడుగు రామమూర్తి వాడుక భాషా యోధుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. కారణజన్ముడు. వ్యావహారిక భాషోద్యమ ప్రవక్త. సత్యవాది, స్థిరసంకల్పుడు. మేధావి. సంప్రదాయ పరిరక్షకుడు, అభ్యుదయగామి. ఆధునికాంధ్ర సాహిత్యయుగంలో తెలుగు భాషకి జవజీవాలు కల్గించడానికి, ప్రజల భాషకి సాహిత్య స్థాయి కల్పించటానికి, సవర భాషాభ్యుదయానికి తన జీవితాన్ని త్యాగం చేసిన పరిశుద్ధ మనస్కుడు. ఆధునికాంధ్ర వాగనుశాసనునిగా, భాషా వైద్యునిగా సమకాలీకుల ప్రశంసలందుకున్న ప్రతిభాశాలి. వ్యావహారిక భాషాయుగాన్ని పరిణామ క్రమంలోని మార్పుల్ని, దాని చైతన్య లక్షణాల్ని రక్షించి వ్యావహారిక భాషకు ఎంతో మేలు చేసిన నిస్వార్థ చింతనాపరుడు.

శ్రీరామమూర్తి పంతులుగారు శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో వీర్రాజు వెంకమ్మదంపతులకు 1863 ఆగస్టు 29వ తేదీన జన్మించారు. వీరి కుటుంబం చదువు సంధ్యలకు, సంపదలకు, వ్యవహార దక్షతకు, అతిథి మర్యాదలకు పేరు పొందింది. రామమూర్తిగారికి 5వ సం॥లోనే అక్షరాభ్యాసం జరిగింది. వీరికి ఇద్దరు చెల్లెళ్లు. తండ్రి వీర్రాజు 1875లోనే మరణించారు. వీరు విజయనగరంలో నివసించేవారు. అందువల్ల రామమూర్తిగారు గురజాడ అప్పారావుగారితో కలసి మహారాజా వారి విద్యాసంస్థల్లో లోయరు ఫోర్తులో చేరారు. 1879 వరకు ఇద్దరు కలసి చదువుకొని మెట్రిక్యులేషన్లో ఉత్తీర్ణులయ్యారు. గురజాడ ఆర్థిక పరిస్థితి బాగా వున్నందున ఆయన పై చదువులకు వెళ్లాడు. కాని ఆర్థిక పరిస్థితి సరిగా లేని రామమూర్తి చదువుకు స్వస్తి చెప్పి తల్లి బలవంతంమీద భీముని పట్నానికి చెందిన కందకొండ రామదాసు రెండవ కుమార్తె అయిన అన్నపూర్ణమ్మను వివాహం చేసుకున్నారు.

రామమూర్తిగారు మెట్రిక్యులేషస్ పూర్తయిన తర్వాత కొంత కాలం కలెక్టరు ఆఫీసులో పనిచేసి తర్వాత కొండ ప్రాంతంలో వున్న “పర్లాకిమిడి" హైస్కూల్లో 30 రూపాయల జీతానికి బడిపంతులుగా చేరారు. 1880 నుండి 1936 వరకు అంటే దాదాపు 56 సంవత్సరాలు అక్కడే ఉపాధ్యాయునిగా పనిచేశారు. 1882లో 'యఫ్.ఏ" పరీక్ష పాసై ఫస్ట్ ఫారం ఉపాధ్యాయుని హెూదానుండి 4, 5, 6 తరగతుల మాష్టరుగా ఎదిగారు. బి.ఏ. ప్రైవేటుగా చదివి ఉత్తీర్ణులయ్యారు. ఆయన చరిత్ర పాఠాలు చెప్పే వారు రామమూర్తిగారికి హెూదా, జీతం, కుటుంబం పెరిగింది కాని జీతం మాత్రం 65 రూపాయల వద్దనే నిలిచిపోయింది.

గిడుగువారు గ్రాంధిక భాషా ద్వేషి కాదు. ఆయన ప్రాచీన సాహిత్యంలో చదువని గ్రంథంలేదు. తెలియని అర్థం లేదు. గ్రాంధిక భాషావాదుల కన్నా గొప్ప పాండిత్యాన్ని భాషాధికారాన్ని సంపాదించారు. తాను ఉద్యోగం చేస్తున్న పర్లాకిమిడిలో జరిగే అన్ని సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనేవారు వీరేశలింగం గారి సంస్కరణల్ని సమర్థించేవారు సంస్కృతంలోని ప్రామాణిక గ్రంథాలను చదివి తన వాదానికి సాక్ష్యం చూపేవారు. పర్లాకిమిడి రాజాగారి తమ్ముడికి ట్యూటరు నియమింపబడినపుడు వీరి దృష్టి 'సవరల' భాషపై పడింది. వీరు సవరల ఆచార వ్యవహారాలను,

పర్లాకిమిడికి 20 మైళ్ల దూరంలో వున్న ముఖలింగం ఆలయంలోని భీమేశ్వరాలయం, సోమేశ్వరాలయంలను గూర్చిన వివరాలు తెలుసుకున్నారు. పట్టుదలతో సవరల భాష నేర్చుకున్నారు. ఆ భాషలోని పదజాలాన్ని శోధించి, భాషా తత్త్వాన్ని తెలుసుకొని రెండు నిఘంటువులు వ్రాశారు. విలువైన పాత నాణాలను సేకరించారు. తెలుగువారికి 'తుది విన్నపం' చేస్తూ భాషాభిమానాన్ని ప్రకటించారు. వీరి వ్యావహారిక భాషోద్యమంవల్ల ఆధునిక సాహిత్యం క్రొత్త సొగసులను సంతరించుకుంది. రచనా వైవిధ్యం వైశిష్ట్యంలో పుష్టి చేకూరింది. వాడుక భాష గౌరవం పెరిగింది. పత్రికలు పెరిగాయి. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా గుర్తింపబడింది. దీనికంతటికి గిడుగువారు మూలకారణం అని చెప్పటం అతిశయోక్తికాదు. వీరు 1940 జనవరి 22వ తేదీన చెన్నపట్నంలో దివంగతులయ్యారు.

...............................

ప్ర. 5. గురజాడ వెంకట అప్పారావు.

211 ఆధునిక తెలుగు సాహిత్యరంగ ధృవతార శ్రీ గురజాడ. వీరు నవయుగ వైతాళికులు, దేశభక్తులు, ప్రజాకవి. సంఘసంస్కర్త, పరిశోధకులు, భాషావేత్త, నాటక కర్త. క్రొత్తదనాన్ని, క్రొత్త ఒరవడులను సృష్టించి తెలుగు జాతిని జాగృత పరచిన మేధావి. వీరు విజయనగరం జిల్లా యలమంచిలి తాలూకా, రాయవరం గ్రామంలో కౌసల్యమ్మ వెంకట రామదాసు దంపతులకు 1862 సెప్టెంబరు 21 వ తేదీన జన్మించారు.

శ్రీ గురజాడ వారి విద్యాభ్యాసం చీపురుపల్లి గ్రాంటు స్కూల్లోను, విజయనగరం మిడిల్ స్కూల్లోను జరిగింది. వీరు బి.ఏ. పరీక్షలు వ్రాయటానికి ముందు కొంతకాలం విజయనగరంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా, తర్వాత కొంతకాలం డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్ గుమస్తాగా పనిచేశారు. 1887 సం॥లో విజయనగరం మహారాజా కళాశాలలో తెలుగు ఉపన్యాసకునిగా, ఆ రాజు సంస్థానంలో ఉన్నత ఉద్యోగిగా చేరారు 1896లో ఉపన్యాసక ఉద్యోగాన్ని వదలిపెట్టి విజయనగర సంస్థానంలో పరిశోధకునిగా చేరి 1898 నుండి ఆనంద గజపతిరాజు సోదరియైన 'రేవా' మహారాణికి ఆంతరంగిక కార్యదర్శిగా వుంటూ కావ్య రచనలు చేపట్టారు. రాజావారి పండిత

గోష్ఠుల్లో ప్రముఖ పాత్ర వహించారు. శాసన పరిశోధకునిగా ఎన్నో చారిత్రక సత్యాల్ని వెలుగులోకి తెచ్చారు. కళింగ దేశ చరిత్ర, పూసపాటి వంశ రాజ చరిత్ర సమాచారాన్ని సంపాదించారు. సంస్థానానికి సంబంధించిన లావాదేవీలన్నీ స్వయంగా పర్యవేక్షించారు. 1897లో మహారాణి అప్పల కొండమ్మగారి అంతరంగిక కార్యదర్శిగా నియమితులయ్యారు. న్యాయ శాస్త్రాన్ని అభ్యసించారు. గిడుగువారి వ్యావహారిక భాషా ఉద్యమానికి సంపూర్ణంగా సహకరించారు. యూనివర్సిటీ పరీక్షాధికారిగా, పాఠ్యనిర్ణాయక సంఘుసభ్యునిగా, విద్యాశాఖకు చెందిన అన్ని కమిటీల్లోను సభ్యునిగా ప్రముఖ పాత్ర పోషించారు. మద్రాసు విశ్వవిద్యాలయ శాశ్వత సభ్యునిగా నియమితులయ్యారు.

అప్పారావుగారు మెట్రిక్యులేషన్ చదివే రోజుల్లోనే 'కోకిల' అనే ఖండ కావ్యాన్ని రచించారు. 1887లో విక్టోరియా మహారాణిని ప్రశంసిస్తూ ఇంగ్లీషులో పద్యాలు వ్రాశారు. కన్యాశుల్కం, బిల్హణీయం, కొండుభట్టీయం అనే నాటకాలు వ్రాశారు. సంఘు దురాచారాల్ని 'కన్యక', 'పూర్ణమ్మ' కథల్లో విశదం చేశారు, దిద్దుబాటు, మీ పేరేమిటి వంటి కథానికలు, దేశభక్తి గేయము వ్రాశారు కన్యాశుల్కం నాటకం ద్వారా వ్యావహారిక భాషకు ప్రాణంపోశారు.

ఈ విధంగా సామాన్య ప్రజానీకం కోసం, విశ్వమానవ సమానత్వం కోసం, శ్రేయస్సు కోసం పుట్టింది మొదలు మరణించే వరకు అవిశ్రాంతంగా శ్రమించి ఉద్యోగం పరిశోధన, కావ్యరచన మొదలైన వాటికి జీవితాన్ని అంకితం చేసిన శ్రీగురజాడ వేంకట అప్పారావుగారు 1919లో దివంగతులయ్యారు.

..........................

## 2. ఆధునిక సాహిత్యంలో ఉద్యమాలు, వాదాలు, ధోరణులు

ప్ర. 6. ఆధునిక కవిత్వంలో ఉద్యమాలు.

జ ॥ తెలుగులో ఆధునిక కవిత్వం ఉద్యమ రూపంలోనూ, అస్తిత్వ వాద ధోరణిలోన కాలక్రమంలో వికసించింది.

1. జాతీయోద్యమ కవిత్వం : తెలుగు కవులు భారతజాతిని బానిసత్వం నుండి విముక్తం చేయాలనే తలంపుతో తమ తమ రచనల ద్వారా ప్రజల హృదయాల్లో జాతీయోద్యమభావాలను అంకురింపజేసే ప్రయత్నం చేశారు. 'బిపిన్ చంద్రపాల్' అనే దేశభక్తుడు దక్షిణ భారతదేశంలోని ప్రముఖమైన పట్టణాల్లో ప్రజలను జాతీయోద్యమం వైపు మళ్లించేందుకు ఉత్తేజభరితమైన ప్రసంగాలు చేశారు. చిలకమర్తి లక్ష్మీనరసింహారావుగారు వారి ప్రసంగాలను అనువాదం చేసేవారు. వారు తాను స్వయంగా వ్రాసిన "భరతఖండంబు చక్కని పాడియావు" అనే పద్యం గురజాడవారి 'దేశమును ప్రేమించుమన్నా" అనే గేయం. రాయప్రోలువారి 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా' అనే గేయం, త్రిపురనేని 'వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెలుపుడీ' అనే గేయం, 'మా కొద్దీ తెల్లదొరతనము' అనే గరిమెళ్ల సత్యనారాయణ గేయం ప్రజల్లో దేశాభిమానాన్ని జాతీయోద్యమ స్ఫూర్తిని కల్గించాయి. విశ్వనాథ, తుమ్మల, జాషువా, దువ్వూరి, కరుణశ్రీ వంటి కవులు ఆంధ్రాభిమాన రచనకు పూనుకున్నారు. త్రిపురనేని, గరిమెళ్ల సత్యన్నారాయణ, ఇంద్రగంటి వంటి కవులు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారు. ఈ విధంగా ప్రతి కవీ తమ రచనల ద్వారా స్వాతంత్ర్య సాధనకు కారకులయ్యారు.

2. భావకవితా ఉద్యమం : ఆంగ్ల సాహిత్యంలోని రొమాంటిక్ పోయిట్రీ ప్రభావంతో తెలుగులో భావకవిత్వం వచ్చింది. మొట్టమొదటగా భావకవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావు సృష్టించారు. ఇది రాయప్రోలు, అబ్బూరి రామకృష్ణారావులతో ప్రారంభమైనా దేవులపల్లి కృష్ణశాస్త్రి నాయకత్వంలో మరింత ముందుకు వేగంగా సాగింది. ఆయన వ్రాసిన 'కృష్ణపక్షం', తల్లావజ్ఝల వారి 'హృదయేశ్వరి' నాయని వారి 'సౌభద్రుని ప్రణయయాత్ర,', వేదుల వారి 'దీపావళి', నండూరి వారి 'ఎంకి పాటలు' భాష కవితాయుగంలో వెలసిన ప్రముఖ కావ్యాలుగా గుర్తింపును పొందాయి. ఈ భావకవిత్వం

ప్రణయ కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, ప్రకృతి కవిత్వం, భక్తితత్త్వం,స్మృతి కవిత్వం మొదలైన విభాగాలుగా విభజింపబడింది.

3. అభ్యుదయ కవితా ఉద్యమం :- మార్క్సిజం ప్రభావంతో అభ్యుదయ కవితా ఉద్యమం ఆవిర్భవించింది. శ్రీశ్రీ, పఠాభి, నారాయణబాబులు మొట్టమొదటసారిగా భావ కవిత్వంపై తిరుగుబాటు చేశారు. శ్రీశ్రీ తన మహాప్రస్థానంలోని 'జయభేరి' ఖండికతో అభ్యుదయ కవితారచనకు శ్రీకారం చుట్టారు. 1943లో తెనాలిలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం మహాసభలో తాపీ ధర్మారావు చేసిన అధ్యక్షోపన్యాసం, వీరి 'నవ కవిత' ఖండికలోని "కదిలేది కదిలించేది" అనే గీతం, నర్సరావుపేట నవ్యకళాసమితి ప్రచురించిన 'నయాగరా కవితాసంపుటి, అభ్యుదయ కవితకు మేనిఫెస్టోగా ఆధునిక కవులు భావించారు. అనిసెట్టి "అగ్నివీణ", ఆరుద్ర 'త్వమేవాహమ్', దాశరథి అగ్నిధార', సోమసుందర్ 'వజ్రాయుధం', కుందుర్తి 'తెలంగాణా', రెంటాల 'సంఘర్షణ', వంటి కవితా సంపుటాలు అభ్యుదయ కవితా ఉద్యమానికి ఊపిరిపోశాయి. వర్గసంఘర్షణ, విప్లవ ప్రబోధం, వీరగాథాకథనం యుద్ధ విముఖత శాంతి కాముకత, సమసమాజ నిర్మాణం, చారిత్రక నిరాసం, తెలంగాణా విముక్తి ఆంధ్రరాష్ట్రోద్యమం వంటి లక్షణాలు అభ్యుదయ కవితా ఉద్యమంలో ప్రధానంగా కన్పిస్తాయి.

4. దిగంబర కవితా ఉద్యమం:- ఆధునిక తెలుగు కవిత్వంలో ఒక మెరుపులా మెరిసి, సంచలనాన్ని సృష్టించి కనుమరుగైన కవితా ఉద్యమం దిగంబర కవితా ఉద్యమం. సమాజ వ్యవస్థలో విసిగి వేసారి పోయిన ఆరుగురు యువకవులు (జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, మహాస్వప్న, భైరవయ్య, చెరబండరాజు, నగ్నముని) విలక్షణ పద్ధతిలో మూడు కవితా సంపుటాలను వెలయించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో తిరుగుబాటు తత్త్వం, అంతర్జాతీయ దృక్పథం, అణుయుద్ధం, వ్యక్తిస్వేచ్ఛ వర్గపోరాటం, సమసమాజ నిర్మాణం, ప్రపంచ శాంతి వంటి అంశాలను ఆశిస్తూ తీవ్ర పదజాలంతో రచనలు చేశారు. ఈ శ్రీ ఉద్యమం తీవ్రవిమర్శలకులోనై అనతి కాలంలోనే అంతరించింది.

5. విప్లవ కవితా ఉద్యమం:- విప్లవం వస్తువుగా వచ్చే కవిత్వం విప్లవ కవిత్వం.

శ్రీశ్రీ షష్టిపూర్తి తర్వాత ఆయనే అధ్యక్షునిగా కె.వి.రమణారెడ్డి, వరవరరావు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, నగ్నముని కొడవటిగంటి, కాళీపట్నం రామారావు సభ్యులుగా విప్లవ రచయితల సంఘం ప్రారంభమైంది. విప్లవం లక్ష్యంగా విప్లవ కవితా లక్షణాలతో ఎన్నో కవితాసంపుటాలు వచ్చాయి. మార్చ్, లేవండి వంటి విప్లవ కవితా సంపుటాలను ప్రభుత్వ నిషేధించింది. ఈ ఉద్యమంలో పలువురు రచయితలు విప్లవ గేయాలతో ప్రజల్లో చైతన్యం తెచ్చారు.

6. అస్తిత్వవాద కవితాధోరణులు:

స్త్రీ వాదం:-"పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ అణచివేతకు గురవుతుంది. లైంగికత్వం. సంతానోత్పత్తి, ఇంటి చాకిరి వంటి పురుషాధిక్య సంబంధాలనుండి స్త్రీలు రక్షింపబడాలి. వీరికి కూడా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, సమానత్వం, సమాన హక్కులు ఉండాలి" అనే ఆశయంతో స్త్రీవాద కవిత్వం ఆవిర్భవించింది. త్రిపురనేని శ్రీనివాస్ "గురిచూచి పాడే పాట" అనే తొలి స్త్రీవాద కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఓల్గా, వసంత కన్నాభిరామన్లు "నీలిమేఘాలు" అనే కవితా సంకలనాన్ని వెలయించారు. సావిత్రి, సుమతి, నిర్మల, విమల, రజని, రాజేశ్వరి వంటి రచయిత్రులు స్త్రీ వాద ధోరణితో కవితలు వ్రాశారు. ఎస్. గోపి, ఎండ్లూరి సుధాకర్ వంటి పురుష రచయితలు కూడా స్త్రీ వాద ధోరణిలో కవితలు వ్రాశారు.

దళిత వాద కవిత్వం:- అంబేద్కర్, పూలే సిద్ధాంతాలు ప్రాతిపదికగా దళితవాద కవిత్వం ఏర్పడింది. హరిజన, గిరిజన, మైనార్టీ, వెనుకబడిన వర్గాల సాహిత్యంగా దళిత వాదం వచ్చింది. జాషువా, బోయిభీమన్న, కుసుమ ధర్మన్న, కొలకలూరి ఇనాక్, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి వంటి వారి కవిత్వంలో దళిత స్పృహ బలీయంగా కన్పిస్తుంది. జాషువా "గబ్బిలం", బోయి భీమన్న "గుడిసెలు కాలిపోతున్నాయి" సతీష్ చందర్ "పంచమ వేదం", ఎండ్లూరి సుధాకర్ "నిషిద్ధ మానవుడు" వంటి కవితలు దళిత చైతన్యాన్ని ప్రబోధించాయి.

ముస్లిం మైనారిటీ వాద కవిత్వం:- కవులు తమ ఉనికి కోసం, హక్కుల పరిరక్షణ కోసం, ముస్లిం మైనారిటీ వాద కవిత్వానికి శ్రీకారం చుట్టారు. ప్రతిభావంతులైన వజీర్ రెహ్మాన్, ఇస్మాయిల్, దేవీప్రియ, సుగమ్బాబు వంటి ముస్లిం మైనారిటీ కవులు గొప్ప కవితలు వ్రాశారు. ఈ

సమయంలోనే ముస్లిం స్త్రీ వాద కవిత్వం కూడా ఆరంభమైంది. 'షాజహానా' అనే రచయిత్రి ముస్లిం బురఖా ఆచారాన్ని 'రజియాబేగం' భారతదేశంలో ముస్లిం స్త్రీకి జరుగుతున్న అన్యాయాన్ని నిరసించారు. 'మహేజబీన్' ముస్లిం స్త్రీల బాధల్ని వర్ణించింది. షంషాద్ బేగం 'తలాక్' సంప్రదాయాన్ని నిరసిస్తూ కవితలు వ్రాసింది.ఈ కాలంలోనే ముస్లిం వాద కవితా ధోరణితోపాటు బి.సి.వాద కవితాధోరణి, ప్రాంతీయవాద అస్తిత్వ కవితాధోరణి వంటి కవిత్వాలు, మినీ కవిత్వం, హైకూలు, నానీలు, రెక్కలు, కిరణాలు వంటి కవితా ప్రక్రియలు విరివిగా వచ్చి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ఈ విధంగా ఆధునిక కవిత్వం ఉద్యమరూపంతోను, అస్తిత్వ వాద ధోరణులతోను కాలక్రమంలో చక్కగా వికసించింది.

.....................................

# 3. ఆధునిక కవిత్వ ప్రక్రియలు

ప్ర. 8. ఆధునిక కవిత్వ ప్రక్రియలను గూర్చి వ్రాయండి.

జ.పాశ్చాత్య కవిత్వ ప్రభావంవల్ల క్రొత్తదనానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకోవటంచ ఉద్యమాల ప్రభావం వల్ల, ఆధునిక కవిత్వంలోకి అంతకుముందులేని క్రొత్త కవిత్వం ప్రక్రియలు ప్రవేశించాయి.

1. ఖండ కావ్యం :- ఖండ కావ్యమనగా చిన్నకథ, కొన్ని పాత్రలు, పరిమిత పద్యములుండి, ఆశ్వాస విభక్తము కాని రచన కావచ్చును. లేక ఒక పద్యమో, కొన్ని, పద్యములో ఉన్న రచన కావచ్చును" అని నారాయణరెడ్డిగారు ఖండ కావ్యాన్ని నిర్వచించారు.

తెలుగులో ఖండ కావ్య ప్రక్రియను ప్రవేశపెట్టిన ఘనత గురజాడకు దక్కుతుంది.

ఆయన రచించిన 'పూర్ణమ్మ' రాయప్రోలు 'తృణకంకణం' ఖండ కావ్య ప్రక్రియని పరిపుష్టం చేశాయి. అటు తర్వాత జాషువా, విశ్వనాథ, నాయని, అబ్బూరి, వెంకట పార్వతీశ కవులు, వేదుల, దేవులపల్లి, పింగళి, కాటూరి, శ్రీశ్రీ, కరుణశ్రీ మొదలైనవారు పద్యాలతో ఖండ కావ్యాలు వ్రాసి కీర్తిని గడించారు. కుందుర్తి, నారాయణరెడ్డి వంటివారు వచన కవిత్వంలో ఖండ కావ్యాలు

వ్రాసి ప్రసిద్ధిని పొందారు. ఖండకావ్య ప్రక్రియలో ప్రసిద్ధునిగా పేరుగాంచిన జాషువా ఎవ్వరూ స్పృశించని గిజిగాడు, సాలీడు, చీమ, శిశువు, శ్మశాన వాటిక వంటి కవితా వస్తువులతో ఖండ కావ్యాలు వ్రాశారు. విశ్వనాథ దేశభక్తిని ప్రబోధించే ఖండకావ్యాలు వ్రాశారు. ఆధునిక పద్యకవులైన సంపత్కుమార, బేతవోలు, భూమయ్య, రసరాజు, నాగభైరవ మొదలైనవారు కూడా ఖండకావ్యాలు రచించారు.

2. ముత్యాలసరం:-ముత్యాలసరం అంటే ముత్యాల దండ అని అర్థం. "ముత్యాలదండలా, సొంపుగా, అనంద జనకంగా, సహజసుందరంగా వుంటుందనే భావంతో గురజాడ "ముత్యాలసరం" అనే దేశీయమైన ఛందస్సును ప్రవేశపెట్టారు.

"గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటల
క్రొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు చిమ్మగా"

అని గురజాడ క్రొత్త ఛందస్సులో కవిత్వం వ్రాశారు. ఇదొక సాహసోపేతమైన ప్రయోగంగా పరిశోధకులు ప్రశంసించారు. ముత్యాలసరం ఛందస్సుకి మిశ్రగతిలో నడిచే "వృషభగతి రగడ"కి పోలికలున్నాయి. కాని వృషభగతి రగడలో నున్న అంత్యప్రాస నియమాన్ని, యతి ప్రాసల నియమాన్ని గురజాడ తిరస్కరించారు.

ముత్యాలసరంలో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో 14 మాత్రల చొప్పున మొదటి మూడు పాదాల్లో వుంటాయి. నాల్గవ పాదంలో 7 నుంచి 14 వరకు మాత్రలుంటాయి. గురజాడ వారి లవణరాజు కల, కన్యక, పూర్ణమ్మ, దేశభక్తి మొదలైన ముత్యాలసరం ఛందస్సులోని ఖండికలు ఆధునిక కవిత్వానికి బలంచేకూర్చాయి. వీరు వీటికి 'నీలగిరి పాటల్ని' కలిపి "ముత్యాలసరములు" అనే గేయ సంపుటిని ప్రచురించారు. గురజాడవల్ల ముత్యాలసరం ప్రక్రియ బహుళవ్యాప్తిలోకి వచ్చింది. రామకృష్ణారావు కృష్ణశాస్త్రి, బసవరాజు, శ్రీశ్రీ వంటి కవులు

గురజాడను అనుసరించి అద్భుతమైన గేయాలను వ్రాసి ముత్యాలసరానికి మరింత అందాన్ని, బలాన్ని సమకూర్చి ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లారు. "ముత్యాలసరం' లిరిక్ లాంటి కృతికో, ఖండకృతికో సరిపోయే ఛందస్సు" అని జి.వి. సుబ్రహ్మణ్యంగారు అభిప్రాయపడ్డారు.

3. గేయ కవిత్వం:- ఆధునిక కవిత్వంలో గేయ కవితా ప్రస్థానానికి గురజాడ

అప్పారావుగారే మూల పురుషులు. వీరు వ్రాసిన 'ముత్యాలసరం' తెలుగులో గేయ ప్రక్రియకు నాంది పలికింది. గురజాడ వారి తర్వాత గేయ కవిత్వానికి శ్రీశ్రీ గొప్ప ప్రాచుర్యం కల్గించారు. కవితా! ఓ కవితా! వంటి చతురస్ర గతిగేయాలు వ్రాసి గొప్ప వైచిత్రి ప్రదర్శించారు. బాటసారి, భిక్షువర్షీయసి కథల్ని గేయరూపంలో అభ్యుదయ భావంతో తీర్చిదిద్దారు. విద్వాన్ విశ్వం "పెన్నేటిపాట', విశ్వనాథ 'కిన్నెరసాని', 'రంగాజమ్మ' వంటి గేయకావ్యాలు గేయకవిత్వానికి జిగిని బిగిని కల్గించాయి. గేయ కవిత్వంలో ఖండకావ్యాలు, ముక్తకాలు, శతకాలు, నాటికలు, రూపకాలు వెలిశాయి. చింతాదీక్షితులు, గిడుగు సీతాపతి, నార్ల చిరంజీవి, మిరియాల రామకృష్ణ, కరుణశ్రీ, ఉత్పల, బి.వి.నరసింహారావు మొదలైనవారు వివిధ బాలగేయాలు రచించి బాల సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. సినిమా పాటలన్నీ గేయ శాఖకు చెందినవిగానే వుంటున్నాయి.

4. వచన కవిత్వం:- ఈనాడు కవిత్వం అంటే వచన కవిత్వం అనే భావన ఏర్పడింది. "ఫ్రీవర్స్" అనే ఆంగ్ల పదానికి తెలుగులో వచన గేయం, వచన పద్యం, ముక్తచ్ఛందం, స్వచ్ఛంద కవిత్వం, అనిబద్ధకవిత్వం, స్వేచ్ఛాగీతి అనే పేర్లను ఉపయోగించారు. కాని 'వచన కవిత్వం' అనే పేరే స్థిరపడింది. "కవి ఒక వచన గేయాన్ని రాసేటప్పుడు అతడు ప్రదర్శించే శైలీ విన్యాసం, భావనాగుణమైన శబ్ద వైచిత్రి, ఉద్రేకానుగుణమైన పాదాల విరుపు, ఇవన్నీ ఆ వచనగేయం.. యొక్క రూపావిష్కరణకు తోడ్పడతాయి. అంచేత ప్రతిభను బట్టి మారుతూ వుంటుంది" అని టి.యల్. కాంతారావుగారు అన్నారు.

వచన కవిత్వోద్యమ నాయకుడైన కుందుర్తి "వచన గేయం యొక్క ప్రధాన లక్షణాలు నిరాడంబరత, నిరలంకారత కాదుకాని, అనవసర అలంకారాల భారరాహిత్యం అలాగే కవితలో

వర్ణనాధిక్యతకు స్వస్తి, కథా భంజకం కానంత వరకే అలంకారాల వర్ణనల స్వీకరణ, కవితలో సారళ్యం, సూటిగా హృదయానికి తాకే విధంగా శబ్దాల కూర్పు, తెనుగు నుడికారపు సొంపులను రసపోషణలను, తగినంతగా వినియోగించుకోవటం, అన్నిటికంటే కవిత తెలుగు ప్రజల సంభాషణ స్థాయికి దగ్గరగా రావటం" అని వివరించారు. వీరి వివరణలు పరిశీలిస్తే వచన కవిత్వం ఏ నిర్వచనానికి కట్టుబడదని వచన కవిత్వ లక్షణాలు విస్తృతమైనవని, ఇందుకు కారణం వచన కవితా నిర్మాణంలో గల వైవిధ్యమనీ, పైన చెప్పిన లక్షణాలు, వివరణలు అన్నీ వచన కవిత్వానికి సరిపోతాయని స్పష్టమవుతుంది.

తొలి తరం వచన కవుల్లో ముద్దుకృష్ణ, నారాయణబాబు, శ్రీశ్రీ, పురిపండా, పఠాభి, పాలగుమ్మి పద్మరాజు, తిలక్, సంపత్ మొదలైనవారు వచన కవితల్లో మరింత వెలుగును విరజిమ్మారు. కుందుర్తి "ఫ్రీవర్స్ ఫ్రంట్" స్థాపించి దాని ద్వారా ఉత్తమ కవితాసంపుటాలకు బహుమతులిచ్చారు. యువ కవుల కవితా సంపుటాలకు పీఠికలు వ్రాసి వారిని మరింత ప్రోత్సహించారు. కవి సమ్మేళనాలు నిర్వహించి వచన కవిత్వం స్థిరపడటానికి విశేషంగా కృషి చేశారు. వీరి తర్వాత దిగంబర, పైగంబర, చేతనావర్త, విప్లవ, అనుభూతివాద, స్త్రీవాద, దళితవాద కవులు వచన కవిత్వానికి జవజీవాలు కల్పించారు. నారాయణరెడ్డిగారి "విశ్వంభర" వచన కవిత్వాన్ని జాతీయం చేసింది. వచన కవితారచనలో నారాయణరెడ్డిగారు “జ్ఞానపీఠ్" అవార్డు అందుకున్నారు. వస్తువులో, అభివ్యక్తిలో, శిల్పంలో, వినూత్న పోకడలు పోతూ, మినీ కవితలుగా, దీర్ఘకవితలుగా, హైకూలుగా వచనకవిత్వం విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది.

5. గజల్ :- గజల్' అంటే స్థూలంగా ప్రియురాలితో సల్లాపం అని అర్థం. ఉర్దూ భాషలో 'గజల్' ఒక కమనీయ కవితాలహరి, సరస భావన, చమత్కార భేలన, ఇంపూ, కుదింపూ గజల్ యొక్క జీవ గుణాలు. ఇందులో ఒకే విషయాన్ని గూర్చి చెప్పాలనే  నియమం లేదు. భావం ఏ పాదానికాపాదంలోనే అంతంకావచ్చు. తొలుత దాశరథిగారు గాలిబ్ గజళ్లను తెలుగులోకి అనువదించారు. తర్వాత నారాయణరెడ్డిగారు సొంతంగా గజళ్లు వ్రాసి, పాడి, గజల్ ప్రక్రియకు

వ్యాప్తి కలిగించి తెలుగు కవిత్వానికి మరో క్రొత్తదనం తెచ్చారు. గజల్ శ్రీనివాస్ నారాయణరెడ్డిగారి గజళ్లను తన గానమాధుర్యంతో మరింత వ్యాప్తి కల్గించాడు.

6. హైకూ:- హైకూ కవితలోని గీతం మూడు పంక్తులతో, 17 మాత్రలతో, కూడి వుంటుంది. దీనిని ఒక్క క్షణకాలంలోనే ఎటువంటి ఆలోచనలేకుండా మెరుపు మెరిసిన రీతిగా కవి రచిస్తాడు." "నీటిలోకి రాయి విసిరినప్పుడు ఒకదానిపై మరొకటి వృత్తాలు వ్యాపించినట్లు, ఒక్కొక్క హైకూ పాఠకునిలో వివిధ ఆలోచనా తరంగాలను సృష్టిస్తుంది" అని ఇస్మాయిల్ వివరించారు. కాని హైకూలు ఎక్కువగా మినీకవితల్లా కన్పిస్తున్నాయి. మొట్టమొదటగా హైకూల కవితా సంపుటిని పెన్నా శివరామకృష్ణ 1991లో ప్రచురించారు.

7. పాట :- ఆధునిక కవిత్వంలో పాటకు విశిష్టమైన స్థానం వుంది.

ఆధునికయుగంలో పాట సరదాకి కాదు. ఉబుసుపోకకు కాదు. ఒక చారిత్రక బాధ్యతని, సామాజిక బాధ్యతని తనపై వేసికొని కొత్త రకంతో జవజీవాలు నింపుకొని ప్రవహిస్తుంది. నేడిది ఒక బలమైన చైతన్య శక్తి. ఒక ఉద్యమరూపం, లయ, శ్రావ్యత, కంఠస్థం అయ్యేగుణం, తన్మయత్వం చెందటం వంటి లక్షణాలతో పాట బహుముఖంగా విస్తరిల్లుతుంది. ప్రఖ్యాత గాయకుడైన గద్దర్ పాటకి, ఉద్యమశక్తిని, జనాకర్షణశక్తిని, సాహిత్య సంపదనీ, వ్యాప్తిని కలిగించాడు. వీరి వల్ల పాట ప్రజల హృదయాల్లోకి వెళ్లింది. సుద్దాల, మాష్టర్జీ, వంగపండు, సుబ్బారావు పాణిగ్రాహి, శివసాగర్, చెరబండ రాజు మొదలైనవారు పాటకు ప్రాణంపోశారు. పాటల ద్వారా సామాజిక చైతన్యానికి పాటుపడ్డారు. బి.యస్. ములు పాట ప్రాధాన్యాన్ని వివరిస్తూ వ్యాసాలు వ్రాశారు.

........................

# 4. ఆధునిక తెలుగు సాహిత్య దీపధారులు

**వీరేశలింగం, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు**

**ప్ర.9. కందుకూరి వీరేశలింగం పంతులుగారి సాహిత్య సేవను గూర్చి వ్రాయండి.**

**జ॥ కందుకూరి నవ్యాంధ్రయుగకర్త, సంఘ సంస్కరణాభిలాషి, నవ్యాంధ్ర సాహిత్య ప్రక్రియలకు విశేష ప్రాచుర్యం కల్గించిన సాహితీస్రష్ట. వీరు సాంస్కృతిక వికాసానికి, సారస్వత వ్యాప్తికి ఎంతో కృషిచేశారు. తెలుగు దేశంలో సంఘ సంస్కరణోద్యమం తీవ్రతరం కావడానికి కారణభూతులయ్యారు. సాహిత్యాయుధంతో సారస్వత లోకాన్ని జాగృతపరచి ఆధునికాంధ్ర సాహిత్య విస్తృతికి కొత్తదారులు సృష్టించారు. స్త్రీ విద్యాభివృద్ధి కోసం, వితంతోద్ధరణ కోసం, వాఙ్మయాభివృద్ధి కోసం, సంఘసంస్కరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేశారు. వివిధ అంశాలపై**

రచించిన ప్రజోపయోగకర వ్యాసాలను వివేకవర్ధని, చింతామణి, సతీహితబోధిని, సత్యసంవర్ధిని, తెలుగు జనానా, సత్యవాదిని మొదలైన పత్రికలలో ప్రచురించారు. స్త్రీ విద్యా వ్యాప్తి కోసం ధవళేశ్వరంలో ఒక బాలికా పాఠశాలను నెలకొల్పారు. చెన్నపట్నంలో వితంతు శరణాలయాన్ని ఏర్పాటు చేశారు. 'హితకారిణి' అనే సమాజాన్ని స్థాపించి ప్రజోపయోగ కార్యక్రమాల కోసం తన యావదాస్తిని దానం చేశారు. వీరు సుమారు 190 వ్యాసాలు వ్రాశారు. సంఘు దురాచారాల్ని తీవ్రంగా ఖండించారు.

పంతులుగారు సాంఘికరంగంలోనే కాకుండా సాహిత్యరంగంలో కూడా నూతన మార్గాలకు మార్గదర్శకుడయ్యారు. సంఘుసంస్కరణకు సాధనంగా సాహిత్యాన్ని చేపట్టి సాహిత్య ప్రయోజన దృష్టి మార్చి వేశారు. సమాజ అభ్యున్నతికీ సాహిత్యం అనే విషయాన్ని చాటి చెప్పారు. బాల్యదశలోనే గోపాల శతకం, మార్కండేయ శతకం రచించారు. 1874లో ధవళేశ్వరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా నున్నపుడు అష్టావధానం చేశారు. 1870లో చిత్రకవిత్వంతో, శృంగారంతో 'రసిక జనరంజనం' అనే ప్రబంధం రచించారు. గోల్డ్ స్మిత్ రచించిన 'ది ట్రావెలర్' అనే కావ్యాన్ని 'పథిక విలాసం" పేరుతో ఆంధ్రీకరించారు.. 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్" అనే ఆంగ్ల నాటకాన్ని 'చమత్కార రత్నావళి" పేరుతో అనువదించి  విద్యార్థులతో ప్రదర్శింపజేశారు. బ్రాహ్మ వివాహం, స్త్రీ పునర్వివాహం, సభానాటకం అనే సాంఘిక నాటకాల్ని వ్యావహారిక భాషలో వ్రాశారు. పూర్వకవుల ప్రభావానికి లోనై శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము, శుద్ధాంధ్రోత్తర రామాయణము, శుద్ధాంధ్ర భారత సంగ్రహము అనే కావ్యాలు రచించారు. అభాగ్యోపాఖ్యానము పెళ్లి వెళ్లిన తరువాత పెద్ద పెళ్ళి లోకోత్తర వివాహము, కామరూప ప్రహసనము, కలిపురుష శనైశ్చర విలాసము, వేశ్యాప్రియ ప్రహసనము వంటి ప్రహసనాలు రచించారు. ఆంధ్ర కవితా సరస్వతి నియమాల సంకెళ్లలో చిక్కి ఎలా విలవిలలాడి పోతుందో వివరిస్తూ "సరస్వతీ నారద విలాపము" అనే వ్యంగ్య ప్రహసనాన్ని 1895లో రచించారు. ఏ విషయాన్ని గురించి అయినా ప్రజాబాహుళ్యంలో ప్రచారం చేయటానికి ప్రౌఢకవిత్వం కంటే సరళమైన గద్యమే శక్తిమంతమైన సాధనమని బలంగా నమ్మారు.

సాంఘిక రంగంలో వీరావేశాన్ని ప్రదర్శించిన ఆయన కవితా రంగంలో వినయ వివేక సంపన్నుడయ్యారు. "సాంఘిక రంగంలో ఆయన వీరావేశముతో విజృంభించిన అతివాది కవితా రంగమున మాత్రము కడుపులోని చల్ల కదలకుండా నడచిన మితవాది. సాంఘిక విషయములలో ఆయన చూపిన విప్లవాదేశములను కవిత్వ రంగములో చూపినచో 19వ శతాబ్ది ఉత్తరార్ధముననే కవితా సతి బంధవిముక్తి కలిగి స్వేచ్ఛా వాయువులను పీల్చెడిది" అని ఆచార్య డా॥ సి. నారాయణరెడ్డిగారు వ్యాఖ్యానించారు. రాబోయే కాలంలో గద్యానికున్న ప్రాధాన్యతను గుర్తించి చిన్నయసూరి నీతిచంద్రిక మాదిరిగా సంధి విగ్రహములను సరళమైన వచన శైలిలో రచించి గద్యతిక్కనగా ప్రఖ్యాతిని పొందారు. ఆంగ్లంలో గోల్డెస్మిత్ రచించిన “వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్" నవల ఆధారంగా తెలుగులో రాజశేఖర చరిత్ర అనే సాంఘిక నవలను వ్రాశారు. "నే నారంభించిన కాలమందు తెలుగులో నిప్పటివలె వివిధములైన పుస్తకములు లేవు. తెలుగులో మొదటి వచన ప్రబంధమును నేనే చేసితిని, మొదటి నాటకమును నేనే తెనిగించితిని. మొదటి ప్రకృతి శాస్త్రమును నేనే రచించితిని. మొదటి ప్రహసనమును నేనే వ్రాసితిని. మొదటి చరిత్రమును నేనే రచించితిని. స్త్రీలకైన మొదటి వచన పుస్తకమును నేనే కావించితిని" అని పంతులుగారు స్వయంగా స్వీయచరిత్రలో చెప్పుకున్నారు. పంతులుగారు ఆంగ్లంలో ప్రసిద్ధి చెందిన 'గలివర్స్ ట్రావెల్' ఆధారంగా 'సత్యరాజా పూర్వ దేశయాత్రలు' అనే వ్యంగ్య, హాస్యభరితమైన సాంఘిక నవలను వ్రాశారు. స్త్రీలనుద్దేశించి స్త్రీ విద్యాభివృద్ధిని, స్త్రీ ప్రాధాన్యాన్ని ప్రబోధిస్తూ స్వతంత్రంగా 'సత్యవతీ చరిత్రము' అనే మరొక నవల వ్రాశారు. మతధర్మాలను, నీతినియమాలను వర్ణిస్తూ, స్త్రీల అభ్యుదయాన్ని ప్రబోధిస్తూ 15 ప్రకరణలతో 'చంద్రమతీ చరిత్రము' అనే వేరొక నవల వ్రాశారు. కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆంధ్రీకరించారు. ప్రబోధ చంద్రోదయము, మాళవికాగ్నిమిత్రం, రత్నావళి వంటి సంస్కృత నాటకాలను తెలుగులోనికి అనువదించారు. 'కళ్యాణ కల్పవల్లి' చమత్కార రత్నావళి, వెనీసు వర్తక చరిత్రము, రాగమంజరి' అనే ఆంగ్ల నాటకాలను ఆంధ్రీకరించారు. పౌరాణిక ఇతివృత్తాలతో ప్రహ్లాద, దక్షిణ గోగ్రహణం, సత్యహరిశ్చంద్ర వంటి స్వతంత్ర నాటకాలు రచించారు. విక్టోరియా మహారాణి చరిత్రను, జీసస్ చరిత్రను వ్రాశారు.

1910లో స్వీయ చరిత్రను ప్రకటించారు. ఏకేశ్వరోపాసనం, బాల్య వివాహాలు, వితంతు వివాహాలు, విగ్రహారాధన మొదలైన వాటిని గూర్చి పలుచోట్ల ఉపన్యసించారు.

పంతులుగారు తన కాలంనాటి తాళపత్ర గ్రంథాల్ని పరిశీలించి, పరిశోధించి పరిష్కరించారు. నాచన సోముని ఉత్తర హరివంశం, దశకుమార చరిత్ర ప్రబోధ చంద్రోదయం, జైమినీ భారతం, హరిశ్చంద్రోపాఖ్యానం, అనే గ్రంథాల్ని పరిష్కరించి ప్రకటించారు. నన్నయ కాలం నుండి తన కాలం వరకు వున్న కవుల చరిత్రల్ని, వారి కాలాల్ని, శాసనాధారాలతో నిరూపించి మూడు సంపుటాలుగా వెలయించారు. వీరు సుమారుగా 120 కి పైగా గ్రంథాలు రచించారు. వాటిల్లోని వైవిధ్యం పంతులుగారి ప్రతిభకి విజ్ఞానానికి ప్రబల నిదర్శనం. "అభినవాంధ్రకు ఆయన ఆద్యబ్రహ్మ. ఆధునిక కవులకు పూజనీయుడు. అంధకారం తొలిగిపోయే ముందు వేగుచుక్కలా వీరేశలింగంగారి రచనలు తెలుగు భాషకి, కవిత్వానికి, స్వేచ్ఛని, వెలుగుని ప్రసాదించాయి. పంతులుగారితో తెలుగు సాహిత్యానికి నూతన యుగోదయమైంది. ఈ విధంగా ఆధునిక యువచేతనకు, సామాజిక చైతన్యం సాహిత్యంలో ప్రతిబింబించటానికి మూల కారకులైన శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు 1919 సంవత్సరం మే నెల 27వ తేదీన చెన్నపురిలో దివంగతులయ్యారు.

.....................................

ప్ర. 10. గిడుగు రామమూర్తిగారి భాషా దృక్పథాన్ని విశదం చేయండి.

జ। గిడుగు రామమూర్తిగారు వ్యావహారిక భాషాయోధులు. వీరు వ్యావహారిక భాషా వ్యాప్తి కోసం తన జీవితాన్నే త్యాగం చేశారు. తెలుగు భాషా వ్యావహారికోద్యమంలో మహత్తరమైన పాత్రను పోషించారు. తొలి రోజుల్లో చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని మెచ్చుకున్నారు. కాని తర్వాత దాన్ని అంగీకరించలేకపోయారు. ఉపాధ్యాయునిగా, ఉపన్యాసకునిగా వ్యవహరిస్తున్న కాలంలోనే పత్రికా రచనను చేపట్టారు. "తెలుగు" అనే పత్రికను స్థాపించి దాని ద్వారా వ్యావహారిక భాషా వాదానికి ప్రచారం కల్పించారు. 'చిన్నయసూరి వ్యాకరణం నిన్నటి భాషకు, నేటి భాషకు

కాదు' అనే నిర్ణయానికి వచ్చారు. శాస్త్రీయ దృష్టితో ఆలోచించి భాషను ప్రాచీన భాష, ఆధునిక భాష అని రెండుగా విభజించారు.

రామమూర్తిగారు తాను ఉద్యోగం చేస్తున్న పర్లాకిమిడిలో ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. కందుకూరి వారి సంఘ సంస్కరణల్ని సమర్ధించారు. సంస్కృత భాషలోని ప్రామాణిక గ్రంథాల ఆధారంగా తన వాదానికి తగిన సాక్ష్యాలు చూపారు. రాజావారి తమ్ముడికి ట్యూటరుగా నియమింపబడినపుడు వీరి దృష్టి సవరల భాషపై పడింది. అప్పుడు పట్టుదలతో సవరల భాషను గూర్చి, వారి ఆచార వ్యవహారాలను గూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. 'నాగరిక' అక్షరాలు నేర్చుకున్నారు. విలువైన పాత నాణాలను సేకరించారు. ప్లీడరు చదువుకోసం పట్నం వెళ్లాలని భావించారు. కాని అధికారుల ప్రోత్సాహం లేనందున పూర్వపు హోదాతోనే ఉద్యోగంలో కొనసాగారు.

1894లో గవర్నర్ పర్లాకిమిడి వచ్చినపుడు సవరల భాషాభివృద్ధిని కాంక్షిస్తూ వారి కోసం పాఠశాలలు ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ వారికొక వినతి పత్రం సమర్పించారు. గవర్నర్ సుముఖంగానే స్పందించారు. కాని కలెక్టర్ వ్యతిరేకించాడు. 'సవరల్లో విప్లవ భావాలు అంకురింపజేయటానికి గిడుగు ప్రయత్నిస్తున్నారు' అని కూడా అసత్యాలు చెప్పి గవర్నర్ మనసు మార్చారు. దీనితో రామమూర్తిగారి ప్రయత్నం విఫలమైంది. అయినా పట్టువీడకుండా సంతకు వచ్చిన కొందరు సవరుల ద్వారా ఆ భాషను నేర్చుకునే ప్రయత్నం చేశారు. కొన్నిసార్లు పరిహాసం పాలయ్యారు.

శ్రీరామమూర్తిగారు పట్టువీడని విక్రమార్కుడయ్యారు, చక్కగా చదువుకున్న ఒక సవర విద్యార్థి ద్వారా స్వచ్ఛమైన సవర భాష నేర్చుకున్నారు. ఆ భాషపై పరిశోధనలు కొనసాగించారు. ముఖలింగంపై వారు వ్రాసిన వ్యాసాన్ని జర్నల్లో చూచిన అధికారులు ఆయన ప్రతిభను గుర్తించారు. గాంగుల రాజధానియైన ముఖలింగమే కళింగము అని ఆయన శాసనాధారాలతో నిరూపించారు. పరిశోధనలతో భాషోద్యమంతో విద్యార్థుల్ని బాగా ఆకర్షించారు.

# ఆధునిక కావ్యం

గ్రాంథిక, వ్యావహారిక భాషావాదుల మధ్య భాష విషయమై వాదోపవాదాలు జరుగుతున్న రోజుల్లో వ్యావహారిక భాషా ఆవశ్యకతను గూర్చి పత్రికల్లో వ్యాసాలు వ్రాశారు. ఉపన్యాసాల ద్వారా భాషకు విశేష ప్రచారం కల్పించారు." మనం "మన భాషను ఎలా మాట్లాడుతామో అలాగే వ్రాస్తాము. అలా చేయకపోతే భాష ఉనికిని కోల్పోతుంది." అందుకే నోటి మాటకు చేతివ్రాతకు సంబంధం ఉండాలి. భాష ఒక కాలంలో వున్నట్లుగా మరొక కాలంలో వుండదు. ఇది కాలాన్ని బట్టి, సమాజాన్ని బట్టి మార్పులు పొందు తుంటుంది" అని గిడుగువారు భాషాధర్మాన్ని వివరించారు.

తెలుగుభాషపై వ్యాకరణ ప్రభావం ఎక్కువ. అందుకే నన్నయ నుండి చిన్నయ వరకు పాణిని మహర్షి మార్గదర్శకుడయ్యారు. చిన్నయ వ్యాకరణం నిన్నటి భాషకు బాగా పనికి వస్తుంది. కాని నేటి భాషకు కాదు. కాబట్టి ఆధునిక వ్యాకరణం రూపొందించుకోవాలి. దానిపై కృషి జరగాలి. భాషకు నియమాలు ఉండాలి. శాసనాలు ఉండకూడదు. ఆ శాసనాలు ఉన్నందు వల్లనే ఎక్కువమంది గ్రాంథిక భాషను ఆదరించలేకపోయారు' అని గిడుగు అభిప్రాయపడ్డారు. తాను స్వయంగా భారత, భాగవత, రామాయణాది గ్రంథాల్ని, నిఘంటువుల్ని వ్యావహారిక భాషలో వ్రాసి ప్రకటించారు. వీరు రచించిన బాలకవి శరణ్యం భాషకు వ్యాకరణంలా ఉపయోగపడింది. రామమూర్తిగారు సవరల భాషకు కూడా వ్యాకరణం వ్రాశారు. వ్యావహారిక భాషాభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమించారు. "చంద్రిక" అనే సారస్వత పత్రికలో భాషను గూర్చి వ్యాసం వ్రాస్తూ భాషలో వ్యవహార భ్రష్టమైన పాతమాటలు వుండకూడదు అని చెప్పారు. 1911లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ప్రభుత్వం రామమూర్తి గారి ప్రతిభను గుర్తించి సర్టిఫికేట్ అఫ్ మెరిట్ ను, రావు సాహెబ్ బిరుదుతోను సత్కరించింది. గిడుగువారి భాషా కృషి చాలా వరకు ఫలించింది. అందుకే ఆయన ద్రష్ట, క్రాంతదర్శి కాగలిగాడు.. ఈ విధంగా సుదీర్ఘ కాలం వ్యావహారిక భాషా

వ్యాప్తి కోసం అవిశ్రాంతంగా శ్రమించిన శ్రీరామమూర్తిగారు 1940 జనవరి 22న చెన్నపట్నంలో దివంగతులయ్యారు.

..................

ప్ర. 11. "నవ్య కవిత్వానికి అడుగుజాడ గురజాడ" విమర్శనాత్మకంగా వ్రాయండి.

జ॥ గురజాడ అప్పారావుగారు అక్షరాల ద్రష్ట. స్రష్ట, మహాకవి, సంస్కర్త. నవ్య కవిత్వానికి అడుగుజాడ. పాత కొత్తల మేలుకలయికతతో తెలుగువారి మత్తును వదలగొట్టిన భావ విప్లవకారులు. కందుకూరి వీరేశలింగంపంతులుగారి సాంఘిక విప్లవాన్ని గిడుగు రామమూర్తిగారి భాషా విప్లవాన్ని తనలో సమన్వయించుకొని, ఆధునిక తెలుగు సాహిత్య లోకంలో సరిక్రొత్త విప్లవాన్ని లేవనెత్తిన నవయుగ వైతాళికులు. వీరు తన రచనల ద్వారా ఆధునిక తెలుగు వికాసానికి వెలుగుబాటను వేశారు. సంఘసంస్కరణ లక్ష్యంతో సాహిత్యాన్ని సృష్టించి అమోఘమైన కల్పనాచాతుర్యాన్ని ప్రదర్శించారు. సమకాలికులైన ఇతర కవులు మాదిరిగా ప్రాథమిక దశలో సాంప్రదాయక పద్ధతిలో "మాటల మబ్బులు", "పుష్పలావికలు", "మెరుపులు" అనే ఖండ కావ్యాల్ని "సుభద్ర" అనే కావ్యాన్ని "ఋతుశతకాన్ని" రచించారు. అప్పారావుగారు సంఘసంస్కరణ, భాషా సంస్కరణ ఉత్తమ రూపక నిర్మాణం అనే మూడు రకాల ప్రయోజనాల్ని ఆశించి "కన్యాశుల్కం" అనే నాటకాన్ని సజీవ పాత్రచిత్రణతో, వ్యావహారిక భాషలో రచించి ప్రజల భాషకు, ప్రజాజీవనానికి దగ్గరయ్యారు. తన కాలం నాటి సమాజంలోని చీకటి కోణాలపై కళాత్మక కాంతిరేఖలు ప్రసరింపజేశారు. ఇతివృత్త స్వీకరణం, నిర్వహణా కౌశలం, హాస్యరస పోషణం, పాత్రోన్మీలనం, భాషా ప్రయోగం, సరస సంభాషణా నైపుణ్యం సాంఘిక జీవన చిత్రణం, వ్యంగ్య వైభవం వంటి గుణాల్లో "కన్యాశుల్కం" నాటక సాహిత్యానికి విజ్ఞాన సర్వస్వం లాంటిది అని చెప్పకనే చెప్పాడు. వీరి నాటకంలో అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, రామప్ప పంతులు, బుచ్చమ్మ, మధురవాణి, గిరీశం, సౌజన్యారావు మొదలైన స పాత్రలన్నీ సజీవంగా సాక్షాత్కరిస్తాయి. ఒకదానితో మరొకటి పోటీపడతాయి. రామప్ప పంతులు వంటి నీతిలేని దగాకోరులు, స్వార్థపరులు, గిరీశంలా సంస్కరణ పేరుతో, మాటకారితనంతో వబ్బం గడువుకునే బడాయి కోరులూ, ధనాశకు లొంగే అగ్నిహోత్రావధాన్లు, సంస్కర్తలకే బుద్ధిచెప్పగల ప్రజ్ఞ, సమయస్ఫూర్తి కల్గిన మధురవాణాలు

ఇప్పటికీ సమాజంలో మనకు కన్పిస్తారు. అందుకే ఈనాడు కన్యాశుల్కం అనే దురాచారం. లేకపోయినా నాటకం మాత్రం సజీవంగా క్రొత్త రచనలా నిలిచిపోయింది.

గురజాడ 1910లో ముత్యాలసరాలు అనే గేయకవితా సంపుటిని ప్రకటించారు. ఇందులో వ్యావహారిక భాషా ప్రయోగం, వాస్తవికత, సాంఘిక జీవన చిత్రణం, దేశీయ ఛందస్సు, అభ్యుదయ వైఖరి, సమకాలికత్వం, ఉపదేశ బలం, భావతీవ్రత వంటి లక్షణాలు దర్శనమిస్తాయి. "పూర్ణమ్మ కథ" తప్ప మిగిలిన ముత్యాలసరాలు, కాసులు, లవణరాజు కల, కన్యక, డామన్ పిథియస్, మనిషి, దేశభక్తి, దించు లంగరు, లంగరెత్తుము, మిణుగురులు మొదలైన గేయాలన్నీ మాత్రాఛందస్సులో రచింపబడ్డాయి. దీనిలోని గేయఖండికలు వస్తు ప్రాధాన్యతను బట్టి ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, ఆధ్యాత్మిక కవిత్వం, బాలగేయాలు అని వివిధ రకాలుగా విభజింపబడినాయి.

శ్రీ అప్పారావుగారు 'కాసులు' అనే గేయంలో పవిత్ర దాంపత్యరక్తిని ప్రతిపాదించే ఆలుమగల ప్రణయాన్ని చక్కగా వ్యక్తీకరించారు. "కులం కన్నా గుణం మిన్న. అధికారం కన్ను కాననివ్వదు" అని రాజరిక వ్యవస్థలోని లోపాన్ని, సమాజంలోని స్త్రీదుస్థితిని "కన్యక" కథలో అద్భుతంగా వర్ణించారు. "లవణరాజు కల"లో అంటరానితనాన్ని నిరసించారు. "నీలగిరి పాటలు" లో నీలగిరిని, అక్కడ కన్పించే పచ్చిక, పట్టులు, రొదచేసే పిట్టలు, సుగంధాలతో గుభాళించే చెట్లు, కొండలు, తోటలు, 'డామన్ పిథియస్"లోని పండుగ వేడుకలు మొదలైన వాటిని పూర్వకావ్యాల్లోని ప్రకృతి వర్ణనల మాదిరిగా చక్కగా వర్ణించారు.

గురజాడ భావ నవ్యత్వానికీ, శైలీ నవ్యత్వానికీ, రసపోషణా చమత్కారానికి "పూర్ణమ్మ కథ" నిలువుటద్దం. అప్పారావుగారు పూర్ణమ్మకథను ప్రారంభిస్తూ

"కొండలనడుమను కోనొకటుంది

కోనకి నడుమా కొలనొకటుంది

కొలని గట్టునా కోవెలలోపల

వెలసెను బంగరు దుర్గమ్మ" అని చెప్పటంలోనే ఉత్సాహాన్ని కల్గించే ఒకానొక భావదృశ్యం మనకళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. తల్లిదండ్రులు డబ్బుల కోసం పుత్తడి బొమ్మలాంటి పూర్ణమ్మను ముసలి వానికిచ్చి పెండ్లి చేయాలని అనుకున్నప్పుడు పూర్ణమ్మ ఆత్మత్యాగం ద్వారా దుర్గలో లీనమౌతుంది.

"మేలిమి బంగరు మెలతల్లారా
కలువల కన్నుల కన్నెల్లారా
తల్లులగన్నా పిల్లల్లారా"

అనే సంబోధనతో ప్రారంభమైన ఈ గేయంలో పూర్ణమ్మ ఆత్మత్యాగం చేసుకునే ముందు

"నలుగురు కూచొని నవ్వేవేళ
నా పేరొకతరి తలవండి
మీమీ కన్నబిడ్డల నొకతెకు
ప్రేమను నా పేరివ్వండి" అన్నప్పుడు మన హృదయాలు ద్రవించిపోతాయి.

పూర్ణమ్మ దుర్గలో లీనమైన విషయాన్ని చెప్పకుండా

"కన్నుల కాంతులు కలువల జేరెను.
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకలబెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ" అని వ్యంగ్య వైభవంతో చెప్పటం ఆయనకే చెల్లింది.

గురజాడ వారి జాతీయ దృక్పథానికి విశ్వమానవ సౌభ్రాతృత్వానికి, విశాల దృష్టికి, అభ్యుదయ భావాలకి దేశభక్తిగేయం ప్రబల నిదర్శనం. ఈ గేయం గురజాడకు శాశ్వత కీర్తిని తెచ్చి పెట్టింది.

"దేశమును ప్రేమించుమన్నా

మంచియన్నది పెంచుమన్నా

వొట్టిమాటలు కట్టిపెట్టోయ్

గట్టిమేల్ తలపెట్టవోయ్" అని "మాటలు చెప్పటం కాదు, చేతల్లో చూపాలి" అని ఉద్బోధించాడు

"సొంతలాభం కొంతమానుక

పొరుగు వారికి తోడుపడవోయ్

దేశమంటే మట్టి కాదోయ్

దేశమంటే మనుషులోయ్"

అని దేశభక్తిని గొంతెత్తి చాటాడు.

"మతం వేరైతేను యేమోయ్

మనసులొకటై మనుషులుంటే

జాతయన్నది లేచి పెరిగి

లోకమున రాణించునోయ్" అని కుల మత ద్వేషాలు ఉండకూడదని హితవు చెప్పాడు.

అన్నదమ్ముల వలెను జాతులుమతములన్నియు మెలగవలెనోయ్" అని మానవ సమైక్యతను ఎలుగెత్తి చాటాడు.

గురజాడ దేశభక్తి గేయాన్ని కొందరు పుస్తకాల్లోని నీతుల్లా భావిస్తారు. కాని శ్రీశ్రీకి మాత్రం అది "సమస్త ప్రపంచ మహాజనుల జాతీయగీతంలా కన్పించింది. దేశభక్తికి సరియైన అర్థాన్ని మానవతా దృష్టితో రంగరించి రచించిన గురజాడ దేశభక్తి గేయం అంతర్జాతీయ ప్రసిద్ధి చెందింది.

“ఎల్ల లోకములొక్క యిల్లై

వర్ణ భేదములెల్ల కల్లై

వేల మెరుగని ప్రేమ బంధము.

వేడుకలు కురియు” అని సర్వమానవ సమానత్వాన్ని, విశ్వమానవ ప్రేమను ఆకాంక్షించారు. అజ్ఞానాంధకారానికి ప్రతీకగా మారిన మతఛాందస వాదాన్ని ఖండిస్తూ

"మతములన్నియు మాసిపోవునుజ్ఞానమొక్కటె నిలిచి వెలుగును" అనే విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు. గిడుగువారి వ్యావహారిక భాషావాదాన్ని తన రచనల్లో ప్రదర్శించిన ఘనత గురజాడకే దక్కుతుంది. నిజానికి గురజాడ లేకపోతే చాలా మంది భావకవులు చరిత్రలో నిలిచివుండేవారు కాదు.. ఇది ముమ్మాటికి సత్యం

# భావ కవిత్వం

1. భావ కవిత్వం - నిర్వచనం, లక్షణాలు వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

ప్ర.1. భావకవిత్వాన్ని నిర్వచించి, లక్షణాలు వ్రాసి, భావకవితా శాఖలను తెలియజేయండి.

జ॥ భావకవిత్వాన్ని రాయప్రోలు సుబ్బారావుగారు మొదట్లో అభినవ కవిత్వమనీ, కృష్ణశాస్త్రి కాల్పనిక కవిత్వం అని, దువ్వూరి రామిరెడ్డిగారు 'గీతకవిత్వం' అనీ, నోరి నరసింహశాస్త్రిగారు 'నవ్యకవిత్వం' అని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా 'భావకవిత్వం' అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు ఉపయోగించారు. తర్వాత అందరూ 'భావకవిత్వం' అనే పదాన్నే ఉపయోగించటం మొదలుపెట్టారు.

భావకవిత్వం- నిర్వచనం:- "కవి యొక్క ఒక అవిస్పష్టవాంఛాకురము, ఒక అంతర్నిగూఢ తాపము. ఒక చిన్న కావ్యములో ఊదబడినచో అది భావకవిత్వము. ఖండకావ్యములు ప్రధానముగా ఒక భావమును ఆశ్రయించియే యుండును. అందుచేత దీన్ని 'భావకవిత్వము' అనవచ్చు అని విశ్వనాథవారు నిర్వచించారు. "భావము యొక్క కవితా స్వభావము భావకవిత్వం" అని కవి కొండల వెంకటరావుగారు అన్నారు. "భావప్రధాన కవిత్వమే భావకవిత్వం" అని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు భావించారు. "ఏదో ఒక భావాన్ని ఆధారము చేసికొని అల్పావకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చే "యత్నం" అని పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు అభిప్రాయపడ్డారు. "వస్తు, భావ రచనల్లో భావమునకు ప్రాధాన్యమిచ్చిన కవిత్వము" అని నారాయణరెడ్డిగారు అన్నారు. "గానయోగ్యము,

ఆత్మనాయకము, వ్యంగ్యప్రధానము, ఏకభావాశ్రయమునకు నొక లఘు రచన భావకవిత్వం" అని పాటిబండ మాధవశర్మ వివరించారు. "హ్లాదైకమయమైన కావ్యము వలన సర్దింపదగిన పరమ ప్రయోజనము ఆనందము. ఆ ఆనందోపాసన గావించువాడే భావకవి. అతని యొక్క స్వీయభావమే ప్రధానముగా గలది భావకవిత. భావమనగా కవి అభిప్రాయము" అని రాయప్రోలు వారు విశదీకరించారు. "కవిభావమే ఇతివృత్తంగా సాగిన కవిత్వం భావకవిత్వం" అని సోమసుందర్ స్పష్టం చేశారు. ఈ నిర్వచనాలు అన్నింటిలో విశ్వనాథ సత్యనారాయణగారి నిర్వచనమూ, కవికొండల వెంకటరావుగారి

నిర్వచనమూ, ఆచార్య నారాయణరెడ్డి గారి వ్యాఖ్యానమూ ఉత్తమంగా ఉన్నాయని విమర్శకులు భావించారు.

భావకవిత్వం - లక్షణాలు:- "రొమాంటి సిజం" అనే గ్రంథంలో డా॥ శివలెంక ప్రసాదరావుగారు భావ కవిత్వ లక్షణాలను ఈ విధంగా వివరించారు.

1. స్వేచ్ఛాప్రియత్వం :- భాష, భావం, ఛందస్సు, అలంకారం శైలి మొదలైన విషయాల్లో భావకవులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. కావ్యానికి అవసరమైన వస్తువు, భావము, రచన అనే మూడు విషయాల్లో భావానికే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రకృతిలోని ప్రతి విషయాన్ని వర్ణనీయవస్తువుగా గ్రహించారు.

కృష్ణశాస్త్రిగారి 'విశ్వోదయ ఛందస్సు' లక్షణానుగుణంగా కంటే లయబద్ధంగా ఉంటుంది. గురజాడ అప్పారావుగారు 'ముత్యాలసరం' అనే ఒక నూతన ఛందస్సుని తెలుగువారికి అందించారు. కవికొండలరావు 'వచనగీతిక' అనే పేరుతో వచనకవిత్వం వ్రాశారు.

2. ఆత్మాశ్రయ కవిత్వం :- భావకవులకు ఆత్మానుభవమే ముఖ్యంగా ఉంటుంది. కాబట్టి వీరి కవిత్వం ఆత్మాశ్రయరీతిలో సాగుతుంది. కవియే నాయకుడై కథనంతా నడిపిస్తాడు.

"నేను స్వేచ్ఛా కుమారుడ నేనుగగన

పథవిహార విహంగమపతిని నేను

మోహన వినీల జలధరమూర్తి నేను

ప్రళయ ఝుం ఝూ ప్రభంజన స్వామినేను”

అని కృష్ణశాస్త్రి అంటాడు.

3. సాధన ప్రాధాన్యం :- భావకవులకు అంతశ్చేతనంలోని చైతన్యం ఆయువుపట్టుగా ఉంటుంది. వీరు సౌందర్యాన్ని ఆరాధిస్తారు. అతీంద్రియమైన ఆదర్శాలు, ప్రణయాలు కలిగి ఉంటారు. నిరాశలోనే ఆశ, అసంతృప్తిలో ఆనందం, కన్నీటిలో పన్నీరు, అత్యాశతో కూడిన భవిష్యత్తు పరమావధిగా ఉంటుంది.

4. మనన ప్రాధాన్యం :- భావకవులు అంతర్ముఖత్వంతో ప్రతిభావంతమైన కవిత్వాన్ని సృష్టించారు.

5. ఖండ కావ్యత్వం :- "భావకవితా యుగంలో పాశ్చాత్య భాషా సంపర్కం వల్ల 'ఖండకావ్య ప్రక్రియ' అనే ఒక నూతన సాహితీప్రక్రియ రూపుదిద్దుకుంది. భావకవులు ఈ ప్రక్రియను చక్కగా ఉపయోగించుకున్నారు.

6. ఆరాధనాతత్త్వం :-భావకవిత్వంలో కవి స్త్రీయొక్క బాహ్య సౌందర్యానికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఆమె అంతస్సౌందర్యానికి ప్రాధాన్యం ఇస్తారు. కవులు ఆత్మగుణ వైశిష్ట్యాన్ని ఘనంగా కీర్తిస్తారు. ప్రకృతిని మాతృభావంతో ఆరాధిస్తారు.

7. మానవతావాదం :-కాల్పనికోద్యమ ప్రభావంతో పాటు 'రూసో' మొదలైనవారు ప్రచారం చేసిన మానవతావాదం కూడా భావకవిత్వంపై ప్రభావం చూపింది. దీనివల్ల భావకవులు సాటిమానవుల సుఖదుఃఖాల్లో పాలుపంచుకొనే అవకాశం ఏర్పడి దేశప్రజల కష్టనష్టాల్ని కవితారూపంగా గానం చేశారు. వ్యక్తిగతంగా దేశభక్తి ప్రకటించడానికి కవులు కారాగారాల పాలు కావటానికి ఈ మానవతావాదమే దోహదకారి అయింది.

సంక్షిప్తత :- భావకవిత్వం మరీ అంత పెద్దది కాకుండా, మరీ అంత చిన్నది కాకుండా మధ్యస్తంగా ఉంటుంది. సంక్షిప్తత ప్రధానగుణంగా ఉండి రసావిర్భూతిని కలిగిస్తుంది.

..........................

## 6. భావకవితా శాఖలు

భావకవిత్వం - శాఖలు కవితావస్తు స్వరూప స్వభావాల్ని బట్టి భావకవిత్వాన్ని 1. ప్రణయ కవిత్వం, 2. ప్రకృతి కవిత్వం, 3. ఆధ్యాత్మిక కవిత్వం, 4. దేశభక్తి కవిత్వం, 5. సంఘసంస్కరణ

కవిత్వం, 6. మానవతావాద కవిత్వం, 7. స్తుతి కవిత్వం, 8. స్మృతికవిత్వం, 9. బాలగేయ కవిత్వం అని కొన్ని విధాలుగా విభజించవచ్చు.

1. ప్రణయ కవిత్వం :- మానవజీవితానికి పరమావధి ప్రేమ. దీనికి నాశనం లేదు. సృష్టి ఉన్నంతవరకు ఇది సజీవంగానే ఉంటుంది. ఈ ప్రేమ భావకవుల్ని ఊహాలోకంలో విహరింపజేసింది. వీరు ఊహాసుందరుల్ని సృష్టించుకున్నారు. తనివిదీరా ఆరాధించారు. వారి దర్శనభాగ్యం కోసం పరితపించారు. అలాంటి వారిలో దేవులపల్లి, విశ్వనాథ, తల్లావజ్ఝల, నాయని, నండూరి, బాపిరాజు మొదలైన ప్రముఖులున్నారు. వీరందరికీ ఇష్టదేవతలున్నారు. కృష్ణశాస్త్రికి 'ఊర్వశి', విశ్వనాథకి 'కిన్నెరసాని', శివశంకర శాస్త్రికి 'హృదయేశ్వరి, నాయనికి 'వత్సల', నందూరికి 'ఎంకి', బాపిరాజుకి 'శశికళ' ఊహాప్రేయసులు, ఉపాసనాదేవతలు అయ్యారు. భావకవులు తమ కవిత్వాన్ని ఆత్మాశ్రయ రీతిలో కొనసాగించారు.

2. ప్రకృతి కవిత్వం :-భావకవులకు ప్రకృతి ప్రాణం. వీరికీ ప్రకృతికి విడదీయరాని అనుబంధం ఉంది. వీరు ప్రకృతిని ఆరాధిస్తారు. ప్రకృతిలో ఉన్న సూర్యోదయం, చంద్రోదయం, మబ్బులు, చీకటి, వెన్నెల, చెట్లు, గుట్టలు, తీగలు, పువ్వులు, కొండలు. కోనలు, లోయలు, నదులు, సముద్రాలు, సరస్సులు, చిలుకలు, కోకిలలు, తుమ్మెదలు, తుఫాను, వరదలు ఇలా ఒకటేమిటి ప్రకృతిలోని సమస్త వస్తుజాలాన్ని విషయాల్ని పరమ రామణీయకంగా, అద్భుతంగా వర్ణిస్తారు. బాపిరాజు, కవికొండల, నాయని, తుమ్మల, పింగళి, కాటూరి, దువ్వూరి, విశ్వనాథ మొదలైనవారు ప్రకృతి చిత్రీకరణలో తమ ప్రజ్ఞాపాటవాల్ని ప్రదర్శించారు. కృష్ణశాస్త్రిగారు "కృష్ణపక్షం"లో

"ఆకులో ఆకునై పూవులో పూవునై

కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై

ఈ యడవి దాగిపోనా

ఎటులైనా నిచటనే యాగిపోనా" అని ప్రకృతిలో లీనమౌతారు. అడవిబాపిరాజు గారు వరదల్ని దృష్టిలో పెట్టుకొని ప్రకృతి భీభత్సాన్ని అత్యద్భుతంగా వర్ణించారు.

3. ఆధ్యాత్మిక కవిత్వం :- ఆధ్యాత్మిక కవిత్వంలో ఆంగ్లంలో బ్లేక్, వర్డ్స్ వర్త్, కోలరిడ్జ్, షెల్లీ, టెన్నిసస్, కూపర్ మొదలైనవారు ప్రముఖులుగా గుర్తింపబడ్డారు. తెలుగులో కృష్ణశాస్త్రి, విశ్వనాథ, బసవరాజు, వేంకటపార్వతీశ్వర కవులు, వేదుల, దువ్వూరి మొదలైనవారు ఘనంగా కీర్తింపబడ్డారు. రాయప్రోలు సుబ్బారావుగారు 'జడకుచ్చులు -రాధ పిలుపు'లో

"పొదలలో పూవులై పోయినావేమొ

తమ్మిలో తేనెపై దాగినావేమొ....

నిన్నెందు చూతురా చిన్నారికృష్ణా

ఏమూల వెదికేనురా మోహనాంగ" అని అనడంలో అద్వైతతత్త్వం వెల్లడవుతుంది.

'అమృతవీణ'లో కృష్ణశాస్త్రిగారి ఆధ్యాత్మికతత్త్వం చాలా స్పష్టంగా కన్పిస్తుంది.

4. దేశభక్తి కవిత్వం :- భావకవిత్వంలో దేశభక్తి కవితాస్రవంతి భారత జాతీయాభిమానం, ఆంధ్రాభిమానం అని రెండు పాయలుగా ప్రవహించింది. దేశభక్తి కవిత్వానికి దేశంలో ప్రజ్వరిల్లిన స్వాతంత్ర్య దీక్ష ఊపిరికాగా, దేశం యొక్క విశిష్టతను, గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని వర్ణించి చెప్పటం లక్ష్యమైంది. భారత జాతీయతను గూర్చి చిలకమర్తి, గురజాడ, రాయప్రోలు, దువ్వూరి, బసవరాజు మొదలైన కవులు చక్కగా ప్రబోధించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి

"భరత ఖండంబు చక్కని పాడియావు హిందువులు లేగదూడలై యేడ్చుచుండ తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అనే పద్యం వారి జాతీయాభిమానానికి ప్రతీకగా నిలుస్తుంది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా

ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా

పొగడరా నీతల్లి భూమిభారతిని

నిలపరా నీజాతి నిండుగౌరవము"

అనే 'జన్మభూమి' గేయంలో రాయప్రోలు సుబ్బారావుగారి జాతీయభావనా స్ఫూర్తి ప్రస్ఫుటమౌతుంది. గురజాడ అప్పారావు గారి

"దేశమును ప్రేమించుమన్నా

మంచియన్నది పెంచుమన్నా"

"దేశమంటే మట్టికాదోయ్

దేశమంటే మనుషులోయ్"

అనే దేశభక్తి గేయం జాతీయాభిమానంతో పాటు అంతర్జాతీయ భావనను కల్గిస్తుంది. ప్రజల హృదయాల్ని కదిలింపజేస్తుంది. భారత జాతీయోద్యమానికి కేంద్రబిందువైన గాంధీజీని గూర్చి, రాట్నాన్ని గూర్చి, స్వరాజ్యాన్ని గూర్చి ఇంకా అనేక విషయాలను గూర్చి భావకవులు ప్రచారస్థాయిలో గేయాలు, పద్యాలు వ్రాశారు.

అడవి బాపిరాజు ఆంధ్రభాష మాధుర్యాన్ని, గొప్పదనాన్ని ఘనంగా కీర్తించారు. కొడాలి సుబ్బారావుగారు కరుణరసార్ధ్రమైన 'హంపీ క్షేత్రం' అనే కావ్యాన్ని రచించారు. గత వైభవాన్ని తలచుకొని ప్రస్తుత స్థితికి రోధించారు.

5. సంఘ సంస్కరణ కవిత్వం :తెలుగుదేశంలో 19వ శతాబ్దంలో వీరేశలింగం పంతులుగారు, రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు సంఘ సంస్కరణోద్యమాన్ని ప్రారంభించారు. ఎంతోమంది భావకవులు సంఘసంస్కరణ దృష్టితో సంఘ సంస్కరణ కవిత్వానికి శ్రీకారం చుట్టారు.

"ఎల్లలోకము లొక్కయిల్లై

వర్ణభేదములెల్ల కల్లై

వేలనెరుగని ప్రేమబంధము

వేడుకలు కురియ

మతములన్నియు మాసిపోవును

జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును

అంత స్వర్గసుఖంబులన్నవి

యవని విలసిల్లుస్"

"మంచిచెడ్డలు మనుజులందున

యెంచి చూడగ రెండె కులములు

మంచియన్నది మాలయైతే

మాలనే అగుదుస్"

అనే గురజాడ గేయం విశ్వమానవ సౌభ్రాతృత్వానికి చక్కని ఉదాహరణ.

6. మానవతా దృక్పథం :-మానవతావాదం వ్యక్తికీ, జాతికీ స్వాతంత్ర్యాన్ని కోరుతుంది. దీని సర్వమానవ సౌభ్రాత్రం, మానవ సౌఖ్యాన్వేషణ లక్ష్యం అందరినీ ఆకర్షించింది. గురజాడ, రాయప్రోలు, వేదుల, జాషువా, తుమ్మల, కరుణశ్రీ మొదలైన కవులందరూ మానవతావాద కవిత్వం వ్రాశారు. కృష్ణశాస్త్రిగారు మానవతపై ఎన్నో గేయాలు వ్రాశారు.

"కులందాటి, మతందాటి, కొద్దిదాటి సమభోగం, సమభాగ్యం,సమసంస్కృతినాటి కొత్తశాంతి, కొత్తకాంతి భరతావని నిండె" "మతమన్నది నాకంటికి మసకైతే మతమన్నది నీమనసుకు మచ్చైతే మతంవద్దు, గీతంవద్దు, మాయామర్మంవద్దు" అని మతాన్ని నిరసించారు.

7. స్తుతి కవిత్వం :- దేశనాయకుల్ని, మహాపురుషుల్ని, కవుల్ని గూర్చి వ్రాసిన కవిత్వం స్తుతికవిత్వం అవుతుంది. వెంకట పార్వతీశ్వరకవులు సమకాలీనులను స్తుతిస్తూ కవిత్వం వ్రాశారు. విశ్వనాథవారు ఆంధ్రపత్రికాధిపతి శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు గారిని కృష్ణాపత్రికాధిపతి ముట్నూరు కృష్ణారావుగారిని, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు భోగరాజుగారిని ప్రశంసిస్తూ పద్యాలు వ్రాశారు.

8. స్మృతి కవిత్వం :- విశ్వనాథ, దువ్వూరి, నాయని, జాషువా మొదలైన కవులు స్మృతి కవిత్వం వ్రాశారు. విశ్వనాథ తనభార్య 'వరలక్ష్మి' చనిపోయినప్పుడు 'వరలక్ష్మీత్రిశతి' అనే పేరుతో 300 పద్యాలు వ్రాసి, దాన్ని వియోగకావ్యంగా పేర్కొన్నారు.

9. బాలగేయ కవిత్వం :- పిల్లల హృదయాలు, ఎంత నిర్మలంగా, నిష్కపటంగా ఉంటాయో అంతే సుకుమారంగా, సున్నితంగా, మృదువుగా, మనోహరంగా ఉంటాయి. వారి స్వచ్ఛమైన మనస్తత్వాన్ని ప్రతిబింబించే బాలగేయాలు తెలుగులో చాలా ఉన్నాయి. తెలుగులో బాపిరాజుగారు బాలగేయాల్ని వ్రాసి, బాలసాహిత్యానికి మెరుగులు దిద్దారు.

ఈ విధంగా భావకవులు భావకవిత్వాన్ని 9 శాఖలుగా విభజించుకొని అందులో తమ ప్రతిభా విశేషాలను చక్కగా ప్రదర్శించారు.

## 7. ప్రసిద్ధ భావకవులు - రాయప్రోలు సుబ్బారావు:

భావకవితాపితామహుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి

ప్ర. 1. 'భావకవులకు రాయప్రోలు మార్గదర్శి' వివరించండి.

రాయప్రోలు సుబ్బారావుగారు బాపట్ల తాలూకా గార్లపాడు గ్రామంలో 1892 సం॥లో జన్మించారు. మేనమామ అయిన అవ్వారు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి దగ్గర సంస్కృతాంధ్రాలు నేర్చుకున్నారు. చదువు కోసం రాజమండ్రి వెళ్లినప్పుడు చిలుకూరి వీరభద్రరావు అత్తిలి సూర్యనారాయణ వంటి పండితుల సహకారం లభించింది. గుంటూరు, కాకినాడ, హైదరాబాద్లో విద్యనభ్యసించారు. శాంతినికేతనంలో గురుకులవాసం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖకు అధ్యక్షులుగా, కళాశాల అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్రసాహిత్య అకాడమి కార్యవర్గ సభ్యులై తమ కవితా పరిమళాలను గుబాళింపచేశారు. ఎందరో కవుల్ని, విమర్శకుల్ని తయారు చేశారు.

రాయప్రోలు రచనలు:- పల్లా దుర్గయ్యగారు రాయప్రోలు వారి రచనల్ని అనువాదాలు, స్వతంత్రకావ్యాలు, లక్షణ కావ్యాలు అని మూడు విధాలుగా విభజించారు. "లలిత, అనుమతి" అనువాద లఘు కావ్యాలుకాగా మధు కలశం, ఉమరు ఖయ్యాం, పారసీక రుబాయీలకు అనువాదం, భజగోవిందం, సౌందర్యలహరి సంస్కృతం నుండి అనువదించబడ్డాయి. వాల్మీకి రామాయణంలోని సుందరకాండ గేయరూపంగా ఆంధ్రీకరింపబడింది.

తృణకంకణం, కష్టకమల, స్నేహలత, స్వప్నకుమారం, రాయప్రోలు వారికి భావకవితా ఆచార్యునిగా కీర్తి తెచ్చిపెట్టాయి. వీరు 'ఆంధ్రావళి', 'జడకుచ్చులు', 'వనమాల', ''మంజరి' అనే ఖండకావ్యాలు రచించారు. 'రమ్యాలోకం', 'మాధురీదర్శనం' అనే లక్షణ గ్రంథాలు రచించి వాటిల్లో కవిత్వం గురించి, రసాలంకారాలను గురించి పద్యాల్లో వివరించారు. స్త్రీ మనస్తత్వాన్ని వివరించే 'రూపనవనీతం' అనే తత్త్వ ప్రతిపాదన గ్రంథాన్ని రచించారు. గోల్డ్ స్మిత్ 'Hermit' ఆధారంగా 'లలిత' అనే కావ్యం వ్రాశారు. టెన్నిసను వ్రాసిన 'దోరా' కావ్యాన్ని 'అనుమతి' అనే పేరుతో ఆంధ్రీకరించారు.

తృణకంకణం:- ఆధునిక కవిత్వంలో స్త్రీవర్ణనలతో చైతన్యం కలిగించిన కావ్యం

తృణకంకణం. ఇందులో 89 పద్యాలు ఉన్నాయి. కథకి, భావానికి తగినట్లుగా వృత్తాలు, కందాలు, తేటగీతులు, ఆటవెలదులు కన్పిస్తాయి. ఖండవల్లి లక్ష్మీరంజనంగారు 'తృణకంకణాన్ని' ఒక 'ప్రేమగీత'గా అభివర్ణించారు. ప్రేమతత్త్వాన్ని వివరించటానికి పుట్టిన 'గీతాశాస్త్రం' అని కూడా అన్నారు.

ఒక యువతి, యువకుడు, బాల్యమిత్రులు. ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కానీ వివాహం కాలేదు. ఆ యువతికి మరొక యువకునితో పెండ్లి జరిగింది. ముందుగా ప్రేమించిన యువకుడు దుఃఖంతో, వియోగంతో సృష్టిని కఠోరంగా విమర్శిస్తాడు. అప్పుడా యువతి వానికి శారీరక సంబంధం ప్రణయం కాదని, అంతరంగంలోని భావస్థిరత్వమే ఆదర్శ ప్రణయమనీ, అలౌకికమైన అనుబంధం ముఖ్యమని సున్నితంగా ప్రణయతత్త్వాన్ని బోధిస్తుంది. ఇది ఇందులోని కథ. కథలోని ప్రణయాన్ని లక్ష్మీరంజనంగారు 'ధర్మ శృంగారం'గా పేర్కొన్నారు. కానీ రాయప్రోలువారు దాన్ని అమలిన శృంగారం అని అన్నారు.

"సరస సాంగత్య సుఖ వికాసములకన్న దుస్సహ వియోగభరమె మధురము సకియ"

అన్న మాటలు అమలిన శృంగారాన్ని తెలియజేస్తున్నాయి. "స్త్రీని భోగ్యవస్తువుగా చేసికున్న ప్రాచీన వ్యవస్థను కట్లు త్రెంచుకొని పోవు యువతీయువకుల నవీన ప్రేమావస్థను అదుపులో

పెట్టుటకే సిద్ధాంతమును స్థాపించిరి" అని నారాయణరెడ్డిగారు ఈ అమలిన శృంగార ప్రతిపాదనకు కారణం చెప్పారు.

స్నేహలత:- బెంగాల్ లో జరిగిన ఒక సంఘటన ఆధారంగా రాయప్రోలువారు 'స్నేహలత' అనే కావ్యాన్ని రచించారు. "స్నేహలతాదేవిని ఆత్మోపహారమునకు ప్రేరేపించిన ధర్మములు ఉదాత్తములు. ఆయన లేఖలో పితృగృహ పరిరక్షణము సూచింపబడినది. స్థూలదృష్టికి తోచునది ఇంతియే" అని రాయప్రోలువారు ధ్యానబద్ధమైన మనోవృత్తి హీనత్వాన్ని భరించలేదని, తన వివాహం కారణంగా కుటుంబ నాశనం కావటం సహింపలేకనే స్నేహలత ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చి ఆత్మత్యాగం చేసుకున్నది అని పేర్కొన్నారు. తన పెళ్లికి కట్నం ఇవ్వటం కోసం తండ్రి ఇంటిని తాకట్టు పెట్టవలసి వస్తుందని తెలిసికొని స్నేహలత ఆత్మ సమర్పణం చేసుకుంటుంది. ఇది ఇందులోని కథ. వరకట్నానికి నిరసనగా 1914లో వ్రాయబడిన 'స్నేహలత' కావ్యం అభ్యుదయ కావ్యాల్లో మొదటిదిగా భావింపబడింది. రాయప్రోలువారు స్నేహలత ద్వారా అడిగించిన "కన్నియను పెండ్లియాడునో? కన్నెతండ్రి. 'యర్పణము చేయుశుల్క రూపాప్సరసను పెండ్లియాడునో యకట! యీ పెండ్లికొదుకు అడుగరే యొక్కరయిన నీయార్యసుతుల"

అనే ప్రశ్న ఈనాటికీ ప్రశ్నగానే మిగిలి ఉంది.

దేశభక్తి కవిత్వం : రాయప్రోలువారి పేరు చెప్పగానే

"ఏదేశమేగినా ఎందుకాలిడినా

ఏపీఠమెక్కినా ఎవ్వరేమనినా పొగడరానీతల్లి భూమి భారతిని

నిలుపరా నీజాతి నిండు గౌరవము"

అనే 'జన్మభూమి' గేయం గుర్తుకు వస్తుంది. ఆయన గతవైభవాన్ని గుర్తుకు తెస్తూ

"అవమానమేలరా, అనుమానమేలరా భారతీయుడనంచు భక్తితో పాడ"

అని గొంతెత్తి చాటాడు. పూర్వజన్మ పుణ్యంవల్ల యోగబలం వల్ల ఈ స్వర్గ ఖండంలో జన్మించావని సందేశమిచ్చారు.

"అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ విద్యాలయములు స్థాపించునాడు

తనగీతి అరవజాతిని గాయకులనుగా

దిద్ది వర్ధిల్లిన తెనుగువాణి"

వంటి సీసపద్యాలు మనలో ఆంధ్రాభిమానాన్ని కలిగిస్తాయి. భావ కవిత్వానికి

మార్గదర్శకులుగా, అభినవ ఆంధ్రకవితా శాఖలపై నవ్య స్వరకల్పన చేసిన రాయప్రోలు వారు 1984 జూన్ 30వ తేదీన కీర్తిశేషులయ్యారు.

..............................

ప్ర. 2. 'దేవులపల్లి కృష్ణశాస్త్రి భావకవితా పితామహుడు' వివరించండి.

జ॥ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు పిఠాపురం దగ్గరి 'చంద్రంపాలెం'లో సీతమ్మ తమ్మన్న శాస్త్రి దంపతులకు 1897 నవంబర్ 1వ తేదీన జన్మించారు. కూచినరసింహం పంతులు, బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడు దగ్గర శిష్యరికం చేశారు. విజయనగరం కాలేజీలో మామిడిపూడి వెంకట రంగయ్య ప్రిన్సిపాలుగా నున్నప్పుడు బి.ఏ.డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. నండూరి, బసవరాజు, చింతా దీక్షితులు, వేదులతో కలసి 'సాహితీ సమితి' లో సభ్యులయ్యారు. కొంతకాలం పెద్దాపురం మిషనరీ హైస్కూల్లో అధ్యాపకునిగా పనిచేశారు. కొంతకాలం బ్రహ్మసమాజ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. నవ్యకవుల కవితల్ని గానంచేస్తూ నలుపైపులా తిరుగుతూ భావకవిత్వోద్యమ ప్రచారకునిగా వ్యవహరించారు. శాంతినికేతన్లో చేరి మరింత ప్రతిభావంతులయ్యారు. హరిజనులను వెంటబెట్టుకొని హరిజనాభ్యుదయ గీతాలు పాడుతూ తిరిగేవారు. 1930లో పిఠాపురంలో 'వేశ్యావివాహ సంస్థ'ను స్థాపించి వేశ్యలకు వివాహం జరిపించారు. తాతతండ్రులు సంపాదించిన ఆస్తిని విచ్చలవిడిగా ఖర్చు చేశారు. 1931 నుండి కాకినాడ పి.ఆర్. కాలేజీలో పదేళ్లపాటు ట్యూటరుగా పనిచేశారు. నవ్యసాహిత్య పరిషత్

అధ్యక్షులయ్యారు. హైదరాబాద్ ఆకాశవాణిలో సాహిత్య ప్రయోక్తగా పనిచేశారు. 1964 నుండి సినీగేయ రచయితగా స్థిరపడ్డారు. “ఎవ్వరేమన్నా భావకవిత్వమనే దానికి రూపమిచ్చి పెంపొందించినవారు కృష్ణశాస్త్రి. అచ్చంగా భావకవిత్వమే వ్రాస్తారు. అదే అతని వైశిష్ట్యం... భావకవిత్వమనేది అర్థమయ్యే విషయం కాదు. హృదయానికి అవగతమయ్యే విషయం. నీ హృదయంలో ఏదో తారాడుతుంది. అది బాధగా ఉంటుంది. ఆ బాధలో ఒక సుఖం ఉంటుంది. అది జీవుణ్ణి కదిలిస్తుంది. ఇదమిద్ధమని మనం చెప్పలేంది అదే భావకవిత్వం అంటే. అది వ్రాయగల వాడొక్కడే అతనిపేరు కృష్ణశాస్త్రి. అతని ననుసరించి చాలామంది వ్రాస్తారు. ఎవ్వరూ

అతనినందుకోలేదు. అతని కాంతే ఈ సౌధమంతా వ్యాపించి ఉంది" అని విశ్వనాథ సత్యనారాయణ కృష్ణశాస్త్రి గారిని ఘనంగా ప్రశంసించారు..

"భావకవికి పర్యాయపదం దేవులపల్లి అయితే దేవులపల్లికి పర్యాయపదాలు మూడు. కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, ఈ ఖండకావ్యాలే కృష్ణశాస్త్రిని భావకవితా భాస్కరుడిని చేశాయి. ప్రకృతి ప్రీతి, స్వేచ్ఛాప్రియత్వం, వేదనా ప్రియత్వం, సౌందర్యతృష్ణ, ఉహాప్రేయసి, ప్రణయం, భాగవత్ప్రణయం మొదలైన భావకవితా మౌలిక సూత్రాల కనువదింపబడ్డాయి. ఈ ఖండకావ్యాల్లోని ఖండికలు." అని నిర్మలగారు తన సిద్ధాంత వ్యాసంలో నిరూపించారు. శ్రీశ్రీ కూడా, "ఆ పాత మధురమైన కృష్ణశాస్త్రి సాహిత్యం సమస్తమూ ఇక్షురసార్జనమే" అన్నారు దేవులపల్లి. ప్రభావం నుంచి బయట పడటానికి ఎన్నో ఏండ్లు పట్టిందన్నారు. దేవులపల్లి మరణించగానే "షెల్లీ మరణించాడు. వసంతం వాడిపోయింది" అని కూడా అన్నారు.

కృష్ణపక్షం:-"విషాదానికి సంకేతం కృష్ణపక్షం. అందులో ఆద్యంతం ఒక విషాదఛాయ పరుచుకుంటుంది. ఆ కవిత్వానికి జీవనాడిగా ఉన్న విషాదాన్ని స్ఫురింపజేసే కావ్యానికి కృష్ణపక్షమన్నపేరు సార్థకమౌతుంది. ఈ కావ్యం వెలువడడంతోనే సంప్రదాయ కవిత్వపు కట్టుబాట్లతో విసిగిపోయి విముక్తి నభిలషిస్తున్న యువకులు నూతనోత్తేజాన్ని పొంది ఆయన కవితాశైలినీ కాక వేషభాషలు సైతం అనుకరించనారంభించారు" అని నిర్మలాదేవిగారు అన్నారు.

కృష్ణశాస్త్రిగారు నల్లమల అడవులగుండా రైలులో ప్రయాణం చేస్తూ ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడై

'ఆకులో ఆకునై పూవులో పూవునై

కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై

ఈయడవి దాగిపోనా

ఎట్లైన నిచటనే యాగిపోనా"

అని ఒక నూతన భావంతో కవితను వెలయించారు. దేవులపల్లి స్వేచ్ఛాప్రియత్వానికి

"కృష్ణపక్షం"లోని స్వేచ్ఛాగానం ఒక చక్కని ఉదాహరణ. భావకవులకు వియోగం, దుఃఖం అత్యంత ప్రీతి పాత్రాలైనవి. నిరాశలో, నిరీక్షణలో, ఒక అనిర్వచనీయ ఆనందల సుఖానుభూతి వెలువడుతుందని వీరు భావిస్తారు.

ప్రవాసం : -కృష్ణశాస్త్రి 'ప్రవాసం' అనే ఖండకావ్య సంపుటిలో విరహాన్ని అభివర్ణించారు. "ప్రవాస సమయంలో ప్రియుడు ప్రేయసీ వియోగాన్ని అనుభవించి చివరికి ప్రేయసీ సాక్షాత్కార సాన్నిధ్యాన్ని పొందాడు. అదేవిధంగా "ప్రవాసం"లోని కవితల్లో కృష్ణశాస్త్రిగారు విరహ వ్యధనంతా ఆవిష్కరిస్తారు" అని నిర్మలాదేవి గారు వివరించారు.

భావకవిత్వంలో విరహవీక్షణ ఒక ముఖ్యస్థితి అయితే మరణవాంఛ లేదా. ఆత్మత్యాగం మరొక లక్షణమౌతుంది. కవి దేనికీ భయపడడు, పాఠకుల్ని తమతో లాక్కొని వెళ్ళి వాళ్ల సానుభూతిని పొంది పాఠకుల హృదయాల్ని కూడా కరుణరస భరితం చేస్తారు.

ఊర్వశి :-భావకవులు ఊహాప్రేయసుల్ని సృష్టించుకుంటూ, విలపిస్తూ, ఆనందిస్తూ ఉంటారు. దేవులపల్లి ఊహాప్రేయసి 'ఊర్వశి' కావ్యం పేరూ ఊర్వశి. పూర్వకాలం నుంచి అప్సరసల్లో అతిలోకసుందరిగా, దివ్యప్రణయమూర్తిగా ఆరాధింపబడుతుంది. దేవులపల్లి "ఊర్వశి" విశ్వసౌందర్యానికి ప్రతీక" అని విమర్శకులు అన్నారు. "తన మనస్సును ఎన్నడో సోకిన సౌందర్య ఖందాన్ని, తన హృదయాన్ని ఎన్నడో పలికించిన ప్రేమశకలాన్ని కలిపి కృష్ణశాస్త్రిగారు ఊర్వశిని సృష్టించుకున్నారు. విషంతో, అమృతంతో, చీకటితో, వెన్నెలతో కలసిన స్త్రీగా ఊర్వశి

గురించి ఆయన ఊహించారు. ఊర్వశి స్త్రీ. ఊర్వశిదేవి. ఊర్వశి మోహినీ హాసమల్లి వైజయంతీ పరిమళము. హరిజటా పారిజాతము" అని రామమోహనరాయ్ వ్యాఖ్యానించారు.

"భావకవుల్లో కృష్ణశాస్త్రిగారి చేతిలో ప్రాతశబ్దములే క్రొత్త పరిమళములను, క్రొత్త వన్నెలను సంతరించుకున్నవి ఎలదేటి చిఱుపాట సెలయేటి కెరటాల బడిపోవు విరికన్నె వలపు', 'కారురాతిరి కొసలు' మున్నగువాని యందలి అచ్చమైన తెలుగు మాటల కూర్పులో కరుణార్ద్ర వీక్షణ పరిమళములు, విరహవీక్షణ భయంకర మాధురులు, అగమ్యతమస్వినీ గర్భకుహరాలు, హేమంత కృష్ణానంత శర్వరి మున్నగు సంస్కృత సమాసముల పోహళింపులో, అపూర్వ నవ్యతా భరితమైన కామనీయకము వెల్లివిరియుచున్నది. తెలుగు కవిత్వమున జిలుగు నగిషీలకు, సన్నపోగారుతనమున కెంత వీలున్నదో అంత కృష్ణశాస్త్రిగారు సాధించి చూపినారు. వీరిశైలికి మించిన సౌకుమార్యమును సాధించుటకు ప్రయత్నము చేయుట అనగా మధుధారను జలధారగా మార్చుటయే. అనగా శాస్త్రిగారి భావకృతులు సౌకుమార్య మాధుర్యములకు చరమసీమలని నాయభిప్రాయము" అని నారాయణరెడ్డి దేవులపల్లి శైలిని వివరించారు.

................................

# <u>అభ్యుదయ, విప్లవ కవిత్వం</u>

**1.అభ్యుదయ కవిత్వం - నిర్వచనం, నేపథ్యం: మార్క్సిజం ప్రభావం**

**ప్ర. 1. అభ్యుదయ కవిత్వ నిర్వచనం, నేపథ్యం, దానిపై మార్క్సిజం ప్రభావాన్ని విశ్లేషించండి.**

**జ|| అభ్యుదయం అనే మాటకు మంగళం శుభం అనే నైఘంటికార్థాలు ఉన్నాయి. మనం ఇప్పుడు 'Progress' అనే ఆంగ్లపదానికి సమానార్థంగా అభ్యుదయం అనే పదాన్ని వాడుతున్నాం.**

**"నేడే - ఈనాడే**

**జగమంతా బలివితర్ధి**

**నరజాతికి పరివర్తన**

**నవజీవన శుభసమయం – అభ్యుదయం"**

**అని శ్రీశ్రీ మొదటిసారిగా అభ్యుదయం అనే పదాన్ని 'ప్రగతి', 'పురోగమనం' అనే అర్థంలో వాడారు. అభ్యుదయ కవిత్వం ఎలా ఉండాలో కూడా కవిత్వంలోనే చెప్పారు.**

**"కదిలేదీ కదిలించేదీ**

**మారేదీ మార్పించేదీ**

**పాడేదీ పాదించేదీ**

మునుముందుకు సాగించేదీ

పెనునిద్దుర వదిలించేదీ

పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ

కావాలోయ్ నవకవనానికి" అని

అభ్యుదయ కవిత్వం – నిర్వచనం :

అభ్యుదయ రచన సమకాలికమైన జీవిత పరిస్థితులకు, రాజకీయ వాతావరణానికి, ఆర్థిక సమస్యలకు, సమాజ సంఘర్షణలకు నైతిక సందర్భాలకు, బహికాముష్మికా సిద్ధాంతాలకు, వైజ్ఞానిక విశేషాలకు అనుగుణ్యంగా, అనుకూలంగా తగినట్టి అవసరమైన మార్పులతో విలసిల్లవలెను" అని పి.వి.రాజమన్నార్ నిర్వచించారు.

"పీడింపబడేవాళ్లూ పీడించేవాళ్లూ ఉన్న ఈ వర్గ సమాజం ఉండాలని ఎవరూ కోరుకోరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటింపజూచేవారు, ఎప్పుడూ అభ్యుదయవాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవటమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకొని వ్రాసేది అభ్యుదయ రచన" అని దేవులపల్లి కృష్ణశాస్త్రి అభిప్రాయపడ్డారు. "సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరగబడుతున్నారు. నేటి రచయితలకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాలవల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్లీ సారస్వతోన్ముఖంగా తిప్పటానికి నేటి రచయితలు పాటుపడుతున్నారు" అని శ్రీశ్రీ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు.

అభ్యుదయ కవిత్వనేపథ్యం: 1917నాటి రష్యస్ అక్టోబర్ సోషలిస్టు విప్లవం నెలకొల్పిన శ్రామికవర్గ సమసమాజ నిర్మాణం ప్రపంచవ్యాప్తంగా కవులనూ, కళాకారులనూ ప్రభావితం చేసింది. ఒక కొత్త సామాజిక నమూనాను రచయితలకు ఆదర్శంగా నిలిపింది. 1919లో ముగిసిన మొదటి ప్రపంచయుద్ధ ఫలితాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాలనూ, సాంస్కృతిక సంక్షోభాల ప్రమాదాలనూ మానవాళికి సూచించాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన 1930 దశకం 'ఆకలి

దశాబ్దంగా' గుర్తింపు పొందింది. ఆర్థిక సంక్షోభాన్ని రుచి చూపింది. 1934 నాటికి జర్మనీలో హిట్లర్ నియంతృత్వం జాతీయ దురహంకారపు నీలినీడల్ని ప్రసరింపసాగింది. సంస్కృతి పరిరక్షణకోసం 1935 ప్రథమార్థంలో పారిస్లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది. 1935 డిసెంబర్లో అలహాబాద్లో 'ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' ఏర్పడింది. 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే 'ది డెయిలీ ట్రిబ్యూన్' లో భారత అభ్యుదయ రచయితల ప్రణాళిక ప్రకటించబడింది. 1936 ఏప్రియల్ 9, 10 తేదీల్లో లక్నోలో మున్నీప్రేమచంద్ అధ్యక్షతన 'అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభలు జరిగాయి. 1936నాటి స్పెయిన్ అంతర్యుద్ధంలో వివిధ దేశాల కవులూ, కళాకారులూ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. 1936 సెప్టెంబర్లో 'ఫైజపూర్' లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభల సందర్భంగా 'రచయితల 'ఇష్టాగోష్ఠి సమావేశం' సరోజినీనాయుడు అధ్యక్షతన జరిగింది. జాతీయోద్యమంలో క్రమంగా అతివాద భావాలుగల యువకుల క్రియాశీల ప్రమేయం పెరగసాగింది. ఇన్ని పరిణామాల నేపథ్యంలో 'అభ్యుదయ రచయితల సంఘం 1936లో ఏర్పడింది. ఈ సంస్థ సభ్యులైన కవులు సృష్టించిన కవిత్వం' అభ్యుదయ కవిత్వంగా ప్రచారమయింది.

జాతీయస్థాయి నుండి ప్రాంతీయ స్థాయి వరకు అభ్యుదయ రచనలు సాగాలనే తీర్మానం లక్నోలో జరిగింది. ఆ ప్రభావంతో 1943లో తెనాలిలో మొట్టమొదటి అభ్యుదయ రచయితల మహాసభ జరిగింది. ఈ సభకు తాపీధర్మారావుగారు అధ్యక్షత వహించారు. ఈ సభలో శ్రీశ్రీ, బెల్లంకొండ రామదాసు, అనిసెట్టి, కుందుర్తి ఆంజనేయులు, సోమసుందర్, చదలవాడ పిచ్చయ్య మొదలైన కవులు పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి 'ప్రజాశక్తి' 'తెలుగుతల్లి' మొదలైన పత్రికలు విస్తృతవ్యాప్తి కల్పించి మరింత ముందుకు తీసుకువెళ్లాయి.

తెలుగులో అభ్యుదయ కవిత్వం :-తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, శ్రామిక జనపక్షపాతం, వాస్తవికత, పీడితజనపక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను అభ్యుదయ కవిత్వం ప్రవేశపెట్టింది. ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించింది. సామాన్య మానవుణ్ణి సాహిత్యానికి మకుటధారిని చేసింది. శిష్లా, పఠాభి, పురిపండా,

అబ్బూరి, శ్రీశ్రీ, నారాయణబాబు, ఆరుద్ర, దాశరథి. కాళోజీ మొదలైన కవులు తమతమ పద్ధతుల్లో భావకవిత్వంపై తిరుగుబాటు చేశారు. కవిత్వంలో అతినవ్య కవిత్వ ప్రయోగాలు చేశారు.

1934లో N.G రంగాగారి సంపాదకత్వంలో 'రైతు భజనావళి' వెలువడింది. 1935లో 'ప్రభ' సంచికలో తొలి ఎర్రజెండా గీతం అచ్చయింది. అదే సంచికలో 'యూజినీపాటియర్' ఫ్రెంచిభాషలో రచించిన 'అంతర్జాతీయ గీతానికి' బాలాంత్రపు నళినీ కాంతారావు ఆంధ్రానువాదం ప్రచురింపబడింది. 1935-38 మధ్యకాలంలో "ప్రభ' మొదలైన పత్రికల్లో కార్మికవర్గ దృక్పథం గల గీతాలు ప్రకటింపబడ్డాయి. 1938లో 'క్రాంతిగీతాలు' సంకలనం వెలువడింది. శిష్ట్లా ఉమామహేశ్వరరావు గారి 'విష్ణుధనువు' ప్రకటింపబడింది. శ్రీశ్రీ మహాప్రస్థానం గీతాలు, వరాభి ఫిడేల్ రాగాల డజన్. నారాయణబాబు రుధిరజ్యోతి కవితలు, అబ్బూరి రామకృష్ణారావుగారి మానవతావాద కవితలు తెలుగు కవిత్వంలో నూతన ద్వారాలను తెరిచాయి.

తొలి కార్మికగీతం :-1936-37 మధ్యకాలంలో పెంద్యాల లోకనాథం

కూలీలందరూ ఏకమైతే- కూటికి తరుగేందిరా

కూలివారిండ్లలోనే బలిమి - కాలమందును నుండెరా

కూలివాండ్లమైన మనకు- కులములెందుకు తెలువరా.

కూలివాండ్లమైన మనము కలిసి ఉందము సోదరా అన్నా కూలీలేకముకావలెరా!

అని ప్రబోధిస్తూ 'కూలిపాట'నూ పాడుతూ శ్రామికులను చైతన్య పరిచాడు. తొలి కార్మిక గీతాన్ని ప్రకటించాడు.

తొలిరైతు గీతం : 1934లో శెట్టిపల్లి వెంకటరత్నం రైతుగీతాన్ని రచించి గిరిరాజు

రామారావుతో కలసి

"ఆగునా జీవాలు - సాగునా లోకాలు

రాజుగా మనమెంచి - రైతు జూడకపోతె

దేశాలు తలలెత్తునా ? దాస్యపుస్

పాశాలు తావీడునా" అని ప్రచారం చేశారు.

శ్రామిక వర్గదృక్పథం:- శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని

ప్రకటించిన అభ్యుదయ కవిత్వం కార్మికలోకపు కల్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి సాధనంగా నిలిచింది. కుమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, కొడవలి, గొడ్డలి, రంపం, నాగలి, సహస్ర వత్తుల సమస్త చిహ్నాలను అభ్యుదయ కవిత్వం తన భావంగా, భాగ్యంగా, ప్రాణంగా, ప్రణవంగా స్వీకరించింది.

"అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం అనాథుడికీ, ఆగర్భ శ్రీనాథుడికీ మధ్య"

అన్న వర్గ చైతన్యాన్ని దాశరథి కవిత్వం వ్యక్తం చేసింది.

"లెండి లెండి ! మేల్కొనండి

బానిసత్వపు నిద్రనుండి" అని

"అష్టదరిద్రుడికి, ఆగర్భ శ్రీమంతుడికీ మధ్య జరుగుతున్న పోరాటం ఇది" అని రెంటాల ప్రకటించాడు.

చారిత్రక భౌతికవాద దృష్టి : -చరిత్ర అంటే వ్యక్తుల చరిత్ర కాదు. సామాజి వర్గాల, శ్రేణుల స్వభావం, ప్రవర్తన, ఆర్థిక రాజకీయ వ్యవస్థల నిర్మాణం మొదలైన అంశాల సమన్వయం, ఒక సామాజిక ప్రక్రియ. 'మానవజాతి చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రే' అంటూ విశ్లేషిస్తున్న దృక్పథాన్ని చారిత్రక భౌతికవాదమంటున్నాం. పీడించే వర్గమొకటి, పీడనకు గురయ్యే వర్గమొకటి కొనసాగుతున్న శత్రు వర్గసమాజంలో సంఘర్షణ అనివార్యమౌతుంది. ఈ సంఘర్షణల పర్యవసానంగా సమాజం అనేక పరిణామాలకు లోనవుతూ ఉంటుంది.

"నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం
రణరక్త ప్రవాహసిక్తం
దరిద్రులను కాల్చుకు తినడం”

అని అభివర్ణించిన శ్రీశ్రీ

"రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెదకిన దొరకదు
గతమంతా తడిసె రక్తమున
కాకుంటే కన్నీళులతో”

అని విశ్లేషించారు.

"నైలునదీ నాగరికతలో - సామాన్యుని జీవనమెట్టిది ?
తాజ్మహల్ నిర్మాణానికి - రాళ్లెత్తిన కూలీలెవ్వరు”

అని ప్రశ్నించిన అభ్యుదయ కవిత్వం.

"ఒక వ్యక్తిని మరొకవ్యక్తి
ఒక జాతిని మరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా ? ఇకపై సాగదు" అంటూ ఖచ్చితంగా ప్రకటించింది.

గతితార్కిక దృక్పథం :- నిరంతరం విరుద్ధశక్తుల మధ్య ఘర్షణ కొనసాగుతూ, వారి అకృత వుంటుందన్న మార్క్సిస్టు ఆలోచనా విధానాన్ని గతితార్కిక దృక్పథం అంటున్నాం.

రెండు పరస్పర వ్యతిరేక శక్తులున్న సామాజిక వ్యవస్థ పైకి సహజీవనం సాగిస్తున్నట్లు తనబడుతున్నప్పటికీ, వీటి మధ్య సంఘర్షణ జరుగుతూ ఉంటుంది. సంఘర్షణల్లోంచి అభివృద్ధి కొనసాగుతుంది. ఈ అభివృద్ధి ఎలా కొనసాగుతుందనే క్రమాన్ని నిర్ణయించే సూత్రాన్ని పరిమాణం గుణంగా మారడం అంటున్నాం. ప్రతి వస్తువుకూ నిర్దిష్టమైన పరిమాణం ఉంటుంది. నిర్ధారితగుణం ఉంటుంది. ఈ రెండింటి మధ్య ఐక్యత వస్తువు ఉనికిని ఒక చట్రాన్ని ఇస్తుంది. ఈ ఐక్యత అవాంతర కారణాల చేత భగ్నమైనప్పుడు వస్తువులో మార్పునకు దారితీస్తుంది. పరిమాణం ఒకహద్దు దాటినప్పుడు గుణాత్మక పరిణామానికి పరివర్తన చెందటమే అభివృద్ధి. ఈ పరివర్తన క్రమంలో పాత సామాజిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ నూతన సామాజిక వ్యవస్థ రూపొందుతుందన్న సిద్ధాంతాన్ని గతితార్కిక భౌతిక వాదమంటున్నాం.

“పరస్పరం సంఘర్షించిన

శక్తులలో చరిత్ర పుట్టెను" అని శ్రీశ్రీ వెల్లడించారు.

అంతర్జాతీయ దృక్పథం : "సకలదేశ కార్మికులారా ఏకం కండి" అని ప్రబోధించిన

మార్క్సిజం ప్రాపంచిక దృక్పథాన్ని ఆదర్శంగా స్వీకరించిన అభ్యుదయ కవులు ప్రగాఢమైన దేశభక్తితో పాటు తమ కవిత్వంలో విశాలమైన అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రదర్శించారు.

"చైనాలో రిక్షావాలా

చెక్ దేశపు గని పనిమనిషీ

ఐర్లాందున ఓడ కళాసీ

అణగారిన అర్భులందరూ

హాటస్ టాట్, జూలూ, నీగ్రో

ఖండాంతర నానాజాతులు

## చారిత్రక యథార్థతత్వం

ఒకే గొంతుకతో చాటిస్తారనీ, దీర్ఘశ్రుతిలో తీవ్రధ్వనితో విప్లవశంఖం వినిపిస్తారనీ శ్రీశ్రీ సూచించారు.

"తూర్పు దక్షిణాల దేశమ్ముల మాబంధువులు, మా తమ్ములు

అవీ, నేనూ ఒకటైనాము

పడమర చేస్తుంది రాజీనామా" అని దాశరథి అభిలషించాడు.

స్పెయిన్ అంతర్యుద్ధంలో ఫాసిస్టు రాజరికానికి, రిపబ్లికన్ ప్రభుత్వానికి మధ్య జరిగిన సంఘర్షణల్లో వివిధ దేశాల రచయితలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రత్యక్షంగా పాల్గొన్నారు. రాల్ఫ్, ఫాక్స్, క్రిష్టోఫర్ కాడ్వెల్ వంటి రచయితలు ఈయుద్ధంలో వీరమరణం పొందారు. ఇలాంటి అంతర్జాతీయ సౌభ్రాతృత్వ దృష్టిని ఆదర్శంగా స్వీకరించిన అభ్యుదయ కవులు దేశాల ఎల్లలు దాటి, మానవజాతి సంక్షేమం కోసం నాలుగు దిక్కులను ఏకంచేసే కవిత్వం రాస్తున్నారు.

పారిస్ కమ్యూన్ పతనానంతరం పారిస్ విప్లవయోధుడు 'యూజినీపాటియర్ ఫ్రెంచి భాషలో రాసిన 'అంతర్జాతీయ గీతాని'కి 'పియరీ డేజిటర్' స్వరకల్పనచేసి బాణిని సమకూర్చాడు. ప్రపంచంలోని అనేక భాషల్లో ఈ గీతానికి అనువాదం ఒకే బాణీలో కొనసాగించారు. ఈ గీతాన్ని 'రహ్మత్ అలీఖాన్ ఉర్దూభాషలోకి అనువాదం చేశారు. బెంగాల్ విప్లవకవి 'నజ్రుల్ ఇస్లాం' బెంగాలీ అనువాదం చేశారు. ప్రముఖ హిందీకని హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ హిందీలోనికి అనువదించారు. 1935లో బాలాంత్రపు నళినీ కాంతారావు, మహీధర రామమోహనరావు తెలుగులోకి తర్జుమా చేశారు.

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మేడే'ను ప్రశంసిస్తూ పులుపుల వెంకటశివయ్య, సుంకర, రెంటాల, మల్లారెడ్డి, రాంభట్ల, గద్దర్, శివసాగర్ మొదలైన కవులు ప్రతిభావంతమైన గీతాలు రాశారు. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో అభ్యుదయ కవులు సోవియట్ యూనియన్ విజయాన్ని కాంక్షిస్తూ ఫాసిజాన్ని ప్రతిఘటిస్తూ రచనలు చేశారు. ప్రపంచశాంతిని కాంక్షించారు. ప్రపంచదేశాల్లో పెల్లుబికిన విముక్తి పోరాటాలకు. స్వాతంత్ర్య సమరాలకు అభ్యుదయ కవిత్వం

నివాళులర్పించింది. బంగ్లాదేశ్ పోరాటానికి మద్దతు పలికిన డా॥ 'చిరంజీవినీ కుమారి' సోవియట్ కవయిత్రుల కవితలను అనువదించి

"లేత మందారాలు - రక్త సిందూరాలు' అనే పేరుతో గ్రంథస్థం చేశారు. జర్మన్ మహాకవి బ్రెస్ట్ కవితలను ఏటుకూరి ప్రసాద్ తెలుగులోకి అనువదించారు. అలాగే సోవియట్ యూనియన్, బల్గేరియా, చైనా, వియత్నాం వంటిదేశాల రచనల్ని లాటిన్ అమెరికా, ఆఫ్రికా విముక్తి పోరాట యోధుల రచనల్ని అభ్యుదయ సాహిత్యోద్యమం తెలుగు సాహిత్య లోకానికి పరిచయం చేసింది.

..............................

ప్ర. 2. శిష్లా ఉమామహేశ్వరరావు జీవిత విశేషాలను, రచనలను, తెల్పండి.

జ ॥ శిష్లా ఉమామహేశ్వరరావుగారు 1912లో గుంటూరు జిల్లా మంచాల గ్రామంలో ఒక శిష్ట వైదిక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు. తెలుగు కవిత్వాన్ని విచిత్రమైన క్రొత్త పుంతల వైపు మళ్లించాలని ప్రయత్నించి చివరకు ఆశలు తీరకుండానే అకాల మరణం పాలయ్యాడు. బాల్యంలోనే పురాణగాథల్ని, జానపద సాహిత్యాన్ని జీర్ణించుకున్నాడు. ఆంగ్ల సాహిత్యంలో యమ్.ఏ., పట్టా పొంది ఆ భాషలోని నూతన కవితా ప్రస్థానాలన్నింటినీ చక్కగా ఆకళింపు చేసుకున్నాడు. కొంత కాలం దివ్యజ్ఞాన సమాజంలో ఉన్నాడు. కొంత కాలం ఒక యతి వద్ద శుశ్రూష చేశాడు. జ్యోతిష్యం అభ్యసించాడు. ఆధ్యాత్మ రామాయణ కీర్తనలన్నా, వాగ్గేయకారుల కృతులన్నా ఎక్కువగా ఇష్టపడేవాడు.

లయలో, ఛందసస్సులో, పదప్రయోగంలో నూతన ప్రయోగాలు చేస్తూ విష్ణు ధనువు, నవమి చిలుక అనే రెండు ఖండ కావ్య సంపుటాలను ప్రకటించి తెలుగు కవితా జగత్తును అబ్బురపరిచాడు. అచ్చు. వేయటంలోనూ, అచ్చువేసే కాపీల సంఖ్యలోనూ కూడా నవ్యతను ప్రదర్శించాడు. మొట్టమొదట ఒక కళాశాలలోను, తర్వాత కొంతకాలం ఒక పరంలోను పనిచేశాడు. తర్వాత సైన్యం చేరి చిత్ర విచిత్రమైన అనుభవాలను పొంది, 'సిపాయి కథలు' అనే మౌలికములైన కథలతో ఆ అనుభవాలను ప్రకటించాడు. ఆనాటి ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, తదితర కారణాల వల్ల బ్రతుకు తెరువు కోసం బ్రిటీష్ సైన్యంలో చేరిన నాటి తెలుగువారి జీవితాల్ని

సిపాయి కథల ద్వారా కళ్ళముందు సాక్షాత్కరింపజేశాడు. భీకర యుద్ధ వాతావరణంలోనూ, సైనికుల దినచర్యలో చోటు చేసుకొనే ఘటనల్ని హాస్య పూరితంగా చిత్రించాడు. వీరి కథలో 'లెఫ్టినెంట్ తులసిలో తప్ప మిగిలిన కథలన్నింటిలోనూ గుంటూరు మాండలికాన్ని ఉపయోగించాడు. ఈ కథలన్నింటిలో ఆయా ప్రాంతాలకు చెందిన నుడి కారాలు, సామెతలు విరివిగా కన్పిస్తాయి. సిపాయి కథలు సంకలనంలో వీరి ఆకాశవాణి కథలు, నాటికలు, గేయాలు కూడా దర్శనమిస్తాయి. ఆనాటి పత్రిక తీరును, వాటిల్లో వచ్చే ఇంటర్వ్యూలను, కథనాలను రచయిత వ్యాసాల్లో వ్యంగ్యంగా ఒకింత ఘాటుగానే విమర్శించారు. ఆ కాలంలో మహిళల, దుస్థితి, వితంతు వివాహాల వెనుక రాజకీయాలు, అసలు నిజాలు ప్రధాన ఇతివృత్తాలుగా శిష్లా - నాటకాలు రాశారు.

శిష్లా భావ కవిత్వం మొదలు అధివాస్తవిక, కవిత వరకు వివిధ కవితా మార్గాల్లో తన విశిష్ట ముద్రను ప్రదర్శించాడు. తన కావ్యాలుతాను ప్రకటించిన ప్రేమను 'ఉగ్రాభ్రాంతప్రేమ' అని పేర్కొన్నాడు. వీరు రచించిన కాళింగి పాటలు తెలుగు కవిత్వానికి నూతన అలంకారాలయ్యాయి. గోరింట రాక్షసుడు మొదలైన పిల్లల కథల్ని, ఇతర వ్యాసాలెన్నింటినో వివిధ పత్రికల్లో 'మహేశ్వర', 'వినాయక పండితుడు', ఉమా, 'విజయ మహేశ్వరం' వంటి కలం పేర్లతో ప్రకటించాడు. కొంత కాలం గుంటూరు నుండి వెలువడిన 'శాంతిని' అనే పత్రికను సంపాదకులుగా పనిచేశాడు.

"కవి గొప్ప ప్రతిభావంతుడు, మనస్సులో జరుగు కొన్ని వికారాలను, ఉన్మేషాలను ఇంత చక్కగా ఆరోపించి చెప్పటం మిక్కిలి కష్టమైన పని" అని విశ్వనాథ "ఇతనిది శ్రీశ్రీ నారాయణ బాబుల వలె ఎక్కడ నుంచో వచ్చిన కవిత్వం కాదు. తెలుగు గడ్డలో పుట్టి తెలుగు జీవితంతో పెరిగిన నవ్య కవిత్వం" అని నోరి నరసింహ శాస్త్రి వీరిని ప్రశంసించారు. శ్రీ శిష్లా ఉమామహేశ్వరరావుగారు 1953లో కీర్తిశేషులయ్యారు.

...............................................

ప్ర. 3. శ్రీరంగం నారాయణ బాబు జీవిత విశేషాలు తెల్పండి.

జ॥ శ్రీరంగం నారాయణ బాబు 1906 మే నెల 17 వ తేదీన విజయనగరంలో జన్మించారు. ఆ జన్మ బ్రహ్మచారిగా జీవితం గడిపారు. పద్య రచనలకు, భావకవిత్వానికి వ్యతిరేకంగా మరి కొంతమందితో కలిసి "సర్రియలిజమ్" అనే విదేశీయ ప్రక్రియననుసరించి రచనలు చేశారు. "ఒక యదార్థ రూపాన్ని కవితలోనో, చికి లేఖనంలోనో చూపించినపుడు ఆ విషయం యొక్క మూల స్వరూపాన్ని వివిధ విపరీత పరిస్థితుల్లో వర్ణించి మరువలేని చిత్రంగా ప్రదర్శించడమే సర్రియలిజం అంటారు. దీన్ని అధివాస్తవికత అని కొందరు అతి వాస్తవికత అని మరికొందరు అన్నారు. విధానం విదేశీయమైనదైనా మన దేశపు పౌరాణిక గాథలు, సమయోచిత అర్థాన్నిచ్చే ఆంధ్ర, సంస్కృత శబ్ద ప్రయోగం వీరి రచనల ప్రధాన లక్షణంగా కన్పిస్తుంది.

ఈయన భావ కవిత్వంలోని ఆదర్శ వాదానికి ఎదురు తిరిగి వాస్తవికతా వాదాన్ని ప్రతిపాదించాడు. భావకవిత్వంలోని అతీంద్రియ కల్పనలకు, లలితశైలికి, మధురపద సమ్మేళనానికి అభూత సౌందర్య దృష్టికి విరుద్ధంగా తిరుగుబాటు చేశాడు. సమకాలికుల కన్నా వినూత్నమైన రచనలు చేశాడు.

శ్రీ నారాయణ బాబు, విశాఖపట్నం, ఫిడేలు నాయుడుగారి వేళ్లు, గడ్డిపరక, గేదె పెయ్య తెనుగు రాత్రి రుధిరజ్యోతి, కపాలమోక్షం, కిటికీలో దీపం, ఊరవతల, పండగనాడు, మౌన శంఖం, సంపంగి తోట మొదలైన రచనలు చేశాడు. దేశమంత గేయంలో కొత్త దేశాన్ని దర్శించాడు. స్త్రీ అసహాయ స్థితికి స్పందించాడు. 'జ్వలనా' అనే కవితలో కన్నా ఇందులో స్త్రీలపట్ల సానుభూతి చూపించాడు. భగత్సాంగ్పై రాసిన ఖండికలో ఆవేశం, సామ్యవాదంలో చూపు రెండూ కనబడతాయి. భగత్సింగ్ని మహనీయ త్యాగమూర్తిగా చూపిస్తాడు. వీరి గడ్డి పరక ఖండిక వీరికి సామ్యవాద దృక్పథం, అభ్యుదయ భావావేశం వున్నదనటానికి నిదర్శనంగా నిలుస్తుంది. విశాఖ పట్నం ఖండికలో విశాఖపట్టణాన్ని కొత్త పార్శ్వంలో విలక్షణమైన రీతిలో వర్ణించాడు. మౌన శంఖం, రుధిర జ్యోతి కవితా సంపుటాలు వీరిని అతి నవ్యకవిగా నిలబెడతాయి. రుధిర జ్యోతి శ్రీశ్రీకి అంకితం చేయబడింది. వీరి కవిత్వంలో అది వాస్తవికత ఎక్కువగా వుంది. "ఈయన కవిత్వంలోనే

ఆరాచకవాది. సాహిత్యంలోనే విప్లవకారుడు" అని ఆరుద్రచే ప్రశంసింపబడిన నారాయణబాబు 1961 అక్టోబరు 2వ తేదీన చెన్నైలో మరణించాడు.

...............................

4. శ్రీశ్రీ జీవిత విశేషాలను రచనలను తెల్పండి.జ॥ శ్రీశ్రీ అనే పేరుతో గొప్ప ఖ్యాతిని ఆర్జించి, విప్లవ కవిగా, సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవానిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షునిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షునిగా, సినిమా మాటల రచయితగా ప్రఖ్యాతి వహించిన శ్రీరంగం శ్రీనివాసరావు 1910 జనవరి 2వ తేదీన అప్పలకొండ, వెంకట రమణయ్య దంపతులకు విశాఖపట్నంలో జన్మించాడు. విశాఖపట్నంలోని ఏ.వి.ఎస్ కాలేజీలోను మద్రాసు క్రిష్టియస్ కాలేజీలోను విద్యాభ్యాసం చేశాడు. 7వ సంవత్సరం వయస్సులోనే కవితారచనకు శ్రీకారం చుట్టాడు. తన మొదటి గేయాల పుస్తకాన్ని 8వ సంవత్సరం వయస్సులో ప్రచురింపజేశాడు. సాంప్రదాయ పద్ధతిలో రాసిన 'ప్రభవ' అనే కావ్యసంపుటిని కవితాసమితి 1928లో ప్రచురించింది. 1946లో వారం వారం అనే వచన రచనల సంకలనం అచ్చయింది. తర్వాత కాలంలో సాంప్రదాయకమైన గ్రాంథిక శైలి ఛందస్సువంటి వాటిని ప్రక్కన పెట్టి వాడుకభాషలో, మాత్రాఛందస్సులో కవిత్వం రాయటం సాగించాడు. ఆ తర్వాత బ్రతుకు తెరువులో భాగంగా 1935లో ఏ.వి.ఎస్. కాలేజీలు, డిమాన్స్ట్రేటర్, 1938లో ఆంధ్రప్రభ సబ్ ఎడిటర్గా పని చేశాడు. తర్వాత ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలోను, మిలటరీలోను నిజాము నవాబు వద్దను ఆంధ్రవాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేశాడు. 1933-40 మధ్య కాలంలో తాను రాసిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహాప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించాడు. ఈ పుస్తకం తెలుగు సాహిత్యపు దశను, దిశను మార్చింది. శ్రీశ్రీని మహాకవిని చేససింది. ఇది దాదాపు 20 ముద్రణలను పొందింది. దీని తర్వాత శ్రీశ్రీ ప్రగతి వారపత్రికలో ప్రశ్నలు, జవాబులు అనే శీర్షిక నిర్వహించాడు. చరమ రాత్రి, మన, గురజాడ, జాబులు, చైనాయానం, సిప్రాలి, వ్యూలు, రివ్యూలు, మరోప్రస్థానం, ఖడ్గసృష్టి వంటి రచనలు చేశాడు. రేడియో నాటికలు రాశాడు. అనంతం అనే నవలను స్వీయ చరిత్రను రాసుకున్నాడు.

శ్రీశ్రీ మద్రాసులో వుండటం వల్ల కవి కావటంవల్ల సినిమావాళ్ళతో పరిచయం ఏర్పడింది. 1950లో ఆ పరిచయం పూర్తిగా ప్రత్యక్షమైంది. హిందీలో "నీరా ఔర్ నందా" అనే పేరుతోవున్న చిత్రానికి మాటలు రాసే అవకాశం లభించింది. శ్రీశ్రీ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. "ఆహుతి" అని పేరు పెట్టి ఆ సినిమాకు మాటలు, పాటలు సమకూర్చాడు. సినిమా విజయవంతమైంది. ఆ తర్వాత చాలా సినిమాలకు మాటలు పాటలు రాశాడు. సినిమారంగాన ప్రఖ్యాత కవిగా పేరు గడించాడు. 1955 సారంత్రిక ఎన్నికల్లో కమ్యూనిష్టుల తరపున ప్రచారం చేశాడు. 1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం తీవ్రంగా వున్న సమయంలో వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి ఖమ్మంలో సమైక్య వాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన జరిపాడు. వివిధ దేశాల్లో ఎన్నో మార్లు పర్యటించాడు. ఎన్నెన్నో పురస్కారాలు పొందాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాజా లక్ష్మీ ఫౌండేషన్ అవార్డు అందుకున్నాడు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షునిగా పని చేశాడు. 1970లో షష్టిపూర్తి సందర్భంగా ఆయన అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం ఏర్పడింది.

భావకవిగా. కవిత్వాన్ని ప్రారంభించిన శ్రీశ్రీ క్రమక్రమంగా అభ్యుదయ కవిగా పరిణమించాడు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా చివరి వరకు పీడిత వర్గపు కవిగా తననుతాను గుర్తుంచుకొని వర్గరహిత సమాజ స్థాపనే ధ్యేయంగా కృషి చేశాడు. తెలుగు సాహిత్యంలో క్రొత్త క్రొత్త ప్రక్రియలకు శ్రీకారం చుట్టాడు. అభ్యుదయ కవిత్వంతోపాటు అధివాస్తవిక కవిత్వంలో కూడా కొన్ని ప్రయోగాలు చేశాడు. ప్రాస క్రీడలు అనే పేరుతో హాస్యధోరణి కవిత్వాన్ని రాశాడు. అనేక సాహిత్య సంఘాలతో సాహిత్య ఉద్యమాలతో సజీవ సంబంధాన్ని కొనసాగించి యుగకవిగా కీర్తింపబడిన శ్రీశ్రీ 1983 జూన్ 15న కీర్తిశేషులయ్యారు.

..............................

ప్ర. 5. పఠాభి జీవిత విశేషాలను, రచనలను తెల్పండి.

జ ॥ పఠాభి అనే కలం పేరుతో ప్రసిద్ధుడైన తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి 1919లో నెల్లూరు సమీపంలోని పొట్టేపాళెంలో సుదర్శనమ్మ రామిరెడ్డి దంపతులకు జన్మించాడు.

పఠాభి ఆగర్భ శ్రీమంతుడు. సుకుమార హృదయుడు. పువ్వులు కోయటం, ఆకులు తెంచటం క్రిమికీటకాదులకు బాధకలిగించటం వంటి పనుల్ని సహించపడల్గేవాడుకాదు. ప్రాథమిక విద్యాభ్యాస నెల్లూరు మూలాపేటలోని పాఠశాలలో జరిగింది. చిన్నప్పటి నుండి పదాలతో ఆడుకోవటం వీనికి అలవాటుగా వుండేది. పఠాభి తన గది కిటికీలో కూర్చొని దూరంగా కన్పించే చింతమాన్ను చూస్తూ 'చింతా-చింతా-అంతా-యంతా-కొంతా-"ముంతా - తంతా' అని ఇలా పదాలతో సరదా పడేవాడు. నెల్లూరు వి.ఆర్. హైస్కూల్లో చదువుతూ స్కూలు టౌన్హాలు ఆవరణలోని వర్ధమాన సమాజం గ్రంథాలయం మెట్ల మీద కూర్చొని ఎన్నో పుస్తకాలు చదివినట్లు ఆయనే చెప్పుకున్నాడు. పోతన, పెద్ద ప్రబంధ కవులు భట్టుమూర్తి, చేమకూర వేంకట కవి వంటి కవుల పద్యాలంటే ఎక్కువుగా ఇష్టపడేవాడు. చిన్నప్పటి నుండే అంత్యప్రాసల మీద, శబ్దాలంకారాల మీద ఇష్టుట పెంచుకున్నాడు. జాతీయోద్యమ స్ఫూర్తితో హిందీ భాష నేర్చుకున్నాడు. 13-14 సంవత్సరాల వయసులోనే కథలు, కవితలు రాయటం ఆరంభించాడు. తన తొలి రచనన్ని జమీన్ రైతు వారపత్రిక, కృష్ణాపత్రికల్లో ప్రచురించినట్లు పేర్కొన్నాడు. వీరి మొదటి అయిన ప్రతిధ్వనులు 1934లో చిత్రగుప్తలో అచ్చుకాగా మిగిలిన కథలన్ని 1935-40. మధ్య కాలంలో వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.

పఠాభి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఇంటర్మీడియట్ చేసుకొని రవీంద్రనా ఠాగూర్ స్ఫూర్తితో శాంతినికేతన్కు వెళ్ళి చదువుకున్నాడు. పట్టభద్రుడయ్యాక కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్స్ డిగ్రీ చదివాడు. 1938లో కలకత్తా నుండి తిరిగి వచ్చి కొన్నాళ్ళు గూడూరులో కుటుంబ వ్యాపారమైన అభ్రకం ఎగుమతి చేశాడు. తర్వాత అమెరికలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో గణితం, సినిమా కళ మొదలైన విషయాలను గూర్చి అవగాహన పెంచుకున్నాడు, గురుదేవుని మాదిరిగా శబ్దాలంకారాలను, అంత్యప్రాసలను వాడుతూ కవితలు రాశాడు. కమ్ము కొస్తున్న యుద్ధమేఘాల మీద, జాతీయోద్యమం మీద, కమల్ పాషా మీదకూడా గీతాలు రాశాడు రష్యన్ కవియైన నెక్రసోప్ రాసిన ఉప్పు పాటను అనువదించాడు. రైతుల మీద కవితలు రాశాడు. ఫిడేలు రాగాల డజన్ రచించి అచ్చువేశాడు.

తెలుగు ఆధునిక కవిత్వంలో ఇది కొత్తపుంతలు తొక్కింది. చలం రాగాల డజన్ను మెచ్చు కొంటూ పఠాభికి ఉత్తరం రాశాడు.

పఠాభి వ్యాపారం కోసం అమెరికా వెళ్ళింతా తండ్రి యిచ్చి డబ్బుల్ని విచ్చలవిడిగా ఖర్చు చేశాడు. తన అమెరికా అనుభవాలను, జీవితాన్ని వివరిస్తూ తెలుగు పత్రికలకు వ్యాసాలు పంపాడు. 1942 లో రెండవ ప్రతికలకు వ్యాసాలు పంపాడు. 1942లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభంకాగానే ఆరు నెలల సాహసోపేతమైన సముద్రయాన ద్వారా నౌకలో భారత్ చేరుకున్నాడు. యుద్ధ సమయంలో స్వచ్ఛంద సేవికగా పని చేస్తున్న స్నేహలతను వివాహం చేసుకున్నాడు. వివాహానికి ముందు రాసిన విరహగీతాలను 'నీలగిరి నీలిమలు' పేరుతో పుస్తక రూపంలో వెలువరించాడు. పెళ్ళి కారణంగా తండ్రితో సంబంధాలు తెంచుకున్నాడు. మద్రాసులో స్థలాన్ని అద్దెకు తీసుకొని అక్కడ "విజయ ప్రైవేట్ లిమిటెడ్" హాలు నిర్మించి 'ఫోకస్' అనే ఇంగ్లీషు వారపత్రికను నడిపాడు. కాని అది 36 వారాలు మాత్రమే నడిచి ఆగిపోయింది.

అప్పుడు పఠాభి తన హాస్టల్ మిత్రుడు కె.వి.రెడ్డి పింగళి నాగేంద్రరావులతో కలిసి జయంతి పిక్చర్స్, జయంతి సౌండ్ స్టూడియోలను నెలకొల్పి జయంతి సంస్థపేరుతో కె.వి.రెడ్డి దర్శకత్వంలో పెళ్ళినాటి ప్రమాణాలు, కృష్ణార్జున యుద్ధం, భాగ్యచక్రం అనే సినిమాలు తీశారు. పెళ్ళినాటి ప్రమాణాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అవార్డు దక్కించుకుంది. 1971లో రూపుదిద్దుకున్న సంస్కార చిత్రం రాష్ట్రపతి నుండి స్వర్ణకమలం అందుకుంఇ అనంతరం పఠాభి నెల్లూరు వచ్చి తండ్రిని కలుసుకున్నాడు కాని అది మాటలులేని మనరాగమయ్యింది. తర్వాత కొద్ది కాలానికే రామిరెడ్డి చనిపోయాడు. 1975లో పఠాభి 'చండమారుత' సినిమా నిర్మాణానికి పూనుకున్నాడు. అది అత్యవసర పరిస్థితి సమయం కావటం వల్ల పఠాభి కుటుంబ సభ్యులంతా అరెస్టయ్యారు. 1979లో కవిత్రయ జయంతి సందర్భంగా వర్ధమాన సమాజం పఠాభి షష్టిపూర్తి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఆయన్ని సత్కరించింది. 1994లో రావెల సోమయ్య, ఆతని మిత్రులు హైదరాబాద్లో పఠాభి 75 వ జన్మదినాన్ని అమృతోత్సవంగా ఘనంగా జరిపించి విశేష సంచికను

వెలువరించారు. ఇలా అనేక సన్మానాలు, సత్కారాలు పొందిన పఠాభి 2006 మే నెల 6వ తేదీన బెంగుళూరులో తుదిశ్వాస విడిచారు.

.......................

## 12. ప్రసిద్ధ విప్లవ కవుల పరిచయం

ప్ర. 1.విప్లవ కవిత్వాన్ని గూర్చి రాయండి ?

జ II ఆంగ్లంలోని 'రివల్యూషన్' అనే పదానికి సమానార్థకంలో తెలుగులో 'విప్లవం' అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. విప్లవం అంటే "విప్లవాన్ని సమర్థిస్తూ, విప్లవోద్యమ చరిత్రను ప్రతిఫలిస్తూ విప్లవ భావాలను ప్రచారం చేస్తూ రాసే సాహిత్యం విప్లవ సాహిత్యం. రాసేకవిత్వం విప్లవకవిత్వం ఒక్కమాటలో చెప్పాలంటే విప్లవం వస్తువుగావచ్చే కవిత్వం విప్లవకవిత్వం" అని ఆచార్య కాత్యాయనీ విద్మహే నిర్వచించారు. విప్లవం అంటే ఏమిటి? అస్తిత్వంలో ఉన్న సామాజిక ధర్మాన్ని త్రోసిరాజని, క్రొత్తధర్మాన్ని స్థాపించటానికి జరిగే క్రియాకలాపం విప్లవం. అసమానతా వ్యవస్థను నశింపజేసి, సమానతా ధర్మస్థాపన చేయటం విప్లవం. ప్రస్తుత సందర్భంలో ఇది వర్గ అసమానతల నిర్మూలననే సంబోధిస్తుంది. మరీ ముఖ్యంగా భూసంబంధాలలోని అసమానతలనే లక్ష్యంగా చేసుకున్నది. అందుకనే భూస్వామ్య వ్యతిరేక రైతాంగ విప్లవం అస్తిత్వంలో ఉన్న రాజ్యాధికార వ్యవస్థపై ధిక్కార భూసంబంధాలను భూమిలేని అశేష పేదజన ప్రయోజనాలకు అనుకూలంగా మంచిని మార్చలేని రాజ్యాధికార స్వభావాన్ని గుర్తెరిగి తిరుగుబాటు, భూస్వామ్య ఆర్థిక పునాదిమీద ఏర్పడిన రాజకీయ వ్యవస్థను బల ప్రయోగంతో సమూలంగా పెకిలించే కార్యక్రమం. ఈ కార్యక్రమ రూపాలను, సారాన్ని గుణాత్మకంగా, విమర్శనాత్మకంగా అనుసృజించేది విప్లవ కవిత్వం. విప్లవ నిర్మాణానికి, నిర్వహణకు సంబంధించిన రాజకీయ సిద్ధాంత తాత్త్వికతకు అనుకూలమైనదంతా విప్లవ కవిత్వమే. విప్లవభావ తీవ్రతను, విప్లవ కార్యాచరణను వస్తువుగా చేసుకున్నది విప్లవకవిత్వం అని ఆచార్య కేతవరపు రామకోటిశాస్త్రి వివరించారు.

"విప్లవకవిత్వమే నేటికవిత్వం. ఇది ఎవరో కొందరు వ్యక్తులు స్థాపించిన నవ్యకవిత్వ ఉద్యమంకాదు. కవిత్వం ఒక సామాజిక శక్తి. సామాజిక వాస్తవికత రూపమే విప్లవకవిత్వం. వర్గసమాజాన్ని కూకటివేళ్లతో పెకలించి జాతికి దోపిడీ వ్యవస్థనుంచి విముక్తిని సాధించటానికి సాంస్కృతికరంగంలో విప్లవకవిత్వం నాయకత్వం వహిస్తుంది. వివిధ రంగాల్లో జరుగుతున్న విప్లవ సమరంలో కవులు కూడా విప్లవ సైనికులై కవిత్వ సాధనంతో పోరాటం చేస్తున్నారు. పీడితులు ఆయుధపోరాటంతో విప్లవ విజయాన్ని సాధించటం చారిత్రకంగా అనివార్యం. దోపిడీవర్గాన్ని ఎదుర్కొంటున్న వివిధ ప్రజా ఉద్యమాలను శాస్త్రీయంగా సమర్థించటమే విప్లవకవుల ప్రథమ కర్తవ్యం. విప్లవకారుల్ని వర్గశత్రువులు సాంస్కృతిక సాధనాలతో కూడా ఎదుర్కొంటున్నారు. సాంఘిక విప్లవం వేగవంతం కావటానికి సాంస్కృతిక భావవిప్లవం దోహదం చేస్తుంది. ప్రజలలో భావచైతన్యాన్ని, సామాజిక స్పృహను కలిగించటానికి, ప్రజల్ని విప్లవానికి సిద్ధం చేయటానికి విప్లవకవులు రచనలు చేస్తారు. సమాజంలో సామ్యవాద, సామాజిక వాస్తవికత స్పృహ కలిగించటమే విప్లవకవుల ధ్యేయం" అని త్రిపురనేని మధుసూదనరావు విప్లవకవుల మనోభావాల్ని విడమరచి చెప్పారు.

1970లో విప్లవ కవిత్వోద్యమ ప్రారంభంలో 'ఝుం ఝుం' కవితా సంకలనం వచ్చింది. ఇది శ్రీకాకుళం గిరిజన పోరాటంలో ప్రాణాలర్పించిన 'సుబ్బారావు పాణిగ్రాహికి' అంకితం చేయబడింది. ఇందులో నక్సలైట్ నాయకులను గురించి రాసిన అనేక స్మృతిగేయాలు ఉన్నాయి. ఇది అత్యంత ప్రజాదరణ కలిగిన కవితా సంకలనంగా కీర్తింపబడింది. ఈ కవితా సంకలనాన్ని ప్రభుత్వం నిషేధించింది. పి.కిషన్రావు 'మార్చ్' 'ఇప్పుడు వీస్తున్నగాలి' 'లే' వంటి కవితా సంకలనాలను ప్రచురించారు. ఇందులో చెరబండరాజు, వంగపండు, గద్దర్ మొదలైనవారి పాటలున్నాయి. వీటిని కూడా ప్రభుత్వం నిషేధించింది. విప్లవకవులు అక్రమ అరెస్టులను, అక్రమకేసులను ప్రతిఘటించారు. 'అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు' అని వీరు నినదించారు.

శ్రీశ్రీ మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, కవితా సంకలనాలు విప్లవ సాహిత్యాన్ని సృష్టించాయి. విప్లవ పోరాటంలో పాల్గొని ఉరిశిక్షకు గురైన భూమయ్య, కృష్ణా గౌడల స్మృతిలో వీరు రాసిన

'భూమ్యాకాశాలు' కవిత విప్లవ కవిత్వంలో ఒక ప్రత్యేకతను, విలక్షణతను సంతరించుకుంది. అదే విధంగా 'తుది పయనం తొలి విజయం' అనే కవిత విప్లవకారుల్ని ఒక ఊపు ఊపింది.

"ఊగరా ! ఊగరా ! ఉయ్యాల

ఉరికొయ్య అందుకొని ఊగరా

ఉరికొయ్య అంటుకొని ఊగరా"

"తెల్లవాడు నిన్ను నాడు భగత్సింగు అన్నాడు

నల్లవాడు నిన్ను నేడు నక్సలైటు వన్నాడు

ఎల్లవారు నిన్ను రేపు వేగుచుక్క అంటారు శివాజీకి వారసుడా శ్రీశ్రీ కవిత్వ లాలసుడా నీధాటికి అడ్డులేదు నీత్యాగం వృధాకాదు"

విప్లవకవుల్లో చెప్పుకోదగినవాడైన శివసాగర్ 'నరుడో భాస్కరుడా అనే గేయంతో విప్లవ కవిత్వంలో ప్రముఖుడయ్యాడు. వీరు 'నాచెల్లీ చంద్రమ్మ' అనే కరుణరసాత్మకమైన గేయం రాశారు. తోట రాముడిపాట, ఏటికెదురీదే వాళ్లమురా అనే ప్రసిద్ధ విప్లవగేయాలు రాశారు.

చెరబండరాజు 'దిక్సూచి' ముట్టడి, గమ్యం, కాంతియుద్ధం, గౌరమ్మకలలు, జన్మహక్కు, పల్లవి అనే కవితల్లో తిరుగుబాటు వేదాంతం ప్రబోధించారు.

నగ్నముని తూర్పుగాలి అనే కవితతో పాటు 'ఉదయించని ఉదయాలు' అనే కవితా సంపుటిని ప్రచురించారు. కోస్తాంధ్రలో పెనుతుఫాను సంభవించిన సందర్భంలో ప్రభుత్వ వ్యవస్థ కొయ్యగుఱ్ఱంలా ఉందని విమర్శిస్తూ 'కొయ్యగుఱ్ఱం' అనే దీర్ఘకవిశ రాశారు. సమాజంలో మానవతా రాహిత్యాన్ని తాత్త్వికంగా వివరించారు.

వరవరరావు జీవనాడి, చలినెగళ్లు స్వేచ్ఛ, భవిష్యత్ చిత్రపటం, సముద్రం, ముక్తకంఠం మొదలైన విప్లవకవితా సంపుటాలు వెలయించారు. 'మువ్వన్నెల జెండా అనే కవితలో

"ధనగణమన అధినాయక్ జయహే

భారతభాగ్య విధాతా

భయహే ! భయహే!

భయ, భయ, భయ, భయహే " అంటూ దేశ దౌర్భాగ్యాన్ని, విప్లవ అవసరాని విపులీకరించారు. "స్వతంత్రదేశంలో సర్వత్రా భయమే రాజ్యం చేస్తుంది" అని వ్యంగ్యంగా విమర్శించారు.

విప్లవ సాహిత్యంలో గద్దర్ ఒక మహాశక్తి. వీరు గోచి, గొంగడి తప్ప మరియే ఇతర ఆహార్యం లేకుండా ఆంధ్రదేశమంతటా తిరిగి ప్రజల్ని జాగృతుల్ని చేశారు. వివిధ పోరాటాల్లో ప్రాణాలు అర్పించుకున్న వీరుల్ని గూర్చి అద్భుతంగా గానం చేశారు. చనిపోయిన వాళ్లందరికీ లాల్సిలాములు చెప్పారు.

రమణారెడ్డిగారి ఎర్రపిడికిలి, జైలుకోకిల, జ్వాలాముఖిగారి ఓటమి, తిరుగుబాటు నిఖిలేశ్వర్గారి 'మండుతున్న తరం', శివారెడ్డిగారి నేత్రధనుస్సు, రక్తం సూర్యుడు. ఆసుపత్రిగతం ఇదే కోవకు చెందుతాయి.  1982లో ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్ ప్రచురణగా 'ఈతరం 'యుద్ధకవిత' వచ్చింది. ఇందులో శ్రీశ్రీ, శివసాగర్, చెరబండరాజు, వరవరరావు, దేవీప్రియ, నగ్నముని, శివారెడ్డి, జయధీర్ తిరుమలరావు, అజంతా మొదలైనవారు రాసిన గేయాలున్నాయి.

గద్దర్ పాటలు, జనసేన పాటలు, జననాట్యమండలి పాటలు, గమ్యం, ఎరుపు, కల్లోల కలల మేఘం, అడవి ఉప్పొంగిన రాత్రి, మహోదయం, జముకుల కథ, లావా, గోదావరిలోయ మొదలైన వాటిల్లో విప్లవభావాలు చోటు చేసుకున్నాయి. పత్రికలు కూడా విప్లవ సాహిత్యానికి ఎంతో మేలు చేశాయి. విప్లవ భావాలకు సంబంధించిన గేయాలు, కథలు, వ్యాసాలు, ఆయా పత్రికల్లో వచ్చాయి. అరుణతార, సృజన, విమోచన, ఎర్రగడ్డ, పిలుపు, ప్రభంజనం మొదలైన పత్రికలు విప్లవ సాహిత్యాన్ని ప్రోత్సహించాయి. కొడవటిగంటి, రాచకొండ విశ్వనాథశాస్త్రి,

కాళీపట్నం రామారావు, చాగంటి సోమయాజులు, అల్లం రాజయ్య మొదలైనవారు అనేక విప్లవ కథలు రాశారు.

ఈవిధంగా విప్లవ రచనలవల్ల, విప్లవ రచయితల సంఘం వల్ల అటు సమాజం మీద, ఇటు సాహిత్యం మీద విప్లవ ప్రభావం బాగానే పడింది. సమాజంలోనూ, సాహిత్యంలోనూ, విప్లవ ప్రభావాలు పాతుకుపోయాయి. తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విప్లవసాహిత్యం ప్రధాన భూమిక పోషించింది.

..............................

ప్ర. 1. స్త్రీవాద కవిత్వం నేపథ్యం - ప్రధానాంశాలను గూర్చి వ్రాయండి.

జ| స్త్రీవాద కవిత్వం నేపథ్యం: తెలుగులో స్త్రీవాద సాహిత్యోద్యమం సామాజికంగా ఉద్యమంగా ప్రారంభమై ఇప్పటికి 200 సం॥లు దాటింది.

1. 1789లో ఫ్రెంచి విప్లవం ద్వారా స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం అనే భావాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆనాటికే ఫ్రాన్స్లో మహిళలు తమ హక్కుల కోసం పోరాటం సాగించారు.

2. 1870 సంవత్సరంలో జరిగిన ఫ్రెంచి విప్లవం స్త్రీ ఎముక్తికి ప్రాధాన్యం ఇచ్చింది.

3. 1889 సంవత్సరం పారిస్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో స్త్రీపురుషుల సమానహక్కుల్ని గూర్చి చర్చించటం జరిగింది.

4. 1911 సంవత్సరం నాటి చైనా విప్లవంలో స్త్రీలు కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారు.

5. అమెరికాలో 1841 సంవత్సరంలోనే ఫ్యాక్టరీల్లో పనిచేసే స్త్రీలు సామూహికంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని గుర్తించారు. 1966 వరకు అక్కడ స్త్రీజాతీయ సంస్థ ఏర్పడలేదు. 1966 తర్వాత మాత్రమే స్త్రీల విముక్తి బృందాలు ఏర్పడ్డాయి. ఇంటి చాకిరీకి జీతం ఉండాలనే నినాదం కూడా 1970 తర్వాత అమెరికాలో ఉద్యమరూపం దాల్చింది.

6. ఇండియాకు చెందిన 'పండిత రమాబాయి' (1858-1922) హిందూ ఛాందస భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. భారతదేశంలోని స్త్రీలహక్కుల కోసం పోరాడింది.

7. ఇండోనేషియాకు చెందిన 'కార్తిని' (1879-1904) స్త్రీవిద్య కోసం కృషి చేసింది. అక్కడి సంప్రదాయాలకు వ్యతిరేకంగా బాలికల పాఠశాలను ప్రారంభించి స్త్రీ విముక్తి ఉద్యమాలకు దారిచూపింది.

8. ఇరాన్లో "ఖర్రాత్ ఉల్ అయూన్" (1815-1851) గృహ నిర్బంధాన్ని ధిక్కరించి 'పరదా'ను కుటుంబాన్ని వదిలేసి చివరకు ముస్లిం ఛాందసవాదుల అగ్రహానికి గురైంది.

9. చైనాదేశానికి చెందిన "ఓయూజిన్" (1875-1907) చదువుకోసం టోక్యోవెళ్లి అక్కడ స్త్రీవిముక్తి పోరాటాల్లోను, విప్లవ రాజకీయాల్లోను పాల్గొని అరెస్టయి చివరకు ఉరితీయబడింది.

10. ఈజిప్టుకు చెందిన "అహమ్మద్ ఫారెస్ ఎల్ సిధ్యక్" స్త్రీ విముక్తిని బలపరుస్తూ 'One leg crossed over the other' అనే గ్రంథం వ్రాశారు.

11. 1942లో "సైమస్-డి-బోరా" వ్రాసిన "The second sex' అనే గ్రంథం స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన మౌలికమైన అనేక అంశాల్ని బయటపెట్టింది. వివాహ, కుటుంబ వ్యవస్థలు స్త్రీల అణచివేతకు ఎలా కారణమయ్యాయో ఆ గ్రంథంలో విపులీకరించారు. దీన్ని ఆధారం చేసుకొనే స్త్రీవాదం బాగా అభివృద్ధి చెందింది.

12. ఓటుహక్కు విద్యాహక్కు, ఎన్నికల్లో పోటీచేసే హక్కు గర్భస్రావం హక్కు మొదలైన వీటన్నింటినీ ప్రపంచ స్త్రీలు పోరాటాల ద్వారానే సాధించారు.

ఈ సామాజిక ఉద్యమంతోపాటు కొందరు స్త్రీల రచనలు కూడా స్త్రీవాద ఉద్యమానికి ప్రేరణనిచ్చాయి. 1792లో ఇంగ్లండు రచయిత్రియైన "మేరీహాల్ స్టోన్ క్రాఫ్ట్" స్త్రీల హక్కుల గురించి కుటుంబ వ్యవస్థ పరిమితుల గురించి "విండికేషస్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెస్" అనే పుస్తకం వ్రాశారు. 1994లో ఫ్రెంచి రచయిత్రి "ది సెకండ్ సెర్చ్" అనే పుస్తకాన్ని 1960లో అమెరికస్

రచయిత్రి "బెట్టి ఫ్రీడన్" రచించిన "ది ఫెమినైన్ మిస్టిక్" తెలుగులో స్త్రీవాద కవిత్వోద్యమాన్ని ప్రభావితం చేశాయి.

స్త్రీవాదం చర్చకు పెట్టిన ప్రధానాంశాలు:

1. పితృస్వామ్య వ్యవస్థ స్త్రీపతనానికి, అణచివేతకు కారణమైన పురుషాధిక్య భావజాలాన్ని చారిత్రక నేపథ్యంలో గుర్తించటం.

2. లైంగికత్వంలో ఇమిడి ఉన్న రాజకీయాలను, కంట్రోలును గుర్తించటం, అంతకు పూర్వం ఏ రాజకీయార్థిక సిద్ధాంతమూ పట్టించుకోని పునరుత్పత్తి, లైంగికత్వం అనే భావనలు స్త్రీ జీవితాన్ని ఎలా నియంత్రిస్తున్నాయో చర్చించటం.

3. 'సెక్స్'కు 'జండర్'కూ ఉన్న తేడాను. స్పష్టం చేయటం 'సెక్స్' స్త్రీ పురుషుల మధ్యనున్న శారీరక భేదాలను చెబుతుంది. జండర్ అన్నది సాంస్కృతికంగా, సాంఘికంగా, స్త్రీ లక్షణాలు, స్వభావాలు, పురుష లక్షణాలు, స్వభావాలు వేరని చూపి పురుషుల్ని పురుషులుగా, స్త్రీలను స్త్రీలుగా తయారు చేస్తుంది.

4. స్త్రీలపై సాంఘికంగా, సాంస్కృతికంగా జరుగుతున్న సెన్సార్షిప్పు గుర్తించి తిరస్కరిస్తుంది. సమాజం జీవితంలో ప్రవర్తించే పద్ధతుల నుంచి సాహిత్యంలో అభివ్యక్తి వరకు అన్నింటా సెన్సార్షిప్పు స్త్రీవాదులు గుర్తించటంవల్లే, దాన్ని ఛేదించి, కొత్త సాహిత్యాన్ని సృష్టించగలిగారు.

5. స్త్రీల శరీరాలకూ, మనస్సుకూ, వివాహ వ్యవస్థకు సంబంధించి తరతరాలుగా విశ్వాసాలుగా నిలిచిపోయిన ఎన్నో విషయాలను స్త్రీవాదం భగ్నం చేసింది.

6. సంతానోత్పత్తి, పిల్లల పెంపకం, ఇంటి చాకిరి మొదలైనవి కూడా ఉత్పత్తిలో భాగంగా చేర్చాలని పునరుత్పత్తిలో ప్రజాస్వామిక ధోరణి ఏర్పడాలనీ స్త్రీవాదం చెబుతుంది.

7. మానవుల మధ్య వర్గసంబంధాలతో పాటు జండర్ సంబంధాలు కూడా ఉన్నాయని ఇది వర్గసంబంధమంత ప్రాథమికమైనవని స్త్రీవాదం చెప్పింది.

8. స్త్రీవాదులంటే స్త్రీలు మాత్రమే కారని, స్త్రీ పురుషులిద్దరూ ఫెమినిస్టులు కావాలనీ, ఫెమినిజం అంతిమలక్ష్యం సమాజంలోని అన్ని దృక్కోణాల్లోనూ పునరాలోచన, పునర్నిర్మాణం జరగటమేనని స్త్రీవాదం చెబుతుంది.

9. జండర్ వివక్షకు, అసమానతలకు మూల కారణం పితృస్వామ్య వ్యవస్థ అని గుర్తించి, పితృస్వామ్యం నిర్మించిన కుటుంబం, మతం వంటి వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపటం తన కర్తవ్యంగా ఈ ఉద్యమం భావించింది.

10. స్త్రీని ఆమె పోషించే రకరకాల పాత్రల ద్వారా కాక, ఒక వ్యక్తిగా గుర్తించవలసిన సమయం ఆసన్నమైందని ఈ ఉద్యమం భావించింది.

ఈ విధంగా స్త్రీవాద ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల పోరాటంగా ప్రారంభమై క్రమక్రమంగా వృద్ధి చెంది సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందింది.

..........................

ప్ర. 2. స్త్రీవాద కవిత్వంలో వస్తువైవిధ్యాన్ని వివరించండి.

జ॥ స్త్రీవాద కవిత్వంలోని ప్రధాన వస్తువును ఈ విధంగా విభజించవచ్చు.

1. వ్యక్తిగా, రచయిత్రిగా తమ ఉనికి,

2. మాతృత్వం,

3. లైంగిక వివక్ష

4. శారీరక స్పృహ,

5. వివాహ వ్యవస్థ,

6. కుటుంబంలో హింస,

7. సామాజిక జీవితం,

8. ప్రపంచీకరణ.

స్త్రీవాదకవిత్వంలో వస్తువిభజన స్థూలమైనది మాత్రమే. ఇందులో మళ్లీ అంతర్భాగాలు కూడా ఉండవచ్చు కానీ మొత్తంమీద స్త్రీజీవితంలో పితృస్వామ్య వ్యవస్థ స్పృశించని భాగం కానీ, అంశం కానీ లేదని, ఈ పితృస్వామ్య భావజాలం మూలాలు గుర్తించి, వాటి నుంచి తమ అస్తిత్వాన్ని పరిరక్షించుకోవడం, కొత్త విలువలను అన్వేషించడం, ఆ అన్వేషణను వ్యక్తిగతం కాక సామూహిక చేతనగా మార్చటం స్త్రీవాద కవిత్వ ఉద్దేశం. స్త్రీవాదకవులు రజస్వల కావడం గురించి మాట్లాడినా, అబార్షన్ను వర్ణించినా లేబరూంను చిత్రించినా వారి గొంతుకలు స్త్రీజాతి మొత్తానికి ప్రాతినిధ్యం వహించినట్లు భావించారు.

1972లో ఓల్గా వ్రాసిన "ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి" అనే కవితతో స్త్రీవాదం ప్రారంభమైంది. అది 1977 తర్వాత ఉద్యమరూపం దాల్చింది.

1. ఉనికి లేదా అస్తిత్వం:- స్త్రీల అస్తిత్వమంటే 'వాళ్ల శరీరాలు" అనే భావనను స్త్రీవాదకవిత్వం ఖండించింది. ఈ సమాజంలో పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీగా పుట్టటమే పెద్ద పాపంలా, శాపంలా భావించింది అందుచేత 'తమ ఉనికే నిబద్ధం' అని 'శ్రీమతిగారు చెబుతుంది.

"నేనమ్మలో ఉన్నప్పుడు

నేను కావాలని అమ్మ కోరుకుంటున్నట్లు

నాన్నకు తెలియగానే

ఈడ్చి చెంప పగలకొట్టిన నాన్నదెబ్బకి

నేనెవరో నాకు తెలిసింది

నేనొక స్త్రీని

నేనొక నిషిద్ధజీవిని

మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం

నిన్న నా చదువు నిషిద్ధం

నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"

స్త్రీ స్త్రీగా మాట్లాడటం కూడా సహింపలేకపోవటం ఆమె అస్తిత్వాన్ని నిరాకరించటమే అవుతుంది. తాము ఏది మాట్లాడాలో, ఏది మాట్లాడకూడదో నియంత్రించే పురుషస్వామ్య 'సంస్కృతిని 'రేవతీదేవి' ఈ విధంగా వ్యాఖ్యానించింది.

"ఇన్నాళ్లూ గలగలా మాట్లాడితే

నే చెప్పాల్సిందేమీ లేనందున

నేనేం చెప్పినా విన్నారు,

ఇప్పుడేమో నాకూ చెప్పాల్సిందేదో వుండి మాట్లాడబోతే

ఎవరూ వినిపించుకోరు

అందుకో మరెందుకో

ఈ గొంతు మూగవోయింది".

2. మాతృత్వం :- మాతృత్వ భావన గురించి, పితృస్వామ్య వ్యవస్థ కల్పించిన అలౌకిక భావనను ఆదర్శీకరణను స్త్రీవాద కవిత్వం ఖండించింది. మాతృత్వంలోని ఆనందాన్ని అంగీకరిస్తూనే దాని వెనుక ఇమిడి ఉన్న శరీర హింసనూ, స్త్రీల నిర్ణయాలతో, అభిప్రాయాలతో ప్రమేయంలేని మాతృత్వస్థితిని స్త్రీవాద కవయిత్రులు అద్భుతంగా చిత్రించారు. కొండేపూడి నిర్మల 'లేబట్రూం' కవితలో స్త్రీని సంతానాన్ని కనేయంత్రంగా చూడటాన్ని నిరసించారు.

"లేబర్ రూంలో అడుగు పెడితే చాలు

మీరంతా చెబుతున్న తెల్లచీర మల్లెపూలు పాలగ్లాసు వూసుల్లో

పరాధీనతా బానిస కన్నీరు ద్వీపాంతరవాసం కాళ్లనలా ఎడంచేసి దీనంగా, హీనంగా, నీచాతినీచంగా,

ఒక హింసా తల పరాకాష్ట కోసం ఎదురు చూద్దమంటే

రైలుపట్టామీద నాణెం విస్తరించిన బాధ"

ఈ కవితలో ప్రసవ సమయంలో స్త్రీపడే వేదన ఎంత తీవ్రంగా, భరించరానిదిగా ఉంటుందో నిర్మలగారు తెలిపారు.

3. లైంగిక వివక్ష :- స్త్రీ పురుషుల మధ్య బాల్యం నుంచీ చూపే వివక్ష, ఆడపిల్ల పుట్టకముందే చంపటం వరకు విస్తరించింది. ఆడపిల్ల పుట్టిన తరువాత వృద్ధాప్యం వచ్చేవరకు ఎలాంటి నియంత్రణలో, నిర్లక్ష్యంలో, చులకనలో బ్రతుకుతుందో 'రజియాబేగం' చక్కగా వివరించారు.

"బాల్యంలో

'చిన్నపిల్లవి నీకేం తెల్సు కూర్చో' అన్నారు

యవ్వనంలో

'ఉడుకురక్తం నుంచీ చెడు తెలీదు కూర్చో అన్నారు

వృద్ధాప్యంలో

'ముసల్దానివి, ఇంకేం చేస్తావ్ కూర్చో' అన్నారు అవకాశం రానందుకు కోపంగా లేదునాకు

కూర్చొని, కూర్చొని బద్దకం వచ్చినందుకు బాధగా ఉంది"

ఆడపిల్లకూ మగపిల్లవాడికీ ఉన్న తేడాను శ్రీమతి చక్కగా చెబుతుంది.

"చీర ఒక అంచును గుండెలపై పదిలంగా అమర్చుకున్నట్లు

అమ్మ తమ్ముణ్ణి హృదయానికి హత్తుకుంటుంది

కాళ్లకు అడ్డుపడే అంచులా

నన్ను మాటల్తో తన్నుతుంది”

ఇటువంటి వివక్ష వల్ల స్త్రీ పెద్దదైనా, ఆమెను నిశ్శబ్దం, మౌనం ఆవరిస్తాయి.

4. శారీరక స్పృహ :-పురుషులు తరతరాలుగా తమ సాహిత్యంలో చేసే స్త్రీశరీర వర్ణనకీ, స్త్రీలు చేసే వర్ణనకీ చాలా తేడా కన్పిస్తుంది. స్త్రీవాదులు స్త్రీసౌందర్యం వెనుకనున్న హింసనూ, శరీరం వల్ల స్త్రీపొందే బాధలను చక్కగా తమ కవితల్లో చిత్రించారు. స్త్రీల శరీరం ఒక భోగ్యవస్తువుగా తీర్చిదిద్దటం వెనుకనున్న పితృస్వామ్యంలోని వ్యాపార భావజాలాన్ని విమల 'సౌందర్యాత్మ హింస'లో చక్కగా వర్ణించింది.

“మనమంటే 34, 24, 35 కొలతలమైన చోట మొటిమలు మొలవడం, జుట్టు రాలడం

నడుం సన్నగా లేకపోవడమే

మన నిరంతరాందోళనలైన చోట...

అందం పోటీయైన చోట

అందం సరుకైన చోట

అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం"

దేహసంబంధ సౌందర్యాన్ని ద్వేషించటంతో పాటు శ్రమ సౌందర్యాన్ని, మానవ విలువల్ని ప్రేమిద్దామని కూడా విమల ఈ కవితలో పిలుపునిచ్చింది. జయప్రభ 'స్పర్శాను రాగాన్ని ఆలపిస్తూ"లో

"ఒక్కోసారి నీ స్పర్శలో

నాకు మాత్రమే తెలిసే

సంకేతాలుంటాయి

ఏ యుగాలనాటివో తెలియని

లిపి సముదాయాలుంటాయి"

అని శృంగారానుభూతిని తాత్త్వికతతో రంగరించి అద్భుతంగా వ్రాసింది.

వివాహ వ్యవస్థ :- పితృస్వామ్య వ్యవస్థలోని అణచివేత వివాహవ్యవస్థలోనే విశ్వరూపం దాల్చుతుంది. పెళ్లి అనేది రెండక్షరాల మాట. ఆడపిల్లకు శిక్ష అనే భావాన్ని ఎలా కలిగిస్తున్నాయో 'బందిపోట్లు' కవితలో సావిత్రిగారు అత్యద్భుతంగా చిత్రించారు.

"పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్లి చేస్తానని పంతులుగారన్నప్పుడే భయం వేసింది ఆఫీసులో నామొగుడున్నాడు అవసరమొచ్చినా సెలవివ్వడని

అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది 'వాడికేం మగమహారాజని'

ఆడమగా వాగినప్పుడే అర్థమైపోయింది. 'పెళ్లంటే పెద్దశిక్ష' అని

మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని

మనం పాలిచ్చి పెంచిన జనంలో సగమే

మమ్మల్ని విభజించి పాలిస్తోందని"

వివాహం, దాంపత్యం అనే పదాలకున్న ఊహాజనితమైన, ఆదర్శప్రాయమైన అర్థాలు వాస్తవజీవితంలో ఎక్కడా సరిపోలవని స్త్రీవాద కవిత్వం చెబుతుంది.

పెళ్లి తర్వాత స్త్రీ ఎన్ని రకాల అవతారాలు ఎత్తవలసి వస్తుందో హైమావతిగారు చక్కగా చిత్రీకరించారు.

"కుక్కర్ విజిల్స్లోనే

మనోజ్ఞ సంగీతం వింటాను

పతిదేవుని పేబిలే పై

కాఫీ కప్పుగా, మీల్స్ కేరియర్ గా

పిల్లల లంచ్ బాక్సులు గా

బహు పాత్రాభినయం పోటీలో

నా చేతులకెప్పుడూ ఫస్ట్ ప్రైజే”

6. సామాజిక జీవనం :- ఇంటినుండి బయటకు వచ్చిన స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్య సమాజం వారిని కించపరచి, అవమానించి, అణచివేసే విధానాలు కవితా వస్తువులయ్యాయి.

సమాజంలోని అన్ని వర్గాల పురుషులకూ స్త్రీ ఎలా పెట్టుబడి అవుతుందో మందరపు హైమవతి 'నీలి కవితలే రాస్తాము' లో చెబుతుంది.

"కవికీ చిత్రకారుడికీ

నా శరీరమే గదా

వర్ణనీయ వస్తువు

చలన చిత్రాలకు

వ్యాపార ప్రకటనలకు

పెట్టుబడి నాశరీరమే కదా”

సామాజిక జీవితాన్ని వస్తువుగా స్వీకరించిన కవయిత్రుల్లో ఇంకా జయప్రభ, కొండేపూడి నిర్మల, వసంతా కన్నాభిరాప్, తుర్లపాటి రాజేశ్వరి, రావుల సునీత, ఓల్గా, కల్పనారెంటాల, కె.గీత, అనిసెట్టి రజిత, పసుపులేటి గీత మొదలైన వాళ్లున్నారు.

7. కుటుంబ హింస :- కుటుంబంలో స్త్రీ నిర్వహించవలసిన అనేక పాత్రలు, ఆమెపై వాటి ప్రభావాలు స్త్రీవాద కవితకు ప్రధానమైన వస్తువులయ్యాయి. కుటుంబ వ్యవస్థలో కన్పించని అణచివేత, దౌర్జన్యం, స్త్రీ అస్తిత్వాన్ని నిర్మూలించేపైనా అనేక కవితల్లో చిత్రించబడ్డాయి.

8. ప్రపంచీకరణ :- ప్రపంచీకరణలో భాగమైన అందాలపోటీలు, శారీరక సౌందర్యం కాపాడుకోవటం కోసం ఈనాటి యువతులు పడేయాతనపై అనేక కవితలు వచ్చాయి. కొండేపూడి నిర్మల వ్రాసిన 'మల్టీ నేషనల్ ముద్దు' అనే కవిత దీనికి మంచి ఉదాహరణ. మేధోవలసలు, డాట్ కామ్, ఇంటర్నెట్ సంస్కృతులపై రెంటాల కల్పన, కుప్పిలి పద్మగార్లు మంచి కవితలు వ్రాశారు.

.............................

ప్ర. 5. స్త్రీవాద కవయిత్రులు.

జ ॥ పూర్వం కవిత్వంలో రాముడో, కృష్ణుడో, శివుడో లేదా మరొక పురాణ పురుషుడో కవితా వస్తువులుగా ఉండేవారు. కాని ఆధునికయుగంలో శ్రీశ్రీ చెప్పినట్లుగా అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, కుక్కపిల్ల వంటివి కవితా వస్తువులయ్యాయి. స్త్రీవాదకవిత్వంలో ఓణీలు, పైటా, పురిటిళ్లూ, వంటిళ్లూ, పొయ్యిలూ, గరిటెలు కవితా వస్తువులయ్యాయి.

రేవతీదేవి, జయప్రభ, కొండేపూడి నిర్మల, ఈశ్వరి, విమలగార్లు స్త్రీవాద కవిత్వాన్ని బలంగా విన్పించారు.

రేవతీదేవి: వీరు 1980లో 'శిలాలోలిత' అనే కవితా సంకలనం ప్రచురించారు. తమ భావాల్ని ఆలోచనల్ని, నిర్మొగమాటంగా, నిర్భయంగా ప్రకటించారు. తాము చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పనీయకుండా ఈ సమాజం అడ్డుపడుతున్నదని బాధపడ్డారు. ఈ సమాజం స్త్రీని కవిగా ఎదగటానికి ఇష్టపడటం లేదని వాపోయారు. వీరు వ్రాసిన కవితలు చిన్నవే అయినప్పటికి అందులో మంచి భావాన్ని వ్యక్తీకరించారు. మన సమాజంలో, పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీకి మాత్రమే 'శీలం' పరిమితం చేయబడింది. పురుషులకు శీలంతో పనిలేదు. స్త్రీలకు ఒక న్యాయం, పురుషునకొక న్యాయం అనే ద్వంద్వనీతిని వీరు తీవ్రంగా నిరసించారు. సమాజంలోని ప్రతి విషయాన్ని స్త్రీ పురుషులకు సమానంగా వర్తింపజేయాలని నొక్కి వక్కాణించారు.

జయప్రభ :- వీరు 1980లో "సూర్యుడు కూడా ఉదయిస్తాడు" 1986లో 'యుద్ధోన్ముఖంగా' "ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది" 1988లో 'వామనుడి మూడోపాదం' అనే కవితా

సంకలనాల్ని ప్రచురించారు. స్త్రీలపై జరుగుతున్న అణచివేతను వ్యతిరేకించారు. 'నాదేశంలో స్త్రీ', 'ప్రతిచర్యగా', 'మానవి', 'విస్తరిస్తున్న ఎడారులం', 'పైటను తగలెయ్యాలి' వంటి కవితాఖండికలు వీరికి మంచిపేరును తెచ్చిపెట్టాయి. వీరి కవిత్వంలో సోషలిస్ట్, ఫెమినిస్టు ధోరణి కన్పిస్తుంది. శ్రీజయప్రభ గారు "భావ కవిత్వంలో స్త్రీ" అనే విషయంపై పరిశోధన చేసి 'ఎమ్. ఫిల్' పొందారు.

కొండేపూడి నిర్మల :- వీరు 1986లో 'సందిగ్ధ సంధ్య', 1990లో 'నడిచే గాయాలు' 'బాధాసప్తనది', 'మల్టీ నేషనల్ ముద్దు' అనే కవితా సంపుటాలను ప్రచురించారు. స్త్రీలు అనుభవిస్తున్న అన్ని విషయాల్ని ఉన్నవి ఉన్నట్లుగా ధైర్యంగా వివరించారు. 'నడిచే గాయాలు అనే కవితలో వేశ్యల శారీరక, మానసిక హింసను కన్నులముందు సాక్షాత్కరింపజేశారు. 'లేబరూం'లో ప్రసవ సమయంలో స్త్రీపడే శారీరక బాధను సహజంగా చిత్రించారు. 'మదర్ సీరియస్'లో ఒక వృద్ధస్త్రీ ఆవేదనను చక్కగా వ్యక్తం చేశారు. వీరు వ్రాసిన 'ఆవిడెప్పుడూ సిద్ధంగా ఉంటుంది', 'మరణ వాంఙ్మలం', 'యుద్ధశిశువు', 'కప్పలతక్కెడ', గోడలు, 'వధుగీతం' మొదలైన కవితా ఖండికలు స్త్రీవాదానికి ప్రతిబింబంలా నిలిచాయి.

ఈశ్వరి :-ఈశ్వరిగారి మిత్రులు కొందరు 'ఈశ్వరి కోసం సాహిత్యమైత్రి' అనే పేరుతో ఒక పుస్తకాన్ని అచ్చువేశారు. ఈశ్వరిగారు 'సేల్స్ గర్ల్' గా పనిచేశారు. ఆ అనుభవంతో 'నిన్ను నీవు ప్రశ్నించుకోకు' అనే కవిత వ్రాశారు. సేల్స్ గర్ల్ జీవితంలో ఎదురైన అనుభవాల్ని కళ్లకు కట్టించారు. కదనం, మంచిరోజులు, నివేదన అనే కవితల్లో స్త్రీ ఆవేదనను, బాధను విపులీకరించారు.

విమల :- 1980-88 మధ్యకాలంలో విమల రాసిన కవితల్ని 'అడవి ఉప్పొంగిన 'రాత్రి' అనే పేరుతో విరసంవారు ముద్రించారు. సౌందర్యాత్మక హింస, వంటిల్లుకవిత వంటి మంచి కవితలు వ్రాశారు. స్త్రీ సమస్యలకి విప్లవోద్యమానికి ఉన్న సంబంధాన్ని అవగాహన చేసికొని శాస్త్రీయమైన పరిష్కారమార్గాన్ని చూపించారు. వీరు వ్రాసిన కొన్ని కవితలు 'నీలిమేఘాలు' కవితా సంకలనంలో చేర్చబడ్డాయి.

ఈశ్వరి, విమల కవిత్వంలో మార్క్సిస్టు ఫెమినిస్టు ధోరణి కన్పిస్తుంది. మందరపు హైమావతిగారు 'సూర్యుడు', 'తప్పిపోయాడు' మొదలైన కవితా సంపుటాల్ని ముద్రించారు. పాటిబండ్ల రజని

'ఎర్రజాబిల్ల ఎరీనా', కవితా సంపుటిని రెంటాలకల్పన 'కనిపించే పదం' అనే కవితా సంపుటిని ముద్రించారు.

సావిత్రి :- సావిత్రిగారు 'బందిపోట్లు' కవితలో పురుషాధిపత్యాన్ని కుప్పపోసినట్లు చూపించింది. భారతదేశంలోని వివాహ వ్యవస్థని చీల్చి చెండాడింది.

"పాఠం ఒప్పచెప్పకపోతే 'పెళ్లి చేస్తానని' పంతులుగారు అన్నప్పుడూ, 'ఆఫీసులో నామొగుడున్నాడు' అని అన్నయ్య అన్నప్పుడూ, వాడికేం 'మగమహారాజు' అని ఆడామగా వాగినప్పుడూ, "పెళ్లంటే పెద్దశిక్షని, మొగుడంటే 'స్వేచ్ఛాభక్షకుడ'ని కవయిత్రికి అర్థమై పోయింది. పెళ్లి అనేది స్త్రీకి తప్పనిసరి అవుతుంది. పురుషుడికి పెళ్లి జరుగకపోతే 'పెళ్లి చేసుకోలేదు' అంటారు. స్త్రీకి పెళ్లిజరుగకపోతే 'పెళ్లి కాలేదు' అంటారు. స్త్రీ పెళ్లి ఎన్ని కష్టాలతో కూడుకున్నదో అందరికీ తెలుసు. డబ్బు ఖర్చుపెట్టి చేసుకున్న పెళ్లివల్ల స్త్రీకి ఒరిగిందేమిటి. తనను హింసించే పురుషునికి లైసెన్సు ఇవ్వటమే. పెళ్లివల్ల స్త్రీకి ఇంటిచాకిరీ, పిల్లల పెంపకం అనే రెండు సంకెళ్లు పడతాయి, నిర్బంధాలూ, ఆంక్షలూ ఎలాగూ ఉంటాయి. ఇంతకంటే పెద్దశిక్ష ఏం ఉంటుంది. స్త్రీకి పంతులుగారు 'పెళ్లి' చేస్తాను అనటంలో ఇంత అర్థం దాగి ఉంది" అని వివరించింది.

అబ్బూరి ఛాయాదేవిగారు 'విన్నావా' అనే కవితలో స్త్రీపట్ల ఈ సమాజం ఎలా ప్రవర్తిస్తుందో చెప్పారు. ఘంటశాల నిర్మలగారు విజయవాడ సెంటర్లో వేశ్యల మెళ్లో బోర్డుకట్టి ఊరేగించిన సంఘటనకు స్పందించి 'ఏ కాల్గర్ల్స్ మోనోలాగ్' అనే కవిత రాశారు. హైదరాబాదులోని మెహిందీ బజారులో వేశ్యల మీద పోలీసులు జరిపిన బీభత్సాన్ని 'ఓల్గా' మరో కవితలో విన్పించారు. ఇంకా పుట్లహేమలత, రావులపల్లి సునీత, కె.గీత, చంద్రమల్లిక, కవితాభారతి, ఆర్. శశికళ, కె. వరలక్ష్మి, కోట్ల వనజాత మొదలైనవారు స్త్రీ సమస్యలపై మంచి కవితలు వ్రాశారు.

## 19. దళిత వాదం - పరిచయం, నేపథ్యం, ప్రధానాంశాలు

ప్ర. 1. దళిత వాదాన్ని గూర్చి వ్రాయండి.

జ ॥ ప్రాచీన సాహిత్యంలో వర్ణవ్యవస్థని నిరసించిన కవులు ఎందరో ఉన్నారు. వారిలో శ్రీకృష్ణదేవరాయలు అగ్రగణ్యులు. వీరు 'అముక్తమాల్యద' అనే ప్రబంధం రచించారు. అందులో మాలదాసరి వృత్తాంతం ఉంది. అది వర్ణవ్యవస్థ నిరసనకు చక్కని ఉదాహరణ. తెలుగులో వేమన, పోతులూరి వీరబ్రహ్మం, అన్నమయ్య వంటివారు ఈ అస్పృశ్యతా దురాచారాన్ని తీవ్రంగా ఖండించారు.

ఆధునికయుగంలో సంఘసంస్కరణోద్యమానికి ముందే తెలుగులో అస్పృశ్యతా నిరసన కవిత్వం కన్పిస్తుంది. 1909లో 'ఆంధ్రభారతి' అనే పత్రికలో ప్రచురించిన 'మాలవాండ్రపాట' అనే గేయంలో

అస్పృశ్యతా నిరసన గోచరిస్తుంది. ఈ గేయరచయిత ఎవరో తెలియరాలేదు. 1910లో గురజాడ అప్పారావుగారు వ్రాసిన 'లవణరాజుకల' గేయంలో అస్పృశ్యతా నిరసన స్పష్టంగా కన్పిస్తుంది.

"మలిన దేహుల మాలలనుచు

మలిన చిత్తుల కధికకులముల

నెలవొసంగిన వర్ణధర్మ

మధర్మ ధర్మంబె"

అని దేహాలు మలినం అయినంత మాత్రాన వారిని నీచకులస్తులనీ, మనసులో మాలిన్యం ఉన్నవారిని అధిక కులస్తులనీ, అన్నధర్మం 'అధర్మధర్మం' అని గురజాడ నిరసించాడు. అంతేకాక

"మంచిచెడ్డలు మనుజులందున

యెంచి చూడగ రెండె కులములు

మంచియన్నది మాలయైతే

మాలనేనగుదుస్"

అని పంచ మేకం ప్రకటిస్తాడు. ఆ తర్వాత ఎందరో కవులు గురజాడను అనుసరించారు. మంగిపూడి వెంకటశర్మగారు 1915లో 'అస్పృశ్యతా నిరసన కావు వస్తువుగా " "గతం' అనే పద్యకావ్యం వ్రాశారు. జాతికి వెన్నెముక అనదగిన ఈ అట్టడుగు కులాలవారిని అస్పృశ్యత పేరుతో దూరం చేసుకోవటం ఆత్మహత్య చేసుకోవటం లాంటిదనీ, అది ధర్మం కాదనీ ఆవేదన చెందాడు. పంచముల పట్ల అస్పృశ్యత పాటించటం తప్పని నిరూపించటానికి ఈ కావ్యంలో ఉపనిషత్తులు, పురాణాలు, భగవద్గీతల నుంచి ఎన్నో ఉదాహరణలను ఎత్తి చూపారు. గాంధీజీ 'పంచములు' అనే పదం స్థానంలో హరిజన అనే పదాన్ని సృష్టించి వ్యాప్తిలోకి తెచ్చాడు. స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతోనూ, గాంధీ ఇచ్చిన పిలుపుతోనూ ఎంతోమంది కవులు అస్పృశ్యతా

నిరసన కావ్యాలు వ్రాశారు. జాతీయకవిగా ప్రసిద్ధి చెందిన గరిమెళ్ల సత్యనారాయణ 'మాకొద్దీ తెల్లదొరతనం' గేయంలో 'అంటుదోషము మాకులేదండీ పాపమంటూ చాటుదాము రండి' అంటూ రాసిన గేయం చాలా ప్రసిద్ధి పొందింది.

గుర్రం జాషువా, కుసుమ ధర్మన్న జాలా రంగస్వామి, నక్కా చినవెంకయ్య, బోయి: భీమన్న, కొలకలూరి ఇనాక్ వంటివారు తమ పదునైన రచనలతో అస్పృశ్యతా సమస్యను ఎండగట్టారు. మరీ ముఖ్యంగా జాషువా 'గబ్బిలం' కావ్యంలోనూ, అనాథ, శ్మశానవాటిక వంటి ఖండకావ్యాల్లోనూ అస్పృశ్యత తాలూకు స్వభావాన్ని, దాని విరాట్ స్వరూపాన్ని ఆవిష్కరించారు. ఒక రైలు ప్రయాణంలో కులపరంగా తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఎంతో ఆర్తితో, ఆవేదనతో వ్యక్తం చేశాడు.

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు

నల్వురు కుమారులంచు విన్నాముగాని పసరమునకన్న హీనుడభాగ్యుడైన

ఆ అయిదవ కులస్తుడెవరమ్మా సవిత్రి'

అని పంచమ వర్ణం పుట్టుక గురించి ప్రశ్నిస్తాడు జాషువా. కుసుమ ధర్మన్న కవి 'మాకొద్దీ నల్లదొరతనం' గేయంలోనూ 'హరిజనశతకం'లోనూ దయనీయమైన హరిజనుల కడగండ్లు ఆవిష్కరించాడు. ఈ నిప్పుపై మేమిక నిలువలేమో తండ్రి" అని ఈ కులం అనే నిప్పుపై మేమిక నిలువలేమని తెగేసి చెప్పాడు.

హరిజనులు గాంధీజీ పెట్టిన 'హరిజన' అనే పదాన్ని 'పంచములు' అనే పదాన్ని తిరస్కరించి "ఆది ఆంధ్రులు"గా పిలుచుకోవటం మొదలుపెట్టారు. ఈ విషయం తెలిసిన ధర్మన్న 'ఆలకింపుమయ్య హరిజనుండ' అనే మకుటంతో పాటు 'ఆలకింపుమయ్య ఆది హిందు' "ఆలకింపుమయ్య ఆది యాంధ్ర' 'ఆలకింపుమయ్య మాలవర్య' అనే మకుటాలను కూడా 'సూచన' శీర్షిక క్రింద సూచించాడు. 'హరిజనులు ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో ఆది హిందువులు, ఆది యాంధ్రులు, మాలలు మొదలైన పేర్లతో పిలువబడుతున్న కారణంగా,

ఆయాప్రాంతాల వారికి అవసరమని తోచినచో అందుకు అనుగుణంగా మార్చి చదువుకోవటానికి" అని సూచనలో పేర్కొన్నారు.

నిర్వచనం : దళిత అనే పదానికి సూర్యారాయాంధ్ర నిఘంటువులో ఖండించబడినది. ఛేదించబడినది, చీల్చబడినది అనే అర్థాలున్నాయి. ఇక దళితులు ఎవరు అనే విషయానికొస్తే "తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి విద్యాసౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై, ఆర్థిక అణచివేతకు శ్రమ దోపిడీకి గురైనవాళ్లు దళితులుగా నిర్వచించుకోవచ్చు" అని కె.కె.ఆర్ అన్నారు. సాంఘిక దోపిడీకి గురిఅవుతున్న వాళ్లు, అస్పృశ్యులుగా పరిగణింపబడుతున్నవారు, నీచవృత్తులుగా భావింపబడుతున్న వృత్తులను చేసుకుంటున్నవారు, శారీరక శ్రమపై ఆధారపడి బ్రతుకుతున్నవారు దళితులుగా పిలువబడుతున్నారు" అని యస్వీ సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. పై నిర్వచనాలను బట్టి 'అస్పృశ్యత' ఉన్న కులాలనే దళితులుగా గుర్తించవచ్చు.

తెలుగుదళిత సాహిత్యంపై మహారాష్ట్ర దళిత సాహిత్యోద్యమ ప్రభావం భారతదేశంలో దళిత బహుజనుల అభ్యున్నతి కోసం పోరాడిన వ్యక్తులలో 'మహాత్మాజ్యోతిరావ్ పూలే' అగ్రగణ్యులు. వీరు నిమ్నజాతుల వారిని దోచుకుంటూ వారిని కనీసం మనుషులుగానైనా గుర్తించని బ్రాహ్మణ ఆధిపత్యంపై మహారాష్ట్రలో తిరుగుబాటు చేశారు. అస్పృశ్యుల కోసం ఉద్యమాలు చేపట్టారు వారిని విద్యావంతుల్ని చేయటంకోసం పాఠశాలలు: ఏర్పాటు చేశారు. సత్యశోధక సమాజం స్థాపించి నిమ్నజాతుల విముక్తికి బాటలు వేశారు. దైవం ముసుగులో ప్రజల్ని బానిసలుగా చేస్తున్న పురోహితుల బండారాన్ని వివరిస్తూ ఎన్నో పరిశోధనాత్మక రచనలు చేశారు. నిమ్నజాతుల కోసం ఇంతటి మహత్తర కృషి చేసిన పూలేను అంబేద్కర్ తన గురువుగా చెప్పుకున్నారు. పూలే అందించిన ఉద్యమ వారసత్వాన్ని స్వీకరించి దళితజాతుల విముక్తి కోసం ఒక ప్రక్క పోరాటం చేస్తూనే మరొక ప్రక్క గ్రంథ రచనకు పూనుకున్నారు. తన రచనల ద్వారా భారతదేశ దళితులకు గొప్పదైన ఆలోచనాధారను అందించారు. వీరి శతజయంతి సందర్భంగా వీరి రచనలు, ప్రసంగాలు

తెలుగులోకి అనువాదం అయి అందుబాటులోనికి రావటం, మరోప్రక్క దళితుల ఊచకోతలు, కొద్దిగానైనా అప్పుడప్పుడే అందిస్తున్న మరాఠీ దళితసాహిత్యం, ఇవన్నీ తెలుగులో దళిత సాహిత్యోద్యమ ఆవిర్భావానికి కారణాలయ్యాయి.

వర్గీకరణ :- దళితకవిత్వంలో 1. అస్తిత్వ / ఆత్మగౌరవ పోరాటం, 2 పురాణ ప్రతీకలు, 3, దళిత స్త్రీవాదం, 4. దళిత కళాతత్త్వం, 5. భాషా విప్లవం, 6. దళిత ప్రేమ కవిత్వం, 7. దళిత దీర్ఘకవిత, 8. మాదిగ చైతన్యం, 9. దళిత సంఘీభావ కవిత్వం అనే అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

1. అస్తిత్వ / ఆత్మగౌరవ పోరాటం:- దళిత సాహిత్యం దళితుల అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటాలనుంచి పుట్టింది. కంచికచర్ల కోటేశు, కారంచేడు, నీరుకొండ, చుండూరు, పదిరికుప్పం, వేంపెంట మొదలైనచోట్ల దళితులపై జరిగిన ఊచకోతలు దళితుల అస్తిత్వాన్ని ప్రశ్నించాయి. ఈ నేపథ్యంలో దళితకవులు తమ అస్తిత్వం గురించి ఆత్మగౌరవం గురించి రాయటం మొదలుపెట్టారు. కలేకూరి ప్రసాద్ 'పిడికెడు ఆత్మగౌరవం కోసం' అనే కవితలో అనాదిగా దళితులపై జరుగుతున్న దాడుల్ని ఖండించారు. ఆత్మగౌరవంతో బతకడం కోసం దళితులు నిరంతరం ఎదుర్కొంటున్న హింసను వేదనామయంగా ఆవిష్కరించారు. 'ఒక జననం వాయిదా' అనే కవితలో సతీషచందర్ దళితులు ఇంకా సమాజంలో గౌరవంగా బతికే రోజులు రాలేదని వ్యంగ్యంగా చెప్పారు. "రిజర్వేషన్ గాళ్లకి పౌరుషాలు కూడానా? అని పైఅధికారులు ప్రశ్నించినప్పుడు భూతకాల వర్తమానాల్ని మింగలేక గుటకలు వేస్తాను" అని అంటాడు. ఈవాక్యం దళితులు తమ అస్తిత్వం నిలుపుకోవటం కోసం పడుతున్న అవమానాల్ని తెలియజేస్తుంది. ఈ అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటం దళిత సాహిత్యంలో అంతర్భాగం అయిన మాదిగ చైతన్యపోరాట కవిత్వంలో పతాకస్థాయిని అందుకుంది.

పురాణ ప్రతీకలు :- త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రారంభించిన హేతువాద ఉద్యమం తెలుగు సాహిత్యంలో కొత్తభావాలకు పునాదులు వేసింది. చలం, ముద్దుకృష్ణ ఆమంచర్ల గోపాలరావు, నార్ల వెంకటేశ్వరరావు వంటివారు పురాణాలలోని అంశాలను ప్రశ్నించారు. బ్రాహ్మణీయ భావజాలానికి బలైపోయిన శంబూకుడు, ఏకలవ్యుడు వంటి పాత్రలు దళితకవులకు

ఆదర్శప్రాయమయ్యాయి. ఆధునికకాలంలోనూ ఏకలవ్యునికి జరిగిన ఘటనల వంటి ఘటనలు జరుగుతున్నాయని సతీష్‌చందర్ 'పంచమవేదం' కవిత నిరూపిస్తుంది.

"నేనెన్నిసార్లు లెక్కపెట్టుకున్నా

నాచేతికి నాలుగు వేళ్లే ఉండేవి

నాన్నకు ఐదోవేలు లేకనే

మీరు గుందుసున్నలు చుట్టిన ప్రోగ్రెస్ కార్డు మీద

ఎప్పుడూ వేలిముద్రలు వేయలేదు

పుచ్చపూవులాంటి వెన్నెల రోజు కూడా

ఆ వేలు లేకనే

అమ్మ గోరుముద్దలు తినిపించలేదు

నిజం చెప్పండి

పంచముడంటే ఐదోవేలు లేనివాడనేనా అర్థం ?"

అని సతీష్ చందర్ ప్రశ్నిస్తున్నాడు. రాజమండ్రిలో దళిత విద్యార్థులు దాక్ బాలాజి, డొక్కా పద్మనాభరావులు ఉపాధ్యాయులు కులపరంగా అవమానించిన కారణంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ సంఘటనను ఏకలవ్యుని వృత్తాంతంతో జతచేసి సతీష్ చందర్ ఈ కవితను తీర్చిదిద్దారు. ఆధునిక కాలంలో కూడా విద్యావ్యవస్థలో దళితులు ఎదుర్కొంటున్న వివక్షకు ఈ కవిత మంచి ఉదాహరణ. శివసాగర్ రాసిన 'నడుస్తున్న చరిత్ర' కవితలో దళితులను అణగదొక్కిన పురాణ పాత్రలపై ప్రతీకారం తీర్చుకోవటం కనిపిస్తుంది.

దళితస్త్రీవాదం :- తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఉద్యమంతో సమాంతరంగా దళితవాద ఉద్యమం కూడా వచ్చింది. వర్గపోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారమౌతాయనే విప్లవకారుల

మాటలను స్త్రీలు విశ్వసించలేదు. అందువల్ల వారు తమ సమస్యల్ని పరిష్కరించుకోవటం కోసం ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆ ఉద్యమమే స్త్రీవాద ఉద్యమంగా మార్పు చెందింది. కాని ఈ ఉద్యమం సంపన్న, మధ్యతరగతి ఉద్యోగినుల సమస్యలనే ప్రతిఫలించింది. అట్టడుగువర్గాల స్త్రీల సమస్యల్ని పట్టించుకోలేదనే విమర్శను ఎదుర్కొంది. ఈ క్రమంలో 'దళిత స్త్రీవాదం' అనే కొత్తకోణం వెలుగు చూచింది. చల్లపల్లి స్వరూపవాణి, జి. విజయలక్ష్మి, వినోదినివంటివారు దళితస్త్రీల సమస్యలను తమదైన దృష్టికోణం నుంచి ఆవిష్కరించారు.

"నేను ముళ్లకంపలో చిక్కుకుని

అల్లాడుతున్న పాలపిట్టను

ఎటు కదిలినా ముళ్లన్నీ గుచ్చుకునేది నాకే

ఇవి ఈనాటి ముళ్లు కావు

తరాల నుండి నాచుట్టూ పేర్చిన బానిస సంకెళ్లు ముందు నుయ్యి వెనుక గొయ్యిలా

నాచుట్టూ ఎప్పుడూ

ప్రమాదం బుసలుకొడుతుంది

అసలు నా జీవితాన్ని

నేనుగా జీవించిందెపుడు

ఇంట్లో పురుషాహంకారం

ఒక చెంప ఛెళ్లుమనిపిస్తే

వీధిలో కులాధిపత్యం

రెండో చెంప పగలగొడుతుంది"

అని చల్లపల్లి స్వరూపరాణి "మంకెనపూవు" కవితలో ఆవేదన వ్యక్తం చేసింది. దళిత స్త్రీ శ్రమ దోపిడీకి, అవమానాలకు గురవుతున్న వైనాన్ని జి. విజయలక్ష్మి 'పనిపిల్ల' కవితలో శక్తిమంతంగా ఆవిష్కరించింది.

దళిత కళాతత్త్వం : "దళిత కళాతత్త్వం అగ్రకుల కళాతత్త్వంకంటే భిన్నంగా ఉంటుంది. దళితకవులు విషయాన్ని కవిత్వం చేసే తీరులో ఇది కనబడుతుంది. డొంకతిరుగుడు, మార్మికత, మెతకతనం స్థానంలో సూటిదనం, తాజాదనం, కరుకుదనం ఉండటం వల్ల వ్యక్తీకరణలో జీవం ఉట్టిపడుతుంది" అలా జీవం ఉట్టిపడే రచనలు చేసిన వారిలో శివసాగర్, ఎండ్లూరి సుధాకర్, నల్లగొండ దళితకవులు ఉన్నారు. విప్లవ కవిత్వానికి సౌందర్యతత్త్వాన్ని పరిచయం చేసిన శివసాగర్ దళితకవిత్వంలోనూ దళిత కళాతత్త్వాన్ని కొనసాగించారు.

"ఎద్దు కొమ్ముల్లో మిగ్ పాపను

మునికాళ్లతో ముద్దాడి

పంజరాల చీకటి చరిత్రను

లందేల్లో బందిస్తున్నాను

వరికిళ్లు తిని

మందే మాదిగదప్పులా

ఉదయిస్తున్న సూరీడు పై

చిర్రా చిటికెనపుల్లా తీసుకుని

చినుకుల్లో చించేస్తున్నాను"

అని అంతవరకూ సాహిత్యంలో రికార్డుకాని దళిత వస్తుజాలంతో కవితను సాగించారు.

దళిత జీవితంతో ముడిపడివున్న 'చిర్రాచిటికెన పుల్లా', 'మిగ్సాప', 'లందె', 'పరికిళ్లు' వంటి పదాలను ప్రయోగించటం ద్వారా దళిత జీవితం ఆవిష్కృతమైంది. ఎండ్లూరి రాసిన "నీలిక" కవితలో కూడా దళిత కళాతత్త్వం కనిపిస్తుంది.

భాషా విప్లవం:-దళితులు ప్రామాణిక కావ్యభాషను కాదని తాము పుట్టి పెరిగిన వాతావరణంలోంచి, తమ స్థానీయతలోంచి పలకడం మొదలుపెట్టారు. ఇవి కవిత్వంతో పాటు వచన సాహిత్యంలోను బాగా విస్తరించాయి. నాగప్పగారి సుందరరాజు 'మాదిగోడు" కథలు, ఎండ్లూరి సుధాకర్ 'మల్లెమొగ్గల గొడుగు', వేముల ఎల్లయ్య 'కళు' నవల, ఈ కోవకు చెందుతాయి. ఈ ధోరణిని వ్యతిరేకించిన వారికి దళితకవులు కవిత్వంతోనే సమాధానం చెప్పారు. తరతరాలుగా భాషాపాండిత్యాలు, సాహిత్య సృజన ఒకవర్గం వారి గుప్పెట్లోనే ఉన్నాయి. దళిత సాహిత్య ఆవిర్భావంతో అది విముక్తం అయింది.

దళిత ప్రేమకవిత్వం :- దళితులు అన్ని విషయాల్లోనూ దగాపడ్డట్టే ప్రేమ విషయంలోనూ మోసపోతున్నారు. 1968లో కంచికచర్ల కోటేశు దహనకాంద నుండి 1975లో సెంట్రల్ యూనివర్శిటీలో సునీత ఆత్మహత్య వెనుక దళితుల విఫల ప్రేమలూ, మోసగింపబడిన ప్రేమలూ ఉన్నాయి. కులనిర్మూలనకు అంబేద్కర్ ప్రతిపాదించిన అంశాలను పరిశీలిస్తే కులాంతర వివాహాల ఆవశ్యకత ఏమిటో తెలుస్తుంది. "కుల నిర్మూలనకు సరైన పద్ధతి. వర్ణాంతర వివాహాలేనని నా దృఢ విశ్వాసం. వివిధ కులాల మధ్య స్నేహసంబంధాలను కొనసాగించాలంటే ఆయా కులాల వ్యక్తుల నడుమ రక్త సంబంధాలను కల్పించక తప్పదు. హిందూ సమాజం కులాల వల్లా ఉపకులాల వల్లా ఛిన్నాభిన్నమైంది. కనుక వారందరినీ కలిపి ఒక సుసంఘటితమైన సమాజంగా తీర్చిదిద్దాలంటే అందుకు వర్ణాంతర వివాహాలు తప్పనిసరైన తక్షణ కర్తవ్యం" అని ఆయన అభిప్రాయపడ్డారు. కులాంతర వివాహాల వల్ల ఉత్పన్నమయ్యే సాంస్కృతిక సమస్యలను వాస్తవదృష్టితో వివరిస్తూ మద్దూరి నగేష్బాబు 'విడి ఆకాశం' అనే కవితను వ్రాశాడు. 'మార్తకవిత'లో దళితకులంలోని ఉపకులాల మధ్య కూడా ప్రేమ విషయంలో తలెత్తిన విభేదాలను కవిత్వీకరించాడు.

దళిత దీర్ఘకవిత :- దళిత కవిత్వంలో ఎన్నో దీర్ఘకవితలు వచ్చాయి. వీటికి జాషువా 'గబ్బిలం' అనాథ వంటి కావ్యఖండికలు ప్రేరణయని చెప్పుకోవచ్చు. మద్దూరి నగేష్ బాబు 'రచ్చబండ', 'ఊరూ వాడా', సతీష్చందర్ 'నాన్నసైకిల్', పైడి 'తెరేష్బాబు' 'హిందూమహా సముద్రం', జూలూరి గౌరీశంకర్ 'పాదముద్ర', ఎండ్లూరి సుధాకర్ 'కొత్త గబ్బిలం',' చెరుకు సుధాకర్ 'అనగనగా మెరిట్', జి.వి.రత్నాకర్ 'అల' వంటి దీర్ఘకవితలు దళిత కవిత్వాన్ని సుసంపన్నం చేశాయి.

మాదిగ చైతన్యం :- దళితుల్లోని ఒక కులమైన మాల కులస్థులే రిజర్వేషన్లోని అధికశాతం వాటాను అనుభవిస్తున్నారనీ, దళితుల రిజర్వేషన్ను ABCD లుగా వర్గీకరించి, మాదిగలకు కూడా సమానహక్కులు కల్పించాలనీ "మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి" పేరుతో మాదిగలు ఉద్యమం నడిపారు. దానితో దళిత సాహిత్యంలోని మాదిగ కవులకు తమ జీవితాలను మరింతశక్తిమంతంగా ఆవిష్కరించుకునే అవకాశం దొరికింది. ఈ నేపథ్యంలో నాగప్ప గారి సుందర్రాజు 'చండాల చాటింపు' 'గుండె డప్పుకనకయ్య' మాదిక్కేక - 'మాదిగ చైతన్యం వంటి కవితా సంపుటాలు వెలువడ్డాయి. ఎండ్లూరి సుధాకర్ 'మల్లెమొగ్గల గొడుగు' మాదిగల జీవన కథను చిత్రించింది. వీరి 'కొత్తగబ్బిలం' మాదిగ రిజర్వేషన్ ఉద్యమానికి బాసటగా నిలిచింది.

దళిత సంఘీభావ కవిత్వం:- దళితేతరులు రాసిన దళిత కవిత్వాన్ని దళిత సంఘీభావ కవిత్వంగా వ్యవహరిస్తున్నారు. 1999లో మద్దూరి నగేష్ బాబు, ఖాజాల సంపాదకత్వంలో 'కాస్త సిగ్గుపడదాం' పేరుతో దళితసంఘీభావ కవిత్వం వచ్చింది. ఇందులో హెచ్ఐర్కే, సుజాత పట్వారి, రామిరెడ్డి మొదలైన కవులు దళితుల పక్షాన నిలబడి మాట్లాడారు. 'కాస్త సిగ్గుపడదాం' స్ఫూర్తితో రాంరెడ్డి 'ముల్లుగర్ర' పేరుతో దళిత సంఘీభావ కవితా సంపుటిని ప్రచురించాడు.

"రండి

కాస్త సిగ్గుపడదాం

ఇన్నాళ్లూ మనల్ని క్షమిస్తూ వచ్చిన

ఆ దళితుడి కాళ్లమీదపడి కన్నీళ్లతో కడుగుదాం"

అని దళితుల పట్ల అగ్రకులాలు ప్రవర్తించిన తీరుకు పశ్చాత్తాపపడుతూ రాంరెడ్డిగారు ఈ కవిత రాశారు. దళిత కవిత్వంలో ఇంకా బలమైన దళిత సంఘీభావ కవిత్వం రావలసి ఉంది.

..................................

## 20. మైనార్టీవాదం, ప్రాంతీయవాదం -పరిచయం, నేపథ్యం, ప్రధానాంశాలు

ప్ర. 1. మైనారిటీ వాదాన్ని గురించి తెల్పండి.

జ|| తెలుగు సాహిత్యంలో ముస్లిం, క్రిష్టియన్ రచయితలు ఎంతో కాలంగా రచనలు చేస్తున్నారు. 'వజీర్ రహ్మాన్' అనే ముస్లిం రచయిత తన చిక్కనైన కవిత్వంతో పాఠకుల్ని పరవశింపజేశారు. వీరి కవిత్వంలో ఎక్కడా తాను మైనారిటీ అనే భావన కన్పించదు.

'వజీర్ రెహ్మాన్' సోదరుడైన 'ఇస్మాయిల్' ఇంకా 'స్మైల్', 'దేవీప్రియ' 'సుగమ్బాబు', 'కౌముది' వంటి సీనియర్ కవులు తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేశారు. వీరి కవిత్వంలో కూడా ముస్లింఛాయలు కన్పించవు. కాని మొట్టమొదటిసారిగా 'ఖాదర్ మొహియుద్దీన్' 'పుట్టుమచ్చ' అనే కవితలో విన్పించిన మైనార్టీల స్వరం తెలుగు సాహితీలోకాన్ని కుదిపివేసింది. ఈ దీర్ఘకవిత మైనారిటీల మనోభావాల్ని తెలియజేసింది. ఆత్మగౌరవంతో బ్రతకటానికి అనువైన అస్తిత్వం కల్పించాలని డిమాండ్ చేసింది. హిందూత్వశక్తులు తమ పునాదిని పటిష్టం చేసుకునే కాలంలో ఈ కవిత వచ్చింది. ఇది సాహిత్యరంగంలోని వారినే కాకుండా ఇతరేతర వర్గాల వారిని, మైనారిటీల కవుల్ని, రచయితల్ని మేల్కొలిపింది. సాహిత్యంలోనూ, సమాజంలోనూ తమ ఉనికిని చాటుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తు చేసింది. దేశంలో హిందూత్వశక్తులు బలపడే క్రమంలో మతఛాందసవాదం విస్తరించి చివరకు బాబ్రీ మసీదు విధ్వంసానికి దారితీసి, మైనారిటీల మనుగడను ప్రశ్నార్థకం చేసింది. 1922 డిసెంబరు 6 మైనారిటీల్లో ఉన్న భయాందోళనల్ని

తీవ్రతరం చేసింది. 1990లో ఆరంభమైన మైనారిటీ స్పృహ డిసెంబరు 6, 1992 తర్వాత మైనారిటీ కవిత్వంగా ఒక స్పష్టమైన నిర్దిష్టతను సంతరించుకుంది. మైనారిటీ చైతన్యంగా, వాదంగా రూపుదిద్దుకుంది.

వజీర్ రెహ్మాన్, ఇస్మాయిల్ లాంటి కవులు తమ కవిత్వంలో మైనారిటీ స్పృహను వ్యక్తం చేయకపోవటానికి కారణం తెలియదు. హైదరాబాదులోగాని, ఆంధ్రాలోని మరే ప్రాంతాల్లోనైనా గాని, హిందూ ముస్లింల మధ్య ఘర్షణ జరిగిన దాఖలాలు ఎక్కడా కన్పించవు. చారిత్రకంగా చూచినా మొదటినుంచి మైనారిటీలు, హిందువులు కలసి, మెలిసియే జీవించారు. వారి మధ్య మత విద్వేషాలు జరుగలేదు. అందువల్ల ముస్లిం

కవులు తాము మైనారిటీలమన్న స్పృహను వ్యక్తం చేయలేదు. అయితే 1985 తర్వాత ఛాందస వాదానికి ఇక్కడ పునాదులు పడ్డాయి. దాన్ని గుర్తించిన ఖాదర్ 'పుట్టుమచ్చ' దీర్ఘకవితలో మైనారిటీల స్వరం విన్పించారు. తర్వాత వచ్చిన కవులు అతనిని అనుసరించారు. ఈ నేపథ్యం తెలుగు కవిత్వంలో మైనారిటీ వాదం బలమైన శక్తిగా రూపొందటానికి దారితీసింది. ముస్లిం

కవులు, రచయితలు తమ గురించి తాము రాసుకోవలసిన అవసరాన్ని గుర్తించారు. మొట్టమొదట ముస్లింవాద కవిత్వం దళితవాడ కవిత్వంలో భాగంగానే కొనసాగింది. దళితవాదంలో భాగంగా వచ్చిన 'చిక్కనవుతున్న పాట' 'పదునెక్కిన పాట', 'చిత్తరువు' వంటి కవితా సంపుటాల్లో ముస్లింవాద కవిత్వం కన్పిస్తుంది. తొలిరోజుల్లో అణచివేతకు, వివక్షతకు గురియగుతున్న వర్గాల ఏకకంఠతకు చిహ్నంగా దళితవాదం ఉండేది. కనుకనే ముస్లింకవులు, రచయితలు కూడా దళితవాదంలో భాగస్వాములయ్యారు. కానీ దళితవాదం ఒకవాదంగా ధోరణిగా బలపడే క్రమంలో మైనారిటీ వాదం దానికి దూరమై స్వయంప్రతిపత్తి కల్గినవాదంగా రూపాంతరం చెందింది.

డిసెంబరు 6 తర్వాత ముస్లింలను దేశద్రోహులుగా పరాయివాళ్లుగా చిత్రించే ధోరణి పెరిగింది. వాళ్ల అస్తిత్వం, సంస్కృతీ సంప్రదాయాలు ప్రశ్నార్థకమయ్యాయి. తమ దేశభక్తిని శంకించే దుస్థితికి

ముస్లింలు ఖిన్నులయ్యారు. తీవ్రమైన అభద్రతకి, అసహనానికి గురియగుచున్న తమ జాతి ఆందోళనను ముస్లిం కవులు తమ రచనల ద్వారా బలంగా వ్యక్తం చేశారు. నా దేశంలో నేనొక కాందిశీకుడ్ని. స్వదేశంలోనే పరాయివానిగా బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడింది అని భాదర్ నిరసన స్వరంతో ప్రశ్నించారు.

"అప్పుడెప్పుడో దండెత్తి వచ్చిన నాపూర్వీకుడి ఖడ్గం.

ఇప్పుడు నాపౌరసత్వం ప్రక్కన ప్రశ్నగా నిలిచిందా ?

నాదేహం మీద పర్షియస్ మట్టిరేణువులింకా ఉన్నాయా

ద్రవిడ హంతకుడా

నా రంగు చూడు

వింధ్య చిహ్నాలలో పుట్టిన ఆరవర్ణాన్ని"

అని సికిందర్ తమ గురించి చెప్పాడు.

"ఈ దేశపటాన్ని చుట్టచుట్టి నీకింద పెట్టుకోవడానికి

అది నీ అయ్య జాగీరుకాదు

అంగట్లో దొరికే కుంకుమ కాదు దేశభక్తి

తెగిన దేశ సరిహద్దు రేఖని

అతికిన వీరజవానుల్లో మేమూ ఉన్నాం"

అంటూ ఒక మైనారిటీ కవి తన అస్తిత్వాన్ని ప్రకటిస్తున్నాడు. మైనారిటీ కవిత్వంలో భిన్నమైన కోణాలు ఎన్నో ఆవిష్కృతమయ్యాయి.

1. మైనారిటీలుగా తమపై వివక్షను, అణచివేతను నిరసించటం.

2. ఇస్లాం పేరిట మతపెద్దలు, మైనారిటీ నాయకులు అనుసరిస్తున్న అవకాశవాద ధోరణిని వ్యతిరేకించటం.

3. ఇస్లాంలో మహిళల్ని అవమానించే ధోరణిని తిరస్కరిస్తూ సంస్కరణల్ని ఆశించటం అనే మూడు కోణాలు ముస్లింవాద కవిత్వంలో కన్పిస్తాయి. తొలుత ముస్లింకవి ఆత్మ న్యూనతాభావంతో తన ఉనికిని గుర్తించుమంటూ మొరపెట్టుకునే రీతిలో కవిత్వం వ్రాశారు. కాని తర్వాత ప్రశ్నించటం, నిరసించటం, ధిక్కరించటం కూడా అలవాటు చేసుకున్నారు.

"ఇక ఎలాంటి కుట్రా చెల్లుబాటు కాదు

ఏ నీతి నన్ను 'డెమోక్లీస్' చెయ్యదు

ఇప్పుడు నేను ఇమామ్ను రసూల్ను"

అని 'యాకూబ్ పాషా' ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

"రాయి పడితే చాలు

తలముడుచుకునే తాబేలును కాలేను

ఈ పాకుడు బండలపై కూడా అడుగు తప్పకుండా సాము చెయ్యగలను"

అని 'గఫార్' అంటాడు. ఈ చైతన్యమే మైనారిటీవాద కవిత్వానికి బలం చేకూర్చింది.

"ఈ మట్టి నీ ఒక్కడి దేహమేనని బుకాయిస్తూ ఈ భూమిపై నా అస్తిత్వాన్నే

అనుమానిస్తున్నంత కాలం అప్ అప్ కచ్చితంగానే కాందిశీకుణే”

అని 'గౌస్' అనే మరొక కవి అంటాడు. ఎవరెన్ని కుట్రలు చేస్తున్న

"విభజించి పాలించే నా శత్రువుల్లారా నన్నెవ్వరూ రెండుగా చీల్చలేరు

నా కనుపాపల్ని ఎవరూ పేల్చలేరు"

అని అఫ్సర్ తన దృక్పథాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మైనారిటీ కవులు తమ నేతల్లోని ఆధిపత్య ధోరణిని, అవకాశవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పదవులకు అమ్ముడు పోయేవారి తత్త్వాన్ని నిరసించారు. ముస్లింలలో ఆడవాళ్లే కాకుండా మగవాళ్లు కూడా మహిళల అణచివేతకు దారితీసే సంప్రదాయాల్ని వ్యతిరేకిస్తున్నారు. 'మహిళలు పడకగదుల్లో కాలిపోతున్న అగరువత్తులేనా' అని ప్రశ్నిస్తున్నారు.

"నీ జీవితకాలపు చీకటిదేహం సాక్షిగా

నాకు అర్థంకాని చూపులు విసిరే ఆ రెండు కాళ్ల మీద

ఎవరో కప్పిన సెహరా సాక్షిగా

నువ్వెప్పుడైనా ఎదురుపడితే

నేను గుర్తుపట్టగలిగేది కేవలం నీ రెండు కళ్లను మాత్రమే"

అన్న 'ఖాజా' స్వరంలోని విషాద తీవ్రత పాఠకుడ్ని చలింపజేస్తుంది.

"ఈ క్షణమే

నా నిశ్శబ్దాన్ని మీకు బదలాయిస్తున్నా

బురఖా దుపట్టాల్ని

పీలికలుగా చేసి నీ మీదికి విసిరేస్తున్నా

కలిపి బొంతకట్టుకొని పొర్లుకో"

అని 'షాజహానా' నిరసనను వ్యక్తం చేస్తుంది. ఈ విధంగా ముస్లిం స్త్రీవాదకవిత్వం ఒక క్రొత్తస్వరాన్ని సంతరించుకుంది. మైనారిటీలకు చెందిన మహిళలే కాకుండా వారికి సంఘీభావంగా మగవాళ్లు కూడా ఈవిధమైన కవిత్వం రాశారు..

మైనారిటీ కవిత్వం 1990 నుంచే వచ్చినప్పటికీ డిసెంబరు 6, 1992 తర్వాత మరింత పదునెక్కింది. బాబ్రీమసీదు విధ్వంసం నేపథ్యంలో చాలామంది ముస్లింకవులు, ముస్లిమేతర కవులు పదునైన కవిత్వం రాశారు. గుజరాత్లో జరిగిన మారణకాండ మైనారిటీ కవుల్ని పెద్దయెత్తున కదిలించింది. ఈ నేపథ్యంలోనే హనీఫ్ 'ముకౌటా' 'అలి'జలయ్' కవితా సంపుటాలు వచ్చాయి. మైనారిటీవాదం బలపడ్డాక దేవీప్రియలాంటి కవులు ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం, గుజరాత్ సంఘటనలకి చలించిపోయి చైతన్యవంతమైన కవిత్వం రాశారు. ఈ సమయంలోనే ఇక్బాల్చంద్ 'బ్లాక్వాయిస్', 'ఆరోవర్ణం' ఖాజా 'ఫత్వా కవితా సంకలనాలు వచ్చాయి. ముస్లిం మహిళల్లో షాజహానా, మహెజబీన్, షెహనాజ్, షంషాద్, జవేరియా వంటి రచయితలు ముస్లిం మహిళల జీవన పార్శ్వాల్ని వ్యక్తీకరిస్తున్నారు.

కవిత్వభాష శిల్పం రీత్యా చూచినప్పుడు మైనారిటీ కవిత్వం తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేసిందని చెప్పవచ్చు. సరికొత్త ఉపమానాలు, పలుకుబడులు కవిత్వంలో చేరాయి. ఖాదర్, గౌస్, మహమూద్, అబ్బాస్, షాజహానా, అన్వర్, గఫార్ మొదలైన వారి కవిత్వంలో చిక్కదనం, మళ్లీ మళ్లీ చదివించే శిల్పసౌందర్యం తొణికిసలాడుతుంది.

మైనారిటీ కవులు తమది మైనారిటీ కవిత అనిపించుకోవటం కోసం కావాలని ఉర్దూ పదాల్ని విస్తారంగా ఉపయోగించారు. అవసరం లేనిచోట కూడా ఉర్దూపదాల్ని శీర్షికలుగా ఉంచే ధోరణి అలవడింది. ఈ ధోరణికి స్కైబాబా అవగాహనా రాహిత్యమే కారణం. మైనారిటీ వాద కవిత్వంలో ముస్లింలదే ప్రధాన పాత్రగా కన్పిస్తుంది. దళితులు ఎప్పటినుంచో కవిత్వం వ్రాస్తున్నా, వీరిలో కొందరు దళిత క్రిష్టియన్లుగా ఉంటే, మరికొందరు దళితులుగానే తమ అస్తిత్వాన్ని చాటుకున్నారు. గుర్రం జాషువా దళితుడే కాక క్రిష్టియన్ కూడా. క్రిష్టియన్లను అవమానించే ధోరణిని ప్రశ్నించిన గుంటూరు ఏసుపాదం, సతీష్ చందర్, కలేకూరి ప్రసాద్, ఇంకా మరికొందరు దళితకవులు క్రిష్టియన్ మైనారిటీల స్పందనలకు కవిత్వరూపమిచ్చారు. ముస్లిం జనాభాతో పోల్చుకుంటే క్రిష్టియన్ జనాభా చాలా తక్కువ. అందువల్లనే మైనారిటీ అస్తిత్వవాదం గురించి ప్రశ్నిస్తే ముస్లింల కవిత్వం గుర్తుకు వస్తుంది. ఇక్కడ మైనారిటీవాదం కేవలం అస్తిత్వ ప్రకటనకు

మైనారిటీల హక్కుల ప్రస్తావనకు పరిమితం కాలేదు. సామాజిక జీవనంలో లౌకిక, ప్రజాస్వామిక విలువలు పాదుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది. కనుకనే మైనారిటీ కవిత్వం తెలుగు కవితా స్రవంతిలో విడదీయరాని భాగమైంది.

………………………………

ప్ర. 1. ప్రాంతీయవాదాన్ని గూర్చి వివరించండి.

211 తెలుగు సాహిత్యంలో కులం, మతం, జెండర్, ప్రాంతం మొదలైనవి ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి. దాదాపు ముప్పైసంవత్సరాల క్రితం చాగంటి సోమయాజులు గారు కళింగాంధ్ర ప్రజల జీవనం ఆధారంగా "కళింగాంధ్ర కథలు" అనే కథా సంకలనాలను తీసుకొచ్చారు. ఆ తర్వాత సీమకథలు' వచ్చాయి. కళింగాంధ్రకథలు, సీమకథలు కేవలం ఆయా ప్రాంతాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించాయి. కథల్లో ఆయా ప్రాంతాల జీవితం ప్రతిఫలించింది. ఇందులో ప్రాంతీయ స్పృహ ఉంది. ప్రాంతీయవాదం లేదు. పైగా ఇవి రెండు ఒకటికాదు. ప్రాంతీయవాదంలో ప్రాంతీయస్పృహ ఉంటుంది. ప్రాంతీయ స్పృహలో కేవలం ఆయా ప్రాంతాల జీవితం మాత్రమే ప్రతిఫలిస్తుంది. ప్రాంతీయవాడ పరిధి చాలాపెద్దదిగా ఉంటుంది. ప్రాంతీయస్ప్పృహలో తమను అణచివేస్తున్న ఆధిపత్య వర్గాలపై ఆగ్రహం ఉంటుంది. పాలకులు, వలసవాదులు చూపిస్తున్న వివక్షపై నిరసన ఉంటుంది. తమ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలపై ఆత్మగౌరవంతో కూడిన అభిమానం ఉంటుంది.

తెలుగులో ఇతర వాదాల మాదిరిగానే తొలుత కవిత్వంలోనే ప్రాంతీయ అస్తిత్వవాదం రూపుదిద్దుకుంది. ఆంధ్రప్రదేశ్లో తెలంగాణా, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలున్నాయి. కోస్తాంధ్ర తప్ప మిగిలిన మూడు ప్రాంతాలు నిర్లక్ష్యానికి, వివక్షకు గురి అయ్యాయి. అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలుగా మిగిలిపోయాయి. వీటిల్లో తెలంగాణా ప్రాంతం బాగా వెనుకబడిపోయింది. సామాన్యంగా ఆర్థికంగా, సాంస్కృతికంగా ఇతరుల ఆధీనంలో ఉన్న ప్రాంతాలు స్వయంప్రతిపత్తి కోసం డిమాండ్ చేస్తాయి. తమ ప్రాంతంపై తమకే అధికారం ఉండాలని ఆశిస్తాయి. ఈ సందర్భంలో జరిగే ఆందోళనలు ప్రాంతీయ ఉద్యమాలు అవుతాయి. తెలుగులో

ఇలాంటి ఉద్యమాలకు తెలంగాణావాసులే శ్రీకారం చుట్టారు. 1969లో ఆరంభమై ఆగిపోయిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమచరిత్ర గాని, దాని ప్రకంపనలు గాని సాహిత్యంలో పెద్దగా రికార్డు కాలేదు. విప్లవ సాహితీ ఉద్యమం కారణంగా తెలంగాణా ఉద్యమ ప్రభావం తరువాత కాలాన కనుమరుగైంది.

సాహిత్యం :- "1990ల మధ్య కాలంలోనే తెలంగాణా కవి ప్రాంతీయ స్పృహను ప్రబలంగా వ్యక్తం చేయటం కనిపిస్తుంది. ఎవరి అనుభవాల్ని వాళ్లే రాయాలన్నవాదం అప్పటికే వచ్చింది. స్త్రీలు, దళితులు, మైనారిటీలు తమ పరిధిలో తాము ఏకమవుతున్నారు. ఇదే సమయాన ప్రాంతీయ స్పృహ కూడా కొత్తగా రాసేవారికి ఊతమిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలంగాణా వివక్షకు లోనయింది. ఇది గత పది, పన్నెండేళ్ల కాలంలో మరింత తీవ్రమైంది. కోస్తా నుంచి తెలంగాణాకు వలస వచ్చినవారి సంఖ్య పెరిగింది. వారు తెలంగాణాలో విద్యాలయాల్ని స్థాపించడం రాయల్ ఎస్టేట్ వంటి లాభదాయకమైన వ్యాపారాలలోనికి చొచ్చుకురావటం, తొంభైల ఆరంభం నుంచి పెరిగింది. వారి చొరబాటు కారణంగా ఈప్రాంత వాసుల్లో అభద్రతా భావం నెలకొంది. తమ ఉనికి ప్రశ్నార్థకమైందన్న సంగతి వారు గ్రహించారు. మరోవైపున వ్యవసాయంలో వాణిజ్య ధోరణులు ప్రబలాయి. ఇంకోవైపున భాషా సంస్కృతులు సైతం అపహాస్యానికి లోనయ్యాయి, మొత్తంగా ఈ ప్రాంత సామాజిక, సాంస్కృతిక జీవితం విచ్ఛిన్నమైంది. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యం, గ్లోబలైజేషస్ క్రమం తెలంగాణా వాసుల్ని మరింత దెబ్బతీశాయి. వ్యవసాయాలు కుప్ప కూలాయి. బతుక్కి భద్రత లేకుండా పోయింది. నిరుద్యోగం విశ్వరూపం ధరించింది. ఉపాధి అవకాశాలు క్షీణించాయి. ఈ వాస్తవాలు తప్పించుకోవడం ఏ కవికీ సాధ్యంకాదు. తన నేలతల్లి ప్రమాదపుటంచుల్లో ఉన్న వాస్తవం కళ్లముందు స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రత్యేక తెలంగాణా నినాదం తిరిగి తలెత్తింది. తమ ప్రాంతం మీద తనకే అధికారం ఉండాలన్న ఆకాంక్ష ఏర్పడింది. ఇది ఆందోళనగా, ఉద్యమంగా, రూపాంతరం చెందింది. ఈ నేపథ్యమే ఇక్కడ ప్రాంతీయ అస్తిత్వ వాదానికి పునాది వేసింది."

విప్లవ కవిత్వంలో ప్రాంతీయ ఛాయలు:- విప్లవ సాహిత్యం తర్వాత దళిత, మైనారిటీ అస్తిత్వవాదాలు ఇక్కడ పాదుకున్నాయి. ఈ వాదాలు ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వ సృష్టికి మార్గం చూపాయి. విప్లవ సాహిత్య స్రవంతిలోనూ ప్రాంతీయ స్పృహ వ్యక్తమైంది. ముఖ్యంగా తెలంగాణాకు చెందిన విప్లవకవుల్లో ఈ స్పృహ వ్యక్తమైంది. నందినీ సిధారెడ్డి కవిత్వంలో తెలంగాణా ప్రతీకలు, వ్యక్తీకరణ కన్పిస్తాయి. గద్దర్ పాటల్లో ఆయన చూపిన ప్రాంతీయ స్పృహ కవిత్వంలో ఇతరులకు ప్రేరణగా నిలిచింది విప్లవ కవిత్వం తర్వాత వచ్చిన దళిత కవిత్వంలో ప్రాంతీయ స్పృహకు ఆనవాళ్లు కన్పిస్తాయి. నల్లగొండ నుంచి 'వచ్చిన 'బహువచనం', 'మేమే', 'మొగి' సంకలనాల్లో ప్రాంతీయ అభివ్యక్తి స్పష్టంగా ఉంది. తెలంగాణాలో కులవృత్తులకు దూరమవుతున్నవారు ఎదుర్కొంటున్న సంక్షోభం ఉంది. ఈవిధంగా దళితవాద కవిత్వంలోనే ప్రాంతీయతకు సంబంధించిన పునాదులు గోచరమౌతాయి.

ప్రాంతీయతే ప్రాణం:- సాహిత్యానికి ప్రాంతీయత ప్రాణమన్న స్పృహకి ఈ అస్తిత్వవాదమే ప్రేరణగా నిలిచింది. తమ ఆత్మగౌరవ ప్రకటనగా, అస్తిత్వవాద ప్రకటనగా కవిత్వం వెల్లువెత్తటం దాశరథి కాలంనుంచే ఆరంభమైంది. కొన్ని దశాబ్దాల కిందటే కాళోజీగారు తన తల్లిభాషలో కవిత్వం రాశారు. నిజామాబాద్కు చెందిన పంచరెడ్డి లక్ష్మణ, దేవరాజు మహారాజు, తెలిదేవర భానుమూర్తి, టి.కృష్ణమూర్తి యాదవ్ మొదలైనవారు ఇక్కడి మాండలికంలో కవిత్వం రాశారు. వీరి తర్వాత ఇతర జిల్లాల కవులు కూడా తమ ప్రాంత మాండలికంలో కవిత్వం రాస్తూ వచ్చారు. ఇప్పుడు తెలంగాణ కవులందరూ తమతల్లి భాషలోనే కవిత్వం రాస్తున్నారు. ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వంలో నిఖార్సయిన తెలంగాణా ప్రజల జీవితాన్ని కవిత్వంగా మలచటంలో ఈ ప్రాంతపు కవులు సఫలీకృతులయ్యారు.

తెలంగాణా పల్లెలో ఒకవైపు నిర్బంధం, మరొకవైపు ఎన్కౌంటర్లు, ఆకలిచావులు మొదలయ్యాయి, చెరువులు ఎండిపోయాయి. ప్రక్కగుండా కృష్ణా, గోదావరీ నదులు ప్రవహిస్తున్నా వంటపొలాలు ఎడారులుగా మారాయి. వ్యవసాయం, కులవృత్తులు దెబ్బతిన్నాయి. చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడసాగారు. గ్రామాలు

పరాధీనాలయ్యాయి. తమ ఊళ్లో నుంచి తమనే వెళ్లగొట్టే పరిస్థితులు నెలకొన్నాయి.. ఇటువంటి దుస్థితిలో ఈ నేలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దటానికి ఇప్పటికైనా సిద్ధం కావాలని కవులు చెబుతున్నారు. ఆత్మగౌరవంతో కూడిన జీవితం సాగించాలన్న ప్రబల కాంక్షను వ్యక్తం చేస్తున్నారు, అంబటి సురేంద్రరాజు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి సంపాదకత్వంలో, తెలంగాణా సాంస్కృతిక వేదిక ద్వారా వెలువడిన 'మత్తడి' కవితా సంకలనం సూరేళ్ల తెలంగాణా వైభవానికి, వైవిధ్యానికి దర్పణంగా నిలిచింది.

గ్లోబలైజేషన్ ప్రభావం :- దేశంలో గ్లోబలైజేషన్ ప్రభావం కారణంగా విభిన్న వృత్తులకు చెందిన కుమ్మరులు, స్వర్ణకారులు, వడ్రంగులు, చేనేత కార్మికులు, ఇంకా అనేకమంది ఇతరులు ఉపాధిని కోల్పోయారు. ఇది పట్టణాల్లో బతుకుతున్న వారి జీవితాల్లోనూ చిచ్చును రగిలించింది. వీటికి కవిత్వరూపం ఇవ్వటం ప్రాంతీయ అస్తిత్వవాడు. కవిత్వంలో కీలకమైన అంశంగా మారింది. గ్లోబలైజేషన్కు సమాధానం స్థానికత అన్ని స్పృహ పాదుకుంది. తమ స్థానిక ప్రాంతాల్లోని మూలాల్ని కాపాడుకోవటం ద్వారా.. గ్లోబలైజేషన్ వల్ల వాటిల్లే ముప్పును ఎదుర్కోవటం అవసరమన్న అవగాహన ఏర్పడింది. ఈ అవగాహన నుంచే గోరేటి వెంకన్న పాటలు వచ్చాయి. ఈ పాటల్లో తెలంగాణా ప్రాంతీయాత్మ ఆవిష్కారమైంది.

ప్రాంతీయ కవిత్వానికి మలుపు పొక్కిలి :- ప్రాంతీయ అస్తిత్వానికి సంబంధించిన స్పృహ తొలిసారిగా 1996లో జూలూరు గౌరీశంకర్ రాసిన 'నా తెలంగాణా అనే దీర్ఘకవితలో కన్పిస్తుంది. గౌరీశంకర్ ప్రాంతీయ స్పృహను ఒక ఉద్యమంగా ముందుకు తీసుకు వెళ్లటానికి తీవ్రంగా కృషిచేశారు. ఈ క్రమంలో 'పొత్తిలి' అనే ఒక బృహత్తర కవితా సంకలనాన్ని తీసుకువచ్చారు. గత పదేళ్లనుంచి తెలంగాణాలో దాదాపు వందమందికి పైగా కవులు ప్రాంతీయ స్పృహతో కవిత్వం రాస్తున్నారు. ఈ కవుల ఆకాంక్షలకి, అభివ్యక్తికి 'పొక్కిలి' కవితా సంకలనం ప్రతిఫలంగా నిలిచింది. ఈ సంకలనం 129 మంది తెలంగాణా కవుల కవిత్వానికి ప్రాతినిధ్యం వహించింది. 1934లో సురవరం ప్రతాపరెడ్డి 354 మంది తెలంగాణా కవులతో గోలకొండ కవుల సంచికను తీసుకువచ్చారు. నాటి నుంచి నేటి వరకు ఇంత పెద్ద ఎత్తున మరో తెలంగాణా సంకలనం రాలేదు.

సంవత్సరాల తర్వాత 'పొక్కిలి' సంకలనం వచ్చింది. 129 మంది తెలంగాణా కవులు కంఠ స్వరాలకు స్థానం ఇచ్చింది. ఈ కవిత్వంలో ఇతరేతర వాదాల కన్నా ప్రాంతీయ స్పృహనే ప్రధానంగా ఉంది.

భాషను అవహేళన చేయటాన్ని వృత్తుల్ని కించపరచటాన్ని, అత్యాభిమానాన్ని చెబు తీయటాన్ని ప్రశ్నిస్తూ కవులు స్పందించారు. తమ ఉనికిని, ఆత్మగౌరవాన్ని చాటుతో కవిత్వం రాశారు. ఆత్మన్యూనతా భావాన్ని వదిలించుకొని తమ గురించి తాము సగర్వం" చాటుకుంటున్నారు. ఇలాంటి విలక్షణమైన కంఠస్వరాలు 'పొక్కిలి' లో కన్పిస్తాయి. కాలం తర్వాత వచ్చిన ఈ సంకలనం ప్రాంతీయ ఆస్తిత్వవాద కవిత్వంలో ఒక మైలురాయిగా నిలిచింది.

ప్రాంతీయ సంస్కృతికి పట్టం :- కవిత్వంలో విభిన్న మార్గాల్లో పయనించిన సిద్ధార్థ, సీతారాం, ప్రసేస్ వంటి కవులు తెలంగాణా గురించి కవిత్వం రాశారు. దళితవాదంలో విలక్షణమైన కంఠస్వరాల్ని విన్పించిన వేముల ఎల్లయ్య, బెల్లియాదయ్య, చిత్రంప్రసాద్ లాంటి వారు ఏకకాలంలో ప్రాంతీయ స్పృహతో కవిత్వం రాశారు. జూకంటి జగన్నాథం తన 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' వాస్కోడిగామా, కామ్, సంకలనాల్లో గ్లోబలైజేషన్ తెచ్చిపెట్టే ముప్పును గురించి చెప్పారు. మార్కెట్ ఎకానమీ మానవ సంబంధాల్ని దెబ్బతీసిన విధానాన్ని కవిత్వీకరించారు. తెలంగాణాలోని కచ్చురాలు, డొంకదారులు, పొక్కిలయిన గ్రామాల వేదన, ఎండిన చెరువుల మౌనఘోష, వలసపోతున్న వారి గుండె రొద, తమ ఆనవాళ్లను కోల్పోతున్న కళాకారుల వేదన ఈ కవిత్వంలో సహజసిద్ధంగా వ్యక్తమయ్యాయి.

దీర్ఘకవితల్లో తెలంగాణా :- తెలంగాణా సాయుధ పోరాటం మీద తొలుత దీర్ఘకావ్యాలే ఎక్కువగా వచ్చాయి. తెలంగాణాతో సంబంధం లేని ఆరుద్ర తెలంగాణా సాయుధ పోరాటం నేపథ్యంగా 'త్వమేవాహం' రాశారు. సోమసుందర్ 'వజ్రాయుధం' రాశారు. యం. వెంకట్ 'వర్ణి', సుంకిరెడ్డి నారాయణరెడ్డి 'దాలి' మాదయ్య 'ఎర్కోషి' అల్లం నారాయణ 'ఒకయాది 'ఒకమనాది', 'అఫ్సర్ తెలంగాణా 2002', కాసుల ప్రతాపరెడ్డి 'గుక్క', వంటి దీర్ఘకవితలు ఈ ప్రాంత భౌగోళికతను, జీవితాన్ని, సౌందర్యాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడి జీవితంలోని సంస్కృతీ సంప్రదాయాలు

కూడా వీరి కవిత్వంలో వ్యక్తమయ్యాయి. యెన్నం ఉపేందర్. 'కర్రు పుట్టింది', అన్నవరం దేవేందర్ 'మావూరు', దాస్యం లక్ష్మయ్య 'తండ్లాట', చెమస్ 'ఆవిష్కరించని దృశ్యం', నందిని సిధారెడ్డి 'ఒకబాధగాదు' లాంటి కవితా సంకలనాల్లో సిసలైన తెలంగాణా కవిత్వముంది. నాళేశ్వరం శంకరం, సిదార్థ, కందుకూరి దుర్గాప్రసాద్, పప్పుల రాజిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, పగడాల నాగేందర్, కందుకూరి రమేష్బాబు, బెల్లంకొండ రవికాంత్, వేముగంటి మురళీకృష్ణ, చెరుకు సుధాకర్ మొదలైనవారు వాడుకభాషలో కవిత్వం రాస్తున్నారు.

ప్రాంతీయ వాదం - కథాసాహిత్యం:- ప్రాంతీయవాద దృక్పథంతో అనేకమంది రచయితలు కథలు రాశారు. ప్రాంతీయవాదం వచ్చిన తర్వాత విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు తెలంగాణా కథల సంకలనాన్ని తీసుకువచ్చారు. బి.యస్.రాములు, కాలువ మల్లయ్య, అల్లం రాజయ్య, బోయ జంగయ్య, పప్పుల నరసింహం మొదలైనవారు తెలంగాణా మాండలికంలో అనేక కథలు రాశారు. పులుగు శ్రీనివాస్, ముదిగంటి సుజాతారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, జూకంటి జగన్నాథం, గీతాంజలి మొదలైనవారు తెలంగాణా ప్రజల జీవన విధానాన్ని ఆయా కథల్లో చక్కగా చిత్రించారు.

ప్రాంతీయవాదం నవలలు :-తెలంగాణా వాదాన్ని దృష్టిలో పెట్టుకొని బి.యస్.రాములు, వేముల ఎల్లయ్య, పులుగు శ్రీనివాస్, ముదిగంటి సుజాతారెడ్డి మొదలైనవారు నవలలు రాశారు. అంపశయ్య నవీన్ తెలంగాణా జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకొని రెండు నవలలు రాశారు. కాలువ మల్లయ్య భూమి పుత్రుడు, సాంబయ్య, చదువు, మాట్లాడే బొమ్మలు, బ్రతుకు పుస్తకం వంటి నవలలు రాశారు. వీరి 'బ్రతుకు పుస్తకం' నవలకు అంతర్జాతీయ పురస్కారం లభించింది. ఇటీవల వచ్చిన రాయలసీమ కథల్లోనూ, నవలల్లోనూ ప్రాంతీయవాదం బాగా కన్పిస్తుంది. తెలుగు సాహిత్యం సుసంపన్నం కావటానికి ప్రాంతీయవాదం ఎంతగానో దోహదం చేస్తుంది.

.....................